www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 18 No | విజయవాడ, శనివారం 19 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00

హ్యాపీనెస్ట్ రెండో దశకు ఆమోదం

సిఆర్‌డిఎ సమావేశంలో సిఎం

2



వన్డే సిరీస్ మనదే

ఆసీస్ గడ్డపై వరుస విజయాలు

కంగారెత్తించిన చాహల్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా సంపూర్ణ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ పర్యటనలో భాగంగా తొలుత మూడు టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసిన టీమిండియా ఆ తర్వాత టెస్టు సిరీస్‌ను రికార్డు స్థాయిలో 2-1తో కైవసం చేసుకుంది. శుక్రవారం నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆతిథ్య జట్టును ఏడు వికెట్ల తేడాతో ఓడించి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను 2-1తో రికార్డుస్థాయిలో భారత్ సొంతం చేసుకుంది. ఓ పటిష్ఠ జట్టుపై విదేశాల్లో టీమిండియా అన్ని సిరీస్‌లను కోహ్లి నాయకత్వంలోనే అందుకోవడం అద్భుతం. చివరి వన్డే మణికట్టు మాంత్రికుడు యజ్వేంద్ర చాహల్ 6/42 చెలరేగడంతో ఆసీస్48.4 ఓవర్లకు 230 పరుగులు చేసింది. ఛేదనలో మహేంద్రసింగ్ ధోనీ (87), కేదార్ జాదవ్ (61) అజేయంగా నిలిచారు. నాలుగో వికెట్‌కు 116 బంతుల్లో 121 పరుగుల భాగస్వామ్యం అందించి టీమిండియాకు సిరీస్ విజయాన్ని సంపాదించిపెట్టారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చాహల్‌కు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ మహేంద్రసింగ్ ధోనీకి లభించాయి.

12

దేశ భద్రతపై రాజీ

రాఫెల్ ఒప్పందంలో మోడీ సర్కారుపై ఏచూరి, చిదంబరం

భారీ ధరలకు ప్రధాని నిర్ణయమే కారణం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వయంగా తీసుకున్న నిర్ణయమే రాఫెల్ యుద్ధవిమానాల ధరలు అనూహ్యంగా పెరగడానికి కారణమంటూ తాజాగా వచ్చిన వార్తలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. 126 యుద్ధవిమానాలకు బదులుగా ఎగరటానికి సిద్ధంగావున్న 36 విమానాలనే కొనుగోలు చేయాలని ప్రధాని మోడీ నిర్ణయించారని, ఫలితంగా ఒక్కోదాని ధర 41.42శాతం పెరిగిందని ప్రముఖ ఆంగ్లపత్రిక 'ది హిందూ' శుక్రవారం ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో కేంద్ర ప్రభుత్వంపైనా, నరేంద్రమోడీ ఏకపక్ష నిర్ణయంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. సైన్యానికున్న అవసరాలేమిటి? విమానాల సంఖ్యను ఎందుకు కుదించారు? అంత హడావిడిగా ప్రధాని ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? ఎవరితో సంప్రదించారు? అన్న ప్రశ్నలు తెరవీదకు వచ్చాయి. ఈ ప్రశ్నలకు జవాబియ్యాల్సిన కేంద్ర ప్రభుత్వం 'అన్ని సందేహాలకు ఇప్పటికే సమాధానం ఇచ్చాం.. కొత్తగా చెప్పేదేమి లేదు' అని దాటేసింది. కేంద్ర సర్కారు పెడసర ధోరణి పైనా పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

అస్మదీయుల కోసమే : ఏచూరి





ఎక్కువ ధరకు తక్కువ సంఖ్యలో యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలన్న నిర్ణయం ద్వారా దేశ ప్రయోజనాల కన్నా అస్మదీయుల ప్రయోజనాలకే ప్రధానమంత్రి ప్రాధాన్యత ఇచ్చారని స్పష్టమైందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. తనకు సన్నిహితుడైన ఆశ్రిత పెట్టుబడిదారునికి భారీగా లబ్ధి చేకూర్చడానికి దేశ ప్రయోజనాలను ప్రధాని పణంగా పెట్టారని ఆయన విమర్శించారు. ఈ మేరకు చేసిన ట్వీట్‌లో దేశ భద్రతను పణంగా పెట్టిన ఈ ఒప్పందం ద్వారా ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ నష్టం కలిగిందని తెలిపారు. రాఫెల్ కుంభకోణంపై వాస్తవాలు వెలుగులోకి రావడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణే మార్గమని గతంలో చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. జెపిసి మాత్రమే అధికారులను, మంత్రులను ప్రశ్నించటం ద్వారా వాస్తవాలను రాబట్టగలుగు తుందని, ప్రధాని మోడీ ఈ విచారణకు ఎందుకు నిరాకరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

సంఖ్య ఎందుకు తగ్గించారు? : చిదంబరం



ఎయిర్‌ఫోర్స్‌కు అవసరమైన 126 యుద్ధ విమానాల స్థానంలో 36 విమానాలను మాత్రమే కొనాలని ఎందుకు నిర్ణయించారో కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నేత చిదంబరం డిమాండ్ చేశారు. 'ఎయిర్‌ఫోర్స్‌కు అవసరమైన సంఖ్యలో విమానాలు కొనుగోలు చేయకుండా వాటిని తగ్గించడం ద్వారా దేశ భద్రత విషయంలో మోడీ ప్రభుత్వం రాజీ పడింది' అని ఆయన వ్యాఖ్యానించారు.

కొత్తగా చెప్పాల్సిందేమి లేదు : రక్షణ మంత్రిత్వ శాఖ

తాజా వివాదంపై స్పందించిన రక్షణ మంత్రిత్వ శాఖ 'రాఫెల్ వివాదంలో అన్ని సందేహాలకు గతంలోనే వివరణ ఇచ్చామని, కొత్తగా చెప్పాల్సిందేమి లేదని పేర్కొంది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తాజాగా వచ్చిన ఆరోపణలు వాస్తవవిరుద్ధమని తెలిపింది. '2012 నుండి కొనసాగుతున్న ఈ కార్పొరేట్ యుద్ధం వాయుసేన సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. దేశభద్రను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా ఆ వివాదానికి ముగింపు పలకడం మంచిది' అని పేర్కొంది.

41% అధిక ధరకు రాఫెల్ విమానాలు
ది హిందూ కథనం
8లో

ఇక శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం

కార్యదర్శుల సమావేశంలో సిఎస్ అనిల్ చంద్ర పునేఠ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పుట్టిన కులం, తేదీ, ప్రదేశంలో మార్పు ఉండనందున ఇకపై జీవితాంతం ఉపయోగ పడేలా ఒకేసారి కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం సచివాలయంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో చర్చించారు. ఒక్క ఆదాయ ధృవీకరణకు మాత్రమే మార్పు ఉంటుందని, అది కూడా నాలుగేళ్లవరకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్టిఫికెట్ల జారీ విషయంలో అన్ని శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఇ-గవర్నెన్స్, ఐటి సలహాదారు జె. సత్యనారాయణతో చర్చించి 15 రోజుల్లో ఉత్తర్వులు రూపొందించాలని ఆర్టీజీ సిఇఓ అహ్మద్ బాబుకు సిఎస్ సూచించారు. ఆయా శాఖలతో సంప్రదించి అవసరంలేని వాటికి పోలీస్ వెరిఫికేషన్, ఇతర సర్టిఫికెట్లను తీసివేయాలని, సర్టిఫికెట్ల విషయంలో ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండాలన్నారు. 21నాటికి మంత్రి మండలి ఆమోదించాల్సిన అన్ని ఫైల్స్ సిద్ధం చేయాలని సిఎస్ కార్యదర్శులు, హెచ్‌ఓడిలకు సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టిపెట్టాలన్నారు. ఆయా శాఖలు యుసిలు వెంటనే మిగతా 9లో

కమ్యూనిస్టు ఉద్యమనేత నరసింహయ్య కన్నుమూత



రేపు కర్నూలులో అంత్యక్రియలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు తెలకపల్లి నరసింహయ్య (92) అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శిగా, రైతు, వ్యవసాయ కార్మిక నేతగా ఆయన సుపరిచితులు. ఐద్వా నేతగా ఉన్న ఆయన సతీమణి టిసి లక్ష్మమ్మ కొన్నేళ్ల కిందట మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు. కొద్దికాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన హైదరాబాద్‌లో ఉన్న రెండో కుమారుడు, ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి ఇంట ఉంటూ ఉదయం 7.30 గంటలకు తుది శ్వాస విడిచారు. నరసింహయ్య భౌతిక కాయాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యాలయం ఎంబి భవన్‌కు, అనంతరం కర్నూలులోని కృష్ణానగర్‌లో ఉన్న వారి నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు జరగనున్నాయి. వివరాలు 3లో

'ఆపరేషన్ కమలం' విఫలం



- సిఎల్‌పి సమావేశానికి 76 మంది ఎమ్మెల్యేలు హాజరు

8

సతీష్‌ను విచారించిన సిబిఐ

- ఆయేషా మీరా కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

12

కెసిఆర్‌కు మూడు గిఫ్టులిస్తా



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సిఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులు

- సిఎం చంద్రబాబు
- ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలంగాణ సిఎం కెసిఆర్ తనకు ఒక గిఫ్టు ఇస్తే తాను తిరిగి మూడు గిఫ్టులు ఇస్తానని సిఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో తారకరామ సాగర్, ఎన్‌టిఆర్ గార్డెన్స్, వావిలాల ఘాట్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. తారకరామ సాగర్‌గా నిర్మించిన చెరువులో 36 అడుగుల ఎన్‌టిఆర్ విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అనంతరం అదే చెరువులో కొద్దిసేపు బోటు షికార్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ ప్రధాని మోడీ, తెలంగాణ మోడీ (కెసిఆర్), కోడికత్తి మోడీ (జగన్) కలసి రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తిత్లీ, పెథాయ్ తుపాను బాధితులను ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు కనీసం పరామర్శించలేదని, తుపాన్లు వచ్చి రైతులు నష్టపోతే పరామర్శకు రాని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పార్టీ సమావేశాల కోసం గుంటూరు, కడప వచ్చారని విమర్శించారు. విభజన సమయంలో మిగతా 9లో

ఆ ఇద్దరు మహిళలకు పూర్తి భద్రత

- కేరళ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : శబరిమల ఆలయంలోని ప్రవేశించిన ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందులకు పూర్తి రక్షణ కల్పించాలని కేరళ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, న్యాయమూర్తులు ఎల్‌ఎన్‌రావు, దినేశ్ మహేశ్వరీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ ఆదేశాలు జారీచేసింది. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ కనకదుర్గ, బిందులు దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ ఆదేశాలను ఇచ్చింది. కాగా, పిటిషనర్లు లేవనెత్తిన ఇతర అంశాలు 'శుద్ధీకరణ పూజ' సహా ఇతర అంశాలను చేపట్టేందుకు కోర్టు తిరస్కరించింది. కోజికోడ్ మిగతా 9లో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ పేలుడు

- రూ.100 కోట్ల వరకు ఆస్తి నష్టం
- రెండు జెసిబిలతోపాటు 7 బైకులు దగ్ధం

12



బ్లాస్ట్ ఫర్నేస్-3లో ప్రమాదం



బెలూన్ ఎక్కుతున్న మంత్రులు అఖిలప్రియ, శ్రావణ్‌కుమార్

అరకులో బెలూన్ ఫెస్టివల్

15 దేశాలకు చెందిన 20 హాట్ ఎయిర్ బెలూన్లు

ప్రజాశక్తి-అరకులోయ (విశాఖపట్నం)

విశాఖ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న బెలూన్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఎన్‌టిఆర్ గార్డెన్‌లో పాడేరు ఐటిడిఎ పిఒ జికె.బాలాజీ, అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు బోహిత్ అఖిలేష్, సాయిశ్రీనివాస్ ఈ బెలూన్ ఫెస్టివల్ ప్రారంభించారు. గుంటూరుకు చెందిన కరీమ్ కెప్టెన్ పైలెట్‌గా వ్యవహరించారు. 15 దేశాలకు చెందిన ప్రతినిధులు 20 హాట్‌ఎయిర్ బెలూన్లను ఎగురవేశారు. 2017 నవంబర్‌లో తొలిసారిగా బెలూన్ ఫెస్టివల్ నిర్వహించగా, వర్షం కారణంగా నాడు ఫెయిలైంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జనవరిలో ఏర్పాటు చేయగా, ప్రస్తుతం పొగమంచు దట్టంగా కురుస్తోంది. దీంతో బెలూన్లు ఎగురవేసేందుకు ఎవరు సాహసించలేదు. పొగమంచు వల్ల బెలూన్ ఎటువైపు వెళుతుందో గుర్తించడం కష్టమని భావించిన నిర్వాహకులు, అధికారులు, పొగమంచు వీడేవరకు ఉండి ఉదయం 10.45 గంటల సమయంలో ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుకింగ్ చేసుకున్న పర్యాటకులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి బెలూన్లలో ఎక్కించారు. ఈ బెలూన్ ఫెస్టివల్ ఆహూతులను ఆకట్టుకుంది. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బెలూన్‌లో ఆకాశంలో విహరించారు.



ఆకాశంలో విహరిస్తున్న బెలూన్లు



మరో వారం పొగమంచే

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో మరో వారం పాటు పొగమంచు కురుస్తుందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. కోస్తా, సీమ జిల్లాల్లో అక్కడక్కడా పొగమంచు, చలిమంచు కురిసేందుకు అనుకూల వాతావరణం నెలకొన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అదే సమయంలో క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని రాళ్లపల్లి అన్నారు. దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి, మాల్దీవులు, లక్ష్యద్వీప్ నుంచి అరేబియా సముద్రం వరకు ద్రోణి రాష్ట్రంపై ఎలాంటి ప్రభావమూ చూపబోవన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హ్యాపీనెస్ట్ రెండో దశకు ఆమోదం

- రాజధానిలో కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థ
- హోటళ్లతో రాజధానిలో కళ
- సిఆర్‌డిఏ సమావేశంలో సిఎం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధానిలో కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థ(డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్)ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సిఆర్‌డిఏ) సమావేశంలో అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్‌కు ఫోస్టర్ ప్లస్ పార్టనర్స్ ఇచ్చిన ప్లానును ఆమోదించారు. హ్యాపినెస్ట్ రెండోదశలో భాగంగా రెండో ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించారు. 1704 ప్లాట్లు, 12 బ్లాకులుగా ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఐనవోలులో చేపట్టే ఈ ప్రాజెక్టును జిప్లస్23 పద్ధతిలో నిర్మించనున్నారు. ఏడు ఫైవ్‌స్టార్ హోటళ్లకు భూ కేటాయింపుల ధృవీకరణపత్రాలు అందించారు. విమానయాన సేవలు, కళాశాలలు, విద్యా సంస్థలు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లే కొత్త నగరాల భవితవ్యాన్ని నిర్దేశించే వనరులని సిఎం పేర్కొన్నారు. వీటిల్లో ఫైవ్‌స్టార్ హోటళ్లు ఐదు, ఒక ఫోర్‌స్టార్ హోటల్, నాలుగు త్రీస్టార్ హోటళ్లు ఉన్నాయి. వివెంటా, వెస్టిన్, మారియట్, కాంధారి హోటల్స్(ఫార్చ్యున్), అంబికా అగరబత్తీస్ అరోమా(రెజెంటా ఇన్), స్ప్లెండర్ ల్యాండ్‌బేస్(జింజర్), స్వాగత్ హోటల్స్(కీస్ సెలెక్ట్) ఉన్నాయి. దీంతో రాజధానిలో నిర్మాణమయ్యే హోటళ్ల సంఖ్య 16కు చేరుకుంది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాలతో రాజధానికి పూర్తిస్థాయి రాజధాని కళ వచ్చేస్తుందని తెలిపారు.

డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటుపై ఇప్పటికే యుఏఈకి చెందిన ఉన్నతస్థాయి బృందం పరిశీలించి వెళ్లిందని సిఆర్‌డిఏ కమిషనర్ ముఖ్యమంత్రికి తెలిపారు. దుబాయ్ మెట్రోలోనూ, అబుదాబిలోని ఇతెహాద్ టవర్స్‌లో ఈ వ్యవస్థను ఇప్పటికే అమలు చేస్తున్నారని తెలిపారు. 40 వేల టన్నుల సామర్థ్యంతో అమరావతిలో ఏర్పాటు చేసే డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థని తెలిపారు. పురపాలక మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధానిలో జరుగుతున్న పనులను చూసేందుకు రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివస్తున్నారని తెలిపారు. ఆర్‌టిసి బస్సుల్లో ఇప్పటి వరకూ నాలుగువేల మంది వస్తున్నారని, ఇక ముందు ఆ సంఖ్య రెట్టింపు అవుతుందని చెప్పారు. అయితే నిత్యం పదివేలమంది రాజధానిని పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ శ్రీధర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వచ్చేవారికోసం ఉద్దండ్రాయునిపాలెంలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేశామని, 36 మంది గైడ్లను నియమించామని వివరించారు. తిరిగి వెళ్లేటప్పుడు కనకదుర్గమ్మ దర్శనం కోరుతున్నందున దానికి అవసరమైన ఏర్పాట్లూ చేస్తున్నామని చెప్పారు.

జ్యుడిషియల్ కాంప్లెక్స్‌లో 23.15 కోట్లతో 71,506 చదరపు అడుగుల విస్తీర్ణంలో అడ్వకేట్ బ్లాక్ నిర్మించాలని సిఆర్‌డిఏ సమావేశం నిర్ణయించింది. ఒక్కొక్క అంతస్తులో 35 చాంబర్లు చొప్పున నాలుగు అంతస్తుల్లో నిర్మాణాలు చేపడతారు. గ్రౌండు ఫ్లోర్‌లో నాలుగు కార్యాలయాలు, ఆడిటోరియం, లైబ్రరీ, సర్వీస్‌రూమ్, కామన్‌లాబీ, టాయిలెట్లు నిర్మిస్తారు. త్వరలోనే దీనికి టెండర్లు పిలవనున్నారు. వెంకటపాలెం సమీపంలో రూ.448 కోట్లతో ఐటిపార్కు నిర్మాణాన్ని చేపట్టాలన్న ప్రతిపాదనకు సమావేశంలో ఆమోదం తెలిపారు. 14.21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఐటిపార్కులో 10 లక్షల చదరపు అడుగుల వరకు ఆఫీసు స్పేస్ అందుబాటులోకి రానుంది. 150 ఎకరాల్లో నిర్మాణరంగ నగరాన్ని చేపట్టేందుకు అనుమతించారు. క్వాలిటీ కంట్రోల్ మాన్యువల్‌ను సిఎం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, సిఆర్‌డిఏ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఎండి లక్ష్మీపార్థసారథి పాల్గొన్నారు.

'దేవాదాయ' సమస్యలను పరిష్కరిస్తాం

ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయశాఖలోని సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి తెలిపారు. వెలగపూడిలోని కార్యాలయంలో శుక్రవారం దేవాదాయశాఖ, అనుబంధ సంస్థలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుబంధ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య మాట్లాడుతూ తమ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న పథకాలను వివరించారు. దేవాదాయ శాఖ అనుబంధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ అర్చకుల సమస్యలు తీరాలంటే జీఓ నెంబర్ 76ను త్వరగా విడుదల చేయాలని, తక్కువ ఆదాయం గల దేవాలయాల యాజమాన్య భాధ్యతలను అర్చకులకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేదిక్ యూనివర్శిటీ ప్రిన్సిపల్ సుదర్శన శర్మ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రాజధాని ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో వేద విశ్వవిద్యాలయాల శాఖలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కెఈ కృష్ణమూర్తిని కోరారు.. ఈ సమావేశంలో దేవాదాయశాఖ సలహాదారు రామకోటయ్య పాల్గొన్నారు.

అన్నదాతలపై కోపమెందుకు?

జగన్‌కు 'కళా' బహిరంగ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'పొరుగు రాష్ట్రంతో కలిసి రాష్ట్ర రైతాంగానికి అన్యాయం చేస్తున్నారు. మీ స్వప్రయోజనాల కోసం రైతుల భవిష్యత్తును తాకట్టు పెడతారా? అన్నదాతలపై మీకు అంత కోపమెందుకు?' అని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు ప్రశ్నించారు. ఈ మేరకు పలు ప్రశ్నలతో శుక్రవారం ఆయన ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. మద్దతు ధరల గురించి ఒక్క రోజైనా కేంద్రాన్ని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. బచావత్, బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పులకు , విభజన చట్టానికి విరుద్ధంగా కెసిఆర్ వ్యవహరిస్తుంటే ఆయనతో కలిసి పనిచేస్తామని చెప్పడం ఎంత వరకు సబబు అన్నారు. . తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులకు వైసిపి నేతలు ప్రధాన కాంట్రాక్టర్లుగా ఉన్నందునే ఆ ప్రాజెక్టులను అడ్డుకుంటే కాంట్రాక్టర్ల ద్వారా మీకు వచ్చే కమీషన్ ఆగిపోతుందనే దుర్బుద్ధితో ప్రత్యక్షంగా, పరోక్షంగానో కెసిఆర్‌కు సహకరిస్తున్నారని కిమిడి ఆరోపించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బాబ్లీతో పాటు 11 అక్రమ ప్రాజెక్టులపై పోరాటం చేశామని, చంద్రబాబుతో పాటు టిడిపి నేతలు జైలుకు కూడా వెళ్లామని తెలిపారు. శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి తీసుకున్న నీటిని తక్కువ చేసి దొంగ లెక్కలు చూపిస్తూ అక్రమంగా 120 టిఎంసిల నీటిని ఉపయోగించుకునేలా పాలమూరు -రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టినా మీరు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సాగర్‌కుడికాల్వ గేట్ల వద్దకు రాష్ట్ర అధికారులను రానీయకుండా టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆటంకాలు సృష్టించినా మీరు స్పందించకపోవడానికి కారణాలేమిటన్నారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం, మచ్చుమర్రి ప్రాజెక్టులను నిలిపివేయాలంటూ హరీష్‌రావు కేంద్రానికి లేఖ రాస్తే మీరు సంతోషపడ్డారని జగన్‌ను ఉద్దేశించి అన్నారు.

నామినేషన్ల గడువు ముగిసేవరకు ఓటర్ల నమోదు, తొలగింపు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వివేది
- ఈవిఎంపై అనుమానాలు నివృత్తి చేయాలి : సిపిఎం
- 54 లక్షల ఫేక్ ఓట్లు : వైసిపి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసే వరకు కొత్త ఓటర్ల నమోదు, నకిలీ ఓట్ల తొలగింపు కార్యక్రమాలు కొనసాగిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. పలు పార్టీ నాయకులతో ద్వివేది శుక్రవారం సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి ఈ నెల 11వ తేదీన ఎన్నికల సంఘం రూపొందించిన తుది ఓటర్ల జాబితాను హార్డ్ డిస్కు రూపంలో ఆయా పార్టీ నేతలకు ద్వివేది అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాతో పాటు ఇతర ఏ సమస్యలైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే, వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు అన్ని పార్టీలకూ సమాచారమందిస్తామన్నారు. ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిష్పక్షపాతంగా ఓటు వినియోగించుకునే వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే సమస్యలపై జిల్లాస్థాయిలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేయిస్తామన్నారని, ఇంతవరకు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈవిఎంపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరారు. ఈ సమయంలో రాజకీయపార్టీల నాయకులను పిలిచి ఈ ప్రక్రియ చేపడితే ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఓటర్ల లిస్టులోనూ తప్పులు లేకుండా చూడాలని సూచించారు. వైసిపి నాయకులు అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 54 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ రెండుచోట్ల ఉన్న ఓట్లే 20 లక్షల వరకూ ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వీటికి సంబంధించి పూర్తి వివరాలను ఆధారాలతో సహా గతంలోనే ఎన్నికల కమిషనర్‌కు సమర్పించామని చెప్పారు. బిజెపి నాయకులు రంగరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ప్రజలను అభిప్రాయాలు అడుగుతున్నారని, వాటిల్లో వ్యతిరేకంగా చెప్పిన వారిని గుర్తించి వారి ఓట్లు తొలగిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కమిషనర్ ద్వివేది మాట్లాడుతూ సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు వర్ల రామయ్య, వైసిపి నాయకులు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, కాంగ్రెస్ నేత టి.సూరిబాబు పాల్గొన్నారు.

కొత్త డిప్యూటీ డిఇవో పోస్టులేవీ?

- 6 నెలల కిందటే విద్యాశాఖ ప్రతిపాదనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త జిల్లా ఉప విద్యాశాఖ అధికారి(డిప్యూటీ డిఇవో) పోస్టులు మంజూరు కోసం పాఠశాల విద్యాశాఖ పంపిన ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం ఇంతవరకు ఆమోదించలేదు. పనిభారం పెరుగుతుండటంతో , అదనపు పనికి తగ్గట్టుగా డిప్యూటీ డిఇవోలను నియమించుకోవాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. మొత్తం 175 పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి నియోజకవర్గానికి ఒక పోస్టు కేటాయించాలన్నది విద్యాశాఖ ప్రతిపాదన! దీనిలో భాగంగానే కొత్త పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి గత ఏడాది జులైలో ప్రతిపాదనలను పంపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 64 మంది డిప్యూటీ డిఇవోలు ఉన్నారు. జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుల మధ్య అనుసంధానంగా ఉండాల్సిన అధికారులు డిప్యూటీ డిఇవోలే. పాఠశాలలను తనిఖీ చేయాల్సిన బాధ్యత వీరిపై ఉన్నా పని ఒత్తిడిలో సక్రమంగా చేయలేకపోతున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 62,048 ఉన్నాయి. వీటన్నింటిని వారు తనఖీ చేయాల్సిఉంది. సిబ్బంది కొరత కారణంగా ఈ తనిఖీలు నామమాత్రంగా మారాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. వీటితో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ హాజరు, సిసిఈ విధానం తీరు, మధ్యాహ్న భోజనం, పరీక్షల మార్కులు, విద్యార్థుల హాజరు వంటి పనులను కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడాలంటే ఈ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని విద్యాశాఖ కోరినా ప్రభుత్వం నుండి స్పందన శూన్యం!

సంక్షిప్తం

ఎస్‌జిటికి తొలిరోజు 81శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-2018 ఎస్జిటి పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. రెండు పూటలా జరిగిన పరీక్షకు 46,184 మంది హాజరు కావాల్సి ఉండగా, 37,462(81.11శాతం)మంది హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 23,596 మంది కేటాయించగా, 18,696 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 22,588 మందికి 18,766 మంది హాజరయ్యారు.

స్కూల్ అసిస్టెంట్ తుది 'కీ' విడుదల

డిఎస్‌సి-2018 స్కూల్ అసిస్టెంట్(ఎస్ఎ) తుది 'కీ'ని పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. డిసెంబర్ 24,26,27, 28 తేదిల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ పరీక్షల తుది 'కీ'లను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

మధ్యాహ్నభోజనం ధర స్వల్ప పెరుగుదల

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట ధరలు స్వల్పంగా పెరిగాయి. ప్రస్తుతం అమలు చేస్తున్న వాటికి కేంద్రప్రభుత్వం 5.35శాతం పెంచింది. పెరిగిన ధరలను సవరిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్ జీవో 20ను శుక్రవారం విడుదల చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.15ల నుంచి రూ.4.35లకు పెరిగాయి. ప్రాథమికోన్నత, నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు(ఎన్‌సిఎల్‌పి), ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.6.18లను రూ.6.51లకు పెంచింది.

అందుబాటులోకి రాని ఎన్టీఆర్ వైద్యసేవలు

నేడు మంత్రి సమక్షంలో చర్చలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం ప్రయివేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నందున ఎన్టీఆర్ వైద్యసేవలు పూర్తిస్థాయిలో అన్ని అందుబాటులోకి రాలేదు. గత నెలలోనే సేవలు నిలిపివేస్తామని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు హెచ్చరించడంతో చెల్లింపులు చేశామని వైద్యఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క నెలలోనే దాదాపు రూ. 310 కోట్లు విడుదల చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ వారు చెప్పిన మొత్తం నగదు తమ ఖాతాల్లో జమ కాలేదని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అంటున్నాయి. అందువల్ల తమకు బకాయిలు చెల్లించి, సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యోగుల, జర్నలిస్ట్ హెల్త్ కార్డులపై సేవలు అందించేదిలేదని స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో వైద్య సేవల కొనసాగింపు, తదితర సమస్యలపై శనివారం మంత్రి సమక్షంలో వైద్యఆరోగ్య శాఖ అధికారులతో చర్చిస్తామని ఏపి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ప్రతినిధులు తెలిపారు.

వైద్య ఆరోగ్య సేవలకు కేంద్ర నిధుల విడుదల

రాష్ట్రంలో వివిధ వైద్యఆరోగ్య సేవలు మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 1692 కోట్లు విడుదల చేసిందని వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కొత్తగా 148 ఆస్పత్రుల్లో దంత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ.12.5 కోట్లు ఇచ్చిందని పేర్కొన్నారు. అన్ని జిల్లా ఆస్పత్రుల్లో రూ.13 కోట్లు వెచ్చించి గ్యాస్ట్రో ఎంటరాలజీ యూనిట్లు నెలకొల్పుతున్నామని తెలిపారు. వినికిడి లోపంతో బాధపడుతున్నవారికి రూ. 15 కోట్లతో ఉచితంగా మెషిన్లు అందిస్తామని తెలిపారు. ఈ మెషిన్లను 28 ఏరియా ఆస్పత్రుల్లో, 13 జిల్లా ఆస్పత్రుల్లోనూ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అన్ని జిల్లా ఆస్పత్రుల్లో కంటి చికిత్సలు, నేత్రాలు భద్రపరచడం కోసం కొత్త యూనిట్లు ప్రారంభిస్తామని తెలిపారు. అంబులెన్సుల ఉబరైజేషన్ కార్యక్రమానికి రూ. 27 కోట్లు కేటాయించామని, కొత్తగా 122 టెలి ఆప్తమాలజీ సేవలకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 13 పిహెచ్‌సిలు, 60 సిహెచ్‌సిల్లో రూ. 14 కోట్లతో జాతీయస్థాయి ప్రమాణాలతో ప్రసూతి వసతులు మెరుగుపరుస్తామని వివరించారు. ప్రసవ సమయంలో సౌకర్యంగా ఉండేందుకు గర్భిణిలకు మాతృసమ్మాన్ దుస్తులను అందజేస్తామని తెలిపారు.

ఎయిమ్స్ పనుల పరిశీలనకు కమిటీ

మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) నిర్మాణ పనులు పరిశీలించేందుకు ఐదుగురు సభ్యులతో ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈమేరకు వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పలువురు ఐపిఎస్‌లకు పదోన్నతులు, బదిలీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పలువురు ఐపిఎస్‌లకు పదోన్నతులు కల్పించడంతో పాటు పలువురిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేటా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్గనైజేషన్, కో ఆర్డినేషన్ ఐజిపిగా ఉన్న కుమార్ విశ్వజిత్‌కు పదోన్నతి కల్పిస్తూ ఎపి పోలీస్ నియామక మండలి ఛైర్మన్, ఆర్గనైజేషన్, కో ఆర్డినేషన్ ఎడిజిగా నియమించారు. శాంతి భద్రతలపై ఐజిపి ఎ రవిశంకర్‌కు శాంతి భద్రతల అడిషనల్ డిజిపిగా పదోన్నతి కల్పించారు. రవాణా శాఖ కమిషనర్ ఎన్ బాలసుబ్రమణ్యంకు అదే స్థానంలో ఉంచుతూ అడిషనల్ డిజిపి హోదా కల్పించారు. హోం గార్డ్స్ ఐజిపిగా ఉన్న క్రిపానంద్ త్రిపాతి ఉజేలాకు హోం గార్డ్స్ అడిషనల్ డిజిపిగా పదోన్నతి కల్పించారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపిగా ఉన్న హరీష్ కుమార్ గుప్తాను ప్రొవిజనింగ్, లాజిస్టిక్‌స అడిషనల్ డిజిపిగా బదిలీ చేశారు. గ్రే హౌండ్స్ డిఐజిగా ఉన్న వినీత్ బ్రిజ్లాల్‌కు గ్రే హౌండ్స్ ఐజిపిగా, శ్రీకాకుళం ఎస్పీగా ఉన్న సిఎం త్రివిక్రమ వర్మకు ఏలూరు రేంజ్ డిఐజిగా, విజయనగరం ఎస్పీ జి పాలరాజుకు విశాఖపట్నం రేంజ్ డిఐజిగా పదోన్నతి కల్పించారు. విశాఖపట్నం రేంజ్ డిఐజిగా ఉన్న సిహెచ్ శ్రీకాంత్‌ను సాంకేతిక సేవల డిఐజిగా బదిలీ చేశారు.

బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలి: సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెను ప్రమాదంలో చిక్కుకున్న ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. ప్రముఖ మేధావి ఆనంద్ తేల్తుంబ్డే ప్రజల మద్దతు కోరుతూ రాసిన లేఖపై శుక్రవారం ట్విట్టర్ ద్వారా నారాయణ స్పందించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు న్యాయమూర్తులు, మేధావులు ప్రజలను అర్థించే పరిస్థితి నెలకొనడం దారుణమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అరాచకాల నుంచి కాపాడాలని, తనకు ప్రాణహాని ఉందని ఆనంద్ చేసిన విజ్ఞప్తిని ప్రస్తావించారు. గతంలో అనుమానాస్పదంగా మరణించిన వారు అనేకులు ఉన్నారని, గోవింద్ పన్సారే, గౌరీ లంకేష్ తదితరులు హత్యలకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ హత్యలకు కారకులైన వారిపై ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడంపై సిబిఐ తీరును న్యాయవ్యవస్థ ఇటవలే తప్పుబట్టిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి పాలనకు అడ్డకట్ట వేయాల్సిన అవసరముందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆనంద్ తేల్తుంబ్డే విషయంలో దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. దేశంలో చరిత్ర, సంస్కృతిపై అధ్యయనం చేసిన ఆనంద్ ప్రత్యామ్నాయ శ్రమ సంస్కృతిని ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఖచ్చితమైన అభిప్రాయంతో అనేక నగరాల్లో సభలు, సమావేశాల్లో విలువైన సందేశాలను అందించారన్నారు.

స్వయంపోషకత్వం సాధించండి

స్విమ్స్ పాలకమండలి సమావేశంలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే ఐదేళ్లలో శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్)ను దేశంలోనే నెంబర్ 1 సంస్థగా రూపొందించాలని, ప్రజారోగ్యంలో హ్యాపీనెస్ తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం సచివాలయంలో స్విమ్స్ పాలకమండలి 18వ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్విమ్స్ స్వయం పోషకత్వం సాధించేందుకు చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఉత్తమ ప్రమాణాలు తేవాలని ఆదేశించారు. టిటిడితో సమన్వయం చేసుకుంటూ స్విమ్స్ పనిచేయాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి శాలరీ గ్రాంట్‌కు బడ్జెట్ ఇస్తామని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సిఎం వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యను ఆదేశించారు. వైద్యసేవలపై ప్రజలలో పూర్తి సంతృప్తి స్థాయి తీసుకురావాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకొని ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్విమ్స్‌లో అమలుచేస్తున్న పలు వైద్యసేవలపై డైరెక్టర్, విసి డాక్టర్ టి.ఎస్. రవి కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. నారావారిపల్లె సిహెచ్‌సిని స్విమ్స్‌కు అనుబంధ కేంద్రంగా చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉందన్నారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి ఎన్ఎండి. ఫరూక్, స్విమ్స్ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్నవారందరికీ హజ్ యాత్రకు అవకాశం

రూ.81,000 కమిటీకి చెల్లించాలి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఈ సంవత్సరం హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్నవారందరినీ ఎంపిక చేశామని, ఎంపికైన ప్రతి యాత్రికుడు మొదట విడతగా రూ.81,000 ఫిబ్రవరి ఐదో తేదీ లోపు సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లించాలని హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2,135 మంది పెద్దలు, రెండేళ్ల లోపు చిన్నారులు ముగ్గురు, మొత్తం 2,138 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లబోతున్నారని తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఏడుగురు, విజయనగరం నుంచి 24 మంది, విశాఖపట్నం నుంచి 90 మంది, తూర్పుగోదావరి నుంచి 39 మంది, పశ్చిమ గోదావరి నుంచి 37 మంది, కృష్ణా నుంచి 230 మంది, గుంటూరు నుంచి 326 మంది, ప్రకాశం నుంచి 43 మంది, నెల్లూరు నుంచి 121 మంది, కడప నుంచి 241 మంది, కర్నూలు నుంచి 473 మంది, అనంతపురం నుంచి 298 మంది, చిత్తూరు నుంచి 206 మంది డ్రాతో నిమిత్తం లేకుండా ఎంపికయ్యారని తెలిపారు.

జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం

ప్రజాశక్తి - చిలకలూరిపేట (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన, పశువుల అందాల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు గురువారం వరకూ కొనసాగనున్నాయి. తొలిరోజు పోటీల్లో 28 ఎడ్ల జతలు పాల్గొన్నాయి.ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా స్వర్ణాంధ్ర ఫౌండేషన్, మల్లెల సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశు పోషణను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం రాయితీపై గేదెలు, ఆవులను అందిస్తోందని పేర్కొన్నారు.



ఆరంభం

ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న మంత్రి పత్తిపాటి పుల్లారావు

తెలికపాటి రేడియో ధార్మిక పదార్థం మాయం

బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఒఎన్‌జిసి ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరంలోని ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్‌లో చాలా తేలికపాటి రేడియో ధార్మిక వనరు పదార్థం కనిపించట్లేదంటూ ఒఎన్‌జిసి అధికారులు బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆ పదార్థం ఇక్కడికి ఎప్పుడు, ఎలా వచ్చింది, ఎలా పోయిందనే విషయాలపై దర్యాప్తు చేపట్టారు. అయితే కొన్ని న్యూస్ ఛానల్స్‌లో ఈ పరికం విలువ రూ.100 కోట్లు అని, దీని విస్ఫోటనం వల్ల రాజమహేంద్రవరంతో పాటు కొన్ని గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ ప్రచారం చేయడంతో ఒఎన్‌జిసి ఆ వార్తలను ఖండించింది. కనిపించకుండా పోయిన పదార్థం చమురు, గ్యాస్ అన్వేషణలో ఉపయోగిస్తామని, ఇది పేలుడు పదార్థం కాదని చాలా తేలికపాటి రేడియో ధార్మిక పదార్థమని తెలిపింది. ఈ పదార్థాన్ని 2013లో రూ.27లక్షలకు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. ఇటువంటి తప్పుడు వార్తలను నమ్మొద్దని ఒఎన్‌జిసి కోరింది. చమురు, సహజవాయువు ఉత్పత్తి, వెలికితీతలో మార్గదర్శకాలను, నియమాలను ఒఎన్‌జిసి కచ్చితంగా పాటిస్తుందని ఒఎన్‌జిసి అధికారులు తెలిపారు. అయితే ఒఎన్‌జిసిలో కట్టుదిట్టమైన భద్రత ఉన్న నేపథ్యంలో ఈ పదార్థం ఎలా మిస్సయిందనే అంశంపై పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు.

నిబద్ధ నేత నరసింహయ్య

- సంతాపం తెలిపిన ఏచూరి, రాఘవులు
- సిపిఎం రాష్ట్ర కమిటీ నివాళి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో సుదీర్ఘకాలం పనిచేసిన నేతగా పేరొందిన తెలకపల్లి నరసింహయ్య మృతిచెందారని వార్త వినగానే కమ్యూనిస్టు శ్రేణులు, రైతు, వ్యవసాయ కార్మికులు, సంఘటిత, అసంఘటిత కార్మికులే కాకుండా జిల్లా వ్యాప్తంగా అనేకమంది ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కర్నూలు మండలం గార్గేయపురానికి చెందిన తెలకపల్లి రామయ్య, సరస్వతమ్మలకు 1928 జూన్ 8న జన్మించారు. 1945లో టిసి లక్ష్మమ్మతో వివాహమైంది. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన నరసింహయ్య, లక్ష్మమ్మ దళితులు, వ్యవసాయ కార్మికులు, రైతులతో మమేకమయ్యేవారు. నరసింహయ్య గుంటూరులోని ఎసి కాలేజీలో ఇంటర్మీడియేట్ వరకు చదివారు. ఆ రోజుల్లోనే చురుకైన విద్యార్థిగా పేరు పొందారు. 1952లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. 1953లో మొదటిసారి నందికొట్కూరు తాలూకా రైతుసంఘం కార్యదర్శిగా నాయకత్వ బాధ్యతలు తీసుకొని ఉద్యమాన్ని అంచెలంచెలుగా విస్తరించేందుకు కృషి చేశారు. 1964లో పార్టీ రెండుగా చీలిపోయిన తర్వాత జిల్లాలో మెజార్టీ నాయకులు సిపిఐ వైపు నిలిచినా నరసింహయ్య సిపిఎం వైపు నిలబడ్డారు. పార్టీలో చీలిక వచ్చాక జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికై కమ్యూనిస్టు ఉద్యమం విస్తరణకు మరింత కృషి చేశారు. 1965లో సికింద్రాబాదు జైలులో పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, చంద్రపుల్లారెడ్డి, మండ్ల సుబ్బారెడ్డిలతో కలిసి జైలులో ఉన్నారు. ఆ సమయంలోనే రాజకీయ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా అర్థశాస్త్రాన్ని బోధించే నాయకుడిగా తయారయ్యారు. అన్ని రంగాలనూ పూర్తి స్థాయిలో అధ్యయనం చేసే లక్షణం ఆయనకు ఉండడంతో ఉద్యమ నిర్మాణంలో ఏ సమస్య వచ్చినా దాన్ని సామరస్యంగా పరిష్కరించి ఉద్యమ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేవారు. 1968లో చీలిక సమయంలోనూ పార్టీవైపు నికరంగా నిలబడి జిల్లాలో కార్మిక, రైతు, వ్యవసాయ, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. 1970 నుంచి 1997 వరకూ సిపిఎం జిల్లా కార్యదర్శిగా 28 ఏళ్లు పనిచేశారు. 1971లోనే సిపిఎం రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఆ తర్వాత 2002 వరకు రాష్ట్ర కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించి,అనంతపురంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రిలీవ్ అయ్యారు. అనంతరం 2018లో భీమవరంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నరసింహయ్యను ప్రత్యేక ఆహ్వానితునిగా ఎన్నుకున్నారు. నరసింహయ్య దంపతులకు ముగ్గురు కుమారులు వారు రవి, హరి, చంద్రశేఖర్.

ఎంబి భవన్‌లో పలువురి నివాళి

నర్సింహయ్య భౌతికకాయాన్ని పార్టీ సభ్యులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఉంచారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యం జ్యోతి, జి.రాములు, బి.వెంకట్, నంద్యాల నర్సింహారెడ్డి, డీజీ నర్సింహారావు, జాన్‌వెస్లీ, ఎం. సాయిబాబు, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ప్రజాపక్షం ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ, సామాజిక విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయకుమార్, నవతెలంగాణ సిజిఎం పివి.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ సానుభూతిపరులు తదితరులు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం

నర్సింహయ్య మృతికి సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ కాలం నుంచి సైద్ధాం తిక నిబద్ధతకు మారుపేరుగా నర్సింహయ్య నిలిచారని, కమ్యూనిస్టు ఉద్యమంలో ఆటుపోట్లను తట్టుకుని కర్నూలు జిల్లాలో ఉద్యమాన్ని ముందుకు నడిపించటంలో ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. జిల్లాలో సిపిఎం పునర్నిర్మాణానికి కృషి చేసిన మొదటి తరం నాయ కుల్లో నర్సింహయ్య ఒకరని, మంచి రాజకీయ ఉపాధ్యాయులుగా జిల్లా లో అనేక మంది నాయకులను, కార్యకర్తలను రాజకీయంగా తీర్చిదిద్ద డంలో ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. తనతో పాటు తన కుటుంబాన్ని కూడా తాను నమ్మిన సిద్ధాంతం కోసం అంకితమ య్యేలా చేశారని, ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొ న్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేతలను తీర్చిదిద్దారు : గఫూర్

నరసింహయ్య మృతి ప్రజా పోరాటాలకు, ఉద్యమా లకు తీరని లోటు. కమ్యూని స్టు పార్టీలో చీలికలొచ్చిన రెండు సందర్భాల్లోనూ బలమైన ఉద్యమాలతో సిపిఎంను పునర్నిర్మించారు. తనలాంటి ఎంద రినో ఆయన తీర్చిదిద్ది జిల్లాలో సిపిఎం నిర్మాణానికి ఎనలేని కృషి చేశారు. జిల్లాలో మోటార్ వర్కర్స్ యూనియన్, శ్రీరాయలసీమ పేపర్ మిల్లు యూనియన్, బీడీ కార్మికులు ఇలా కార్మిక ఉద్యమాల లోనూ ఆయనది చురుకైన పాత్ర. తనకు మార్గదర్శకుడైన నరసింహ య్య ఎందరికో ఆదర్శనీయుడు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు గఫూర్ సానుభూతిని తెలియజేశారు.

> **నిబద్ధతకు మారుపేరు : ఏచూరి**
>
> సైద్ధాంతిక నిబద్ధతకు, అంకితభావానికి నరసింహయ్య మారుపేరని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నివాళులర్పించారు. ఢిల్లీ నుండి ఫోన్‌లో తెలకపల్లి రవితో మాట్లాడిన ఆయన నరసింహయ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. నరసింహయ్య మరణం ప్రజా ఉద్యమాలకు లోటని సిపిఎం పొలిట్‌బ్యూరో బివి రాఘవులు సంతాపం వ్యక్తం చేశారు.

పాటూరు, శ్రీనివాసరావు సంతాపం

నరసింహయ్య మృతికి సిపిఎం కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు, సీనియర్ నాయకులు పాటూరు రామయ్యఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఎన్ని ఒడిదుడుకులొచ్చినా చివరి వరకూ తాను నమ్మిన సిద్ధాంతానికేఆయన కట్టుబడి ఉన్నారని రామయ్య పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రైతు, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకే కాకుండా మొత్తం ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘ కాలం పనిచేసిన నేత నరసింహయ్య అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కుటుంబసభ్యులను ప్రజా ఉద్యమాల్లో పని చేసేలా ప్రోత్సహించేవారని ఆయన కొనియాడారు.

సిపిఐ సంతాపం

నరసింహయ్య మృతిపట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. రాయలసీమ ప్రాంత వెనకబాటు సమస్యలపై, కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నర్సింహయ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై కేశవరావు, పెద్దిరెడ్డి, రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బి.తులసీదాస్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుఎ స్‌జిఎం బాషా, ఎస్ అనిల్‌కుమార్‌లు తెలిపారు.

గుంటూరులో నిలిచిన ఇళ్ల పంపిణీ

- తప్పుల తడకగా ప్రజాసాధికార సర్వే
- నిర్మించిన ఇళ్లు 4128, అందిన దరఖాస్తులు 50 వేలు
- మళ్లీ సర్వేకు అధికారుల ప్రతిపాదన



ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ప్రజాసాధికారిక సర్వేలో వివరాలు సరిగా నమోదు కాకపోవడం నిజమైన పేదలకు న్యాయం చేకూరడం లేదు. ఈ సర్వేలో ధనికులకు ఇళ్లు, భవంతులున్నా నిరుపేదలుగా పేర్కొంటూ వివరాలు నమోదు కావడం వల్ల నిజమైన లబ్ధిదార్ల గుర్తింపు ప్రహసనంగా మారింది. దీంతో 'అందరికీ ఇళ్లు' పథకంలో నిర్మించిన బహుళ అంతస్తుల సముదాయంలో ప్లాట్ల పంపిణీ నిలిచింది. గుంటూరులోని అడవితక్కెళ్లపాడులో బహుళ అంతస్తుల సముదాయంలో మొత్తం 4128 ఇళ్లు నిర్మించారు. ఒక్కో ఇంటికి రూ.6.60 లక్షల వ్యయం కాగా రూ.3 లక్షలు సబ్సిడీ, రూ.50 వేలు లబ్ధిదారులు చెల్లించాలి. మిగిలిన రూ.3.10 లక్షలు బ్యాంకు రుణం ఇస్తుంది. ఈ రుణాన్ని నెలవాయిదాల్లో చెల్లించాలి. నగరం మొత్తం మీద 50 వేల దరఖాస్తులొచ్చాయి. వీరిలో ఇప్పటికే ఒకటి రెండు ఇళ్లున్న వారూ రాజకీయ పలుకుబడితో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో భారీగా దరఖాస్తులు రావడం, ప్లాట్ల నిర్మాణం తక్కువగా ఉండటంతో అధికారులు ఎటూ తేల్చలేకపోతున్నారు. ముందు వచ్చిన వారికి ముందు ఇస్తే తర్వాత దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అధికార పార్టీపై వ్యతిరేకత వస్తుందని నగరంలోని ప్రజా ప్రతినిధులు కంగారు పడుతున్నారు. ప్రజాసాధికారిక సర్వేలో 50 వేల మంది పేదలుగానే నమోదు కావడంతో అసలైన పేదలను ఎలా గుర్తించాలనే అంశంలో ఇప్పుడు నగర పాలక సంస్థ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సర్వేలో నమోదు కాకుంటే సంక్షేమ పథకాలేవీ వర్తించవని ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో అన్ని పథకాలకు ఈ సర్వేను ప్రాతిపదికగా చేసుకుని అనుమతులిస్తున్నారు. ఈ సర్వేలో నమోదవ్వని వారు ఇప్పుడు వివిధ పథకాల కోసం మళ్లీ నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. 2016లో చేపట్టిన ఈ సర్వే ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిలో తప్పులు దొర్లడంతో మళ్లీ సర్వే చేసి నిరుపేదలను గుర్తించాలని నగరపాలక సంస్థ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అయితే గతంలోనే నగరపాలక సంస్థ సిబ్బంది ప్రజాసాధికారిక సర్వేను నిర్వహించడం గమనార్హం.

రీ సర్వే చేయాలి

ప్రజాసాధికారిక సర్వేలో తప్పులు ఉన్నమాట వాస్తవం. నా ఆస్తులు, ఇళ్లు సర్వేలో నమోదు కాలేదు. నేనూ ఈ ఇంటిని పొందటానికి అర్హుడినే. ధనికులనూ పేద వారిగా చూపుతూ సర్వేలో వివరాలు తప్పుగా నమోదవడం దారుణం. నిర్మించిన ఇళ్ల కంటే 10 రెట్లు దరఖాస్తులొచ్చాయి. వీటిని వడపోయడం కంటే తిరిగి సర్వే చేయడం మంచిది. ఒక్కొక్కరికి ఒకటి రెండు ఇళ్లు కూడా పేదల గృహాల కోసం దరఖాస్తు చేసిన మాట వాస్తవమే. అధికారులు సర్వే సమయంలో చేసిన తప్పుల వల్ల ఇప్పుడు నిరుపేదలకు ఇబ్బంది కలుగుతోంది. అందువల్ల ఇళ్ల కేటాయింపు నిలిపేసి తిరిగి సర్వే చేయాలని కోరుతున్నారు.

మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే.

టాటా మ్యాజిక్‌ను తగులబెట్టిన మావోయిస్టులు

ప్రజాశక్తి-చింతూరు(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేగ గ్రామంలో మావోయిస్టులు శుక్రవారం టాటా మ్యాజిక్ ట్రాలీ ఆటోను తగులబెట్టారు. ఈ వాహనం చత్తీస్‌గడ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట గ్రామానికి చెందిన దేశి వెంకటేశ్వర్లు అనే అపరాల వ్యాపారిదిగా పోలీసులు గుర్తించారు. రోజులాగే పేగ సంతలో అపరాలు కొనుగోలు చేసేందుకు వెంకటేశ్వర్లు ట్రాలీపై వచ్చారు. ఈ క్రమంలో మావోయిస్టులు ట్రాలీ వద్దకు వచ్చి డ్రైవర్‌తో సహా అపరాల వ్యాపారిని చితక బాదారు. గిరిజన గ్రామాల్లో అపరాలు కొనుగోలు చేస్తే చంపేస్తామని వ్యాపారిని హెచ్చరించినట్టు స్థానికులు తెలిపారు.

కాంగ్రెస్‌తో కలిస్తే భూస్థాపితమే

ఎపికి స్పెషల్ ట్రీట్‌మెంట్ కావాలి : మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ప్రజాశక్తి - కడపప్రతినిధి

కాంగ్రెస్‌తో కూటములు కడితే ప్రాంతీయ పార్టీలు భూస్థాపితం కావడం తథ్యమని కేంద్రహోంశాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. శుక్రవారం కడపలో కందుల గ్రౌండ్స్‌లో రాయలసీమ జిల్లాల బూత్‌స్థాయి శక్తి కేంద్ర సమ్మేళన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో బిఎస్పి, ఎస్పిలు కలుసుకుని కాంగ్రెస్ పార్టీని దూరంగా పెట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. 55 ఏళ్ల కాంగ్రెస్‌పాలనలో దేశం వీధి దీపాలకు సైతం నోచుకోలేదని, నాలుగున్నరేళ్ల పాలనలో బిజెపి ప్రతి ఇంటికీ విద్యుత్ వెలుగులను పంచిందన్నారు. ఎపి అభివృద్ధికి ముఖ్యమంత్రి సహకరించలేదన్నారు. ఎపికి స్పెషల్ స్టేటస్ కాదు, స్పెషల్ ట్రీట్‌మెంట్ అవసరమని తెలిపారు. విభజన చట్టంలోని హామీలను 80 శాతం అమలు చేశామన్నారు. దేశంలో ఆర్థికంగా వెనకబడిన పేదలకు 10శాతం రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్,ఎపి బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రాంమాధవ్, బిజెపి అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, రాయలసీమ జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అంపశయ్య నవీన్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి -కలెక్టరేట్, విశాఖ

లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్‌కు అందజేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు, రాజ్యసభ పూర్వ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ శుక్రవారం వెల్లడించారు. విశాఖలోని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం పురస్కార ప్రదాన కార్యక్రమం ఉంటుందన్నారు. గుంటూరుకు చెందిన ఎన్.మంగాదేవి, హైదరాబాద్‌కు చెందిన వంశీ రామరాజులకు జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

అకాడమీ నియామకాలు అవమానకరం

సాహిత్య అకాడమీ చైర్మన్‌తో సహా సభ్యుల నియామకం సాహితీ వేత్తలను అవమానించే విధంగా ఉందని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆరోపించారు. మరో మూడు మాసాలలో ఎన్నికల కోడ్ రానుందనీ, ఈ కొద్దిపాటి వ్యవధికే పాలకవర్గ నియామకం చేపట్టి చేతులు దులుపుకోవడం సరికాదనీ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు భాష, సంస్కృతి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

తెలుగువారి గుండెచప్పుడు ఎన్‌టిఆర్ : మంత్రులు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ ప్రతినిధి

ఎన్‌టిఆర్ 23 వర్ధంతిని గుంటూరులోని రాష్ట్ర టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర టిడిపి అధ్యక్షులు కళా వెంకట్రావు, మంత్రులు నారా లోకేష్, నక్కా ఆనందబాబు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వారి గుండె చప్పుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు.

ఆర్టీసి వాహనాలకు ప్రయివేటు డ్రైవర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో అధికారులు, సంస్థ అవసరాల కోసం వినియోగిస్తున్న లైట్ మోటార్ వాహనాలను ప్రయివేటు డ్రైవర్లను నియమించుకోనున్నారు. ఈ మేరకు ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్) జి జయరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 118 వాహనాలను 151 ఆర్టీసి డ్రైవర్లను ప్రస్తుతం వినియోగిస్తున్నామని, వారి స్థానంలో ఔట్ సోర్సింగ్, ఆర్టీసి రిటైర్డ్ డ్రైవర్లను తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యాలయం అవసరాల కోసం ఉపయోగించే వాహనాలకు డ్రైవర్ల వేతనంగా నెలకు రూ.15వేలు, ఇతర ప్రాంతాల్లోని ఆర్టీసి వాహనాలకు రూ.12వేలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో డిపో మేనేజర్, ఎటిఎం, డిప్యూటీ సిటిఎం, డిప్యూటీ సిఎంఇ హోదా అధికారులు ఉపయోగించే వాహనాలకు రిలీవర్ కోసం రూ.2వేలు లేదా రూ.2500 అదనంగా చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసి వాహనాల విధుల్లో ఉన్న డ్రైవర్లను రిలీవ్ చేయాలని, కొత్త ఫిబ్రవరి 1 నుంచి డ్రైవర్లను నియమించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి

ఎమ్‌డికి ఆర్టీసి ఇయు వినతి

ఆర్టీసి వాహనాలకు ప్రయివేటు డ్రైవర్లను నియమించుకోవాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఆర్టీసి ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబుకు ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వాహనాలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లను నియమించడం వల్ల విలువైన వస్తువులు పోవడమే కాకుండా భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఈ నిర్ణయం మంచిది కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం వేతన సవరణ చర్చల్లో సిబ్బంది కుదింపుపై అభ్యంతరాలు తెలిపినప్పటికీ, సిబ్బందిని కుదించేందుకు యాజమాన్యం నిర్ణయాలు తీసుకోవడం చూస్తుంటే కార్మికవర్గాన్ని రెచ్చగొడుతూ ఆందోళన బాటవైపు నెట్టుతున్నట్లుగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే జరగబోవు పారిశ్రామిక అశాంతికి యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సిబ్బంది కుదింపు విచారకరం : ఎస్‌డబ్ల్యూఎఫ్

ఆర్టీసిలో సమ్మె నోటీసులు ఉండగానే సిబ్బంది కుదింపు చర్యలకు యాజమాన్యం పూనుకోవడం విచారకరమని ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయివేటు డ్రైవర్లను నియమించుకోవాలన్న ప్రతిపాదనను విమరించుకోవాలని డిమాండ్ చేశారు.

21న జనసేనలో చేరుతా : ఎమ్మెల్యే ఆకుల

ప్రజాశక్తి-రామహేంద్రవరం ప్రతినిధి

ఈనెల 21న విజయవాడలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతున్నట్టు బిజెపికి చెందిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ చెప్పారు. రాజమహేంద్రవరంలోని వివి ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాజకీయ వ్యవస్థను పవన్‌కల్యాణ్ ప్రక్షాళన చేస్తారనే నమ్మకంతోనే బిజెపిని విడిచి జనసేనలో చేరుతున్నానన్నారు. తన భార్య లక్ష్మీ పద్మావతి ఐదేళ్ల నుంచే జనసేనలో పనిచేస్తున్నారని, ఆమె వల్లే తాను జనసేనలోకి వస్తున్నానని తెలిపారు. తొలిసారిగా పవన్‌ను కలిసినప్పుడు అనేక విషయాలు చర్చించామన్నారు. పార్టీలోకి రావాలని పవన్ ఆహ్వానించిన వెంటనే తాను ఓకే చెప్పానన్నారు. పవన్ ఎక్కడి నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచే పోటీ చేస్తానన్నారు.

పెళ్లిపేరుతో మోసం

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరుక్రైం

వాట్సాప్‌లు, ఫోన్ల ద్వారా ట్రాప్ చేసి ప్రేమ పేరుతో ఆడవారిని మోసం చేసే ఓ వ్యక్తిని శుక్రవారం బాలాజీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతను ఓ యువతి నుంచి రూ.20 లక్షలు కాజేసినట్లు సమాచారం. నెల్లూరు ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన ఓ యువతిని వాట్సాప్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమె వద్ద నుంచి రూ.20లక్షల నగదు, బంగారు ఆభరణాలను గుంజుకుని, ఆమెను వదిలేశాడు. దాంతో ఆమె తల్లిదండ్రులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నగర డిఎస్‌పి మురళీకృష్ణ విలేకరుల ఎదుట నిందితుడిని హాజరు పరిచారు. ఆయన మాట్లాడుతూ నిందితుడు వాసు గతంలో డెకాయిటీగా ఉండేవాడని తెలిపారు. ఫోన్ల ద్వారా ఆడవారిని మోసం చేయడంలో ఇతను మంచి నేర్పరని తెలిపారు. రికార్డుల ప్రకారం అతనిపై నాలుగు కేసులున్నాయన్నారు. నిందితుడికి ఎర్రచందనం స్మగ్లర్లతో పరిచయాలున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌టిసి బస్సు బోల్తా

ప్రజాశక్తి-ఆత్మకూరు:ఆర్‌టిసి బస్సు బోల్తా పడి 15 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలో శుక్రవారం జరిగింది.

సంపాదకీయం

పీపుల్స్ బ్రెగ్జిట్ కావాలి!

బ్రిటన్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు అక్కడ రాజకీయ సంక్షోభ తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ (ఇయు) నుంచి బ్రిటన్ వైదొలగడానికి సంబంధించి థెరిసా మే కుదుర్చుకున్న ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటు దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్ 432-202 ఓట్ల తేడాతో తిరస్కరించడం, ఆ వెంటనే ఆమె ప్రభుత్వం అవిశ్వాసం ఎదుర్కోవాల్సి రావడం ఇవన్నీ టోరీ ప్రభుత్వ దుస్థితిని తెలియజేస్తున్నాయి. ఈ రాజకీయ సంక్షోభానికి మూలాలు 2016 జూన్ రిఫరెండమ్‌లో ఉన్నాయి. ఇయు నుంచి బ్రిటన్ బయటకు రావాలని ఆ రిఫరెండమ్‌లో మెజారిటీ బ్రిటిష్ ప్రజలు స్పష్టంగా తీర్పు చెప్పారు. 1971 నుంచి ఇయులో కొనసాగుతున్న బ్రిటన్ ఇటువంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం ఆర్థిక సంక్షోభం. ఈ సంక్షోభానికి మూల కారణమైన నయా ఉదారవాద విధానాలను మార్చుకోవడానికి బదులు వాటినే మరింత ఉధృతంగా అమలు చేయడానికి టోరీ ప్రభుత్వం పూనుకుంది. దీంతో పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోయాయి. పొదుపు చర్యల పేరుతో సంక్షేమ రంగానికి నిధుల కోత, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను కారు చౌకగా అమ్మివేయడం వంటి చర్యలు మెజార్టీ ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టాయి. యూరోపియన్ యూనియన్ (ఇయు) అనేది బహుళజాతి సంస్థల క్రీడాంగణంగా మారింది. ఇయు సింగిల్ మార్కెట్, కస్టమ్స్ యూనియన్ నిబంధనలు బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడేందుకే పనిచేస్తున్నాయని ప్రజలకు అర్థమైంది. బ్రిటన్ కార్మికవర్గంతో సహా మెజార్టీ ప్రజానీకం ఈ కూటమి నుంచి బ్రిటన్ బయటకు రావాలని కోరుకున్నారు. 2016 జూన్ రిఫరెండమ్‌లో 52-48 శాతం తేడాతో బ్రెగ్జిట్‌కు ప్రజలు ఆమోదం తెలిపారు. ఈ రిఫరెండమ్ తీర్పును వెంటనే అమలు చేయడానికి బదులు దీనికి తూట్లు పొడవడానికే థెరిసా ప్రభుత్వం, ఇయు యత్నిస్తున్నాయి. ఇయుకు సారథ్యం వహిస్తున్న ఫ్రాన్స్, జర్మనీ నేతలు, టోరీ కేబినెట్ మంత్రులు, బడా వ్యాపార వేత్తలు, ఇయు అనుకూల, లిబరల్ డెమొక్రటిక్ ఎంపీలు కూడబలుక్కుని బ్రెగ్జిట్‌ను జాప్యం చేయడానికి, వీలైతే రిఫరెండమ్ తీర్పును వమ్ము చేయడానికి ఒక పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నాయి. బ్రిటన్ ఇయు నుంచి బయటకు వచ్చినా ఇయు సింగిల్ మార్కెట్ వ్యవస్థ, కస్టమ్స్ నిబంధనలతో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ ముడిపడి వుండాలని బ్రిటన్‌లోని బడా కార్పొరేట్ సంస్థలు, వ్యాపార వేత్తలు కోరుకుంటున్నారు. పెట్టుబడులు యూరోపియన్ విపణిలో ఎక్కడికైనా స్వేచ్ఛగా ప్రవహించే పరిస్థితి వుండాలని, ఎగుమతులపై నియంత్రణలు చాలా పరిమితంగా వుండాలని వారు కోరుకుంటున్నారు. మరో వైపు ఇయు నిబంధనలు, ఒప్పందాలు, ఇయు కమిషన్, ఇయు సెంట్రల్ బ్యాంకు, ఇయు కోర్టు ఆఫ్ జస్టిస్ చక్రబంధంలో చిక్కుకున్న బ్రిటన్ ఈ బంధనాలను ఛేదించుకుని బయటకు రావాలని, ఆర్థిక సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవాలని, తిరోగామి పన్నుల విధానానికి స్వస్తి పలకాలని, కార్మికుల హక్కులకు గ్యారంటీ, ఉపాధితో కూడిన సుస్థిర అభివృద్ధి కావాలని, మార్కెట్ శక్తులు జోక్యం ఉండరాదని బ్రిటన్ కార్మికవర్గంతో సహా మెజార్టీ ప్రజలు కోరుకుంటున్నారు. దీనినే పీపుల్స్ బ్రెగ్జిట్ అంటున్నారు. ఇయుతో థెరిసా కుదుర్చుకున్న విడాకుల ఒప్పందం స్వల్ప మార్పులతో ఇప్పుడున్న ఇయు సింగిల్ మార్కెట్ వ్యవస్థనే కొనసాగించేదిగా వుంది. ఇది రిఫరెండమ్ తీర్పు స్ఫూర్తికే విరుద్ధం. నిరుద్యోగం, పేదరికం, సామాజిక న్యాయం, కార్మిక హక్కులు వంటి వాటికి ఈ ఒప్పందం ఎలాంటి పరిష్కారం చూపలేకపోతోంది. లేబర్ పార్టీ, బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ఈ కారణంతోనే దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బోగస్ బ్రెగ్జిట్ కాదు, పీపుల్స్ బ్రెగ్జిట్ కావాలని గొంతెత్తాయి. థెరిసా ప్రభుత్వం తన బ్రెగ్జిట్ డీల్‌ను సొంత పార్టీ ఎంపీలే వ్యతిరేకిస్తున్నారని తెలిసి కూడా మొండిగా పార్లమెంటులో ఓటింగ్‌కు పెట్టి దారుణ పరాభవాన్ని చవిచూసింది. ఆమె డీల్‌ను పార్లమెంటు 230 ఓట్ల తేడాతో తిరస్కరించాక కూడా థెరిసా కుర్చీ పట్టుకుని వేలాడుతున్నారు. 1940లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓ బిల్లు 81 ఓట్ల తేడాతో వీగిపోతే, అప్పటి ప్రధాని నెవెల్లీ చాంబర్లీన్ వెంటనే తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు 200 మందికిపైగా ఓట్ల తేడాతో వీగిపోయినా థెరిసాకు నైతిక బాధ్యత గుర్తుకురాకపోవడం శోచనీయం. పార్లమెంటు తిరస్కరించిన దానినే స్వల్ప మార్పులతో మాసిపూసి మారేడు కాయ చేసి ప్లాన్ బి పేరుతో 29న మళ్లీ పార్లమెంటు ముందుకు వస్తున్నారు.. దీనిని ఆమోదించకుంటే ఎలాంటి ఒప్పందం లేకుండానే ఇయు నుంచి బ్రిటన్ నిష్క్రమించాల్సి వుంటుందని, అది దేశానికి తీవ్ర చేటు కలిగిస్తుందని బెదిరిస్తున్నారు. నో డీల్ తో నిష్క్రమించాలని కొందరు ఎంపీలు కోరుతుండగా, రెండవ రిఫరెండమ్‌కు వెళ్లాలని మరి కొందరు పట్టుపడుతున్నారు. ఈ రెండు డిమాండ్లు ఆచరణలో 2016 రిఫరెండమ్‌ను తుంగలో తొక్కేందుకు ఉద్దేశించినవే. టోరి ప్రభుత్వాన్ని గద్దె దించినప్పుడే పీపుల్స్ బ్రెగ్జిట్ సాధ్యం. బ్రెగ్జిట్ తరువాత కూడా ఇయుతో ఆర్థిక సంబంధాలను బ్రిటన్ కొనసాగించడం తప్పు కాదు. అవసరం కూడా. అయితే అందుకోసం ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టరాదన్నదే వామపక్షాల వాదన. భవిష్యత్తులో లేబర్ పార్టీ అధికారంలోకి వస్తే బడా పెట్టుబడి దారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ముందరి కాళ్లకు బంధం వేసే ఎత్తుగడతోనే టోరీలు ఈ నాటకమాడుతున్నారు. ఇటువంటి యత్నాలను చైతన్యవంతమైన బ్రిటన్ కార్మికవర్గం, ప్రజలు తిప్పికొడతారనే ఆశిద్దాం.

ఇదీ విషయం




నేను భూమి మీద పడక ముందే
నా తల్లి గర్భంలోనే
అస్పృశ్యుడుగా పెరిగేను
హీన కుల ముద్రతో
ఈ పవిత్ర భారత భూమిపై పడి
కళ్లు తెరిచాను

\- గుర్రం జాషువా

ప్రజాప్రభాతం

గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు





ప్రభాత్ పట్నాయక్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రావటానికి కారణమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక విలక్షణ స్వభావం ఉంది. కావాలని అడిగిన తరువాత ఒక పక్షం రోజుల్లో ఉపాధి అందించాలని ఈ చట్టం చెబుతోంది. అలా ఉపాధి అందించలేనప్పుడు నిరుద్యోగ భృతి చెల్లించాలని కూడా ఈ చట్టం చెబుతోంది. ఈ చట్టం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైందనేది నిజం. అయితే ఇది ఉపాధిని హక్కుగా మార్చింది. బాగా చర్చించిన తరువాత పార్లమెంటు ఈ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. భారత రాజ్యాంగం సామాజిక, రాజకీయ హక్కులకు మాత్రమే హామీ ఇచ్చి ఆర్థిక హక్కులను విస్మరించిందనే లోపాన్ని...ఈ చట్టాన్ని రూపొందించి ఆచరణలో పార్లమెంట్ సరిదిద్దింది.

కాబట్టి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ఒక నూతన పరిస్థితి ఏర్పడింది. గతంలో కూడా పేదరికం నిర్మూలనకు ఉద్దేశించిన పనికి ఆహారం వంటి పథకాలున్నాయి. అయితే వాటిలో హామీలు ఏమీ లేవు. వాటికి బడ్జెట్ కేటాయింపులు ఉండేవి. అవి ప్రతి సంవత్సరం మారుతూ ఉండేవి. ఆ కేటాయింపులు ఒక్కోసారి పెరగటం, మరోసారి తరగటం జరిగేది. అయితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వీటికి పూర్తిగా భిన్నమైంది. ఈ చట్టం ఉపాధికి హామీని ఇచ్చింది. ఆ క్రమంలో ఆర్థిక హక్కును సృష్టించటమే కాకుండా పౌరసత్వ భావనకు లోతైన అర్థాన్ని ఇచ్చింది. బిచ్చగాళ్ళతో సహా ప్రతి పౌరుడు తాను కొన్న సరుకులపై పరోక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి పన్ను కడతాడు. కానీ గతంలో రాజ్యం అందుకు బదులుగా ఆచరణలో పౌరులకు ఏమీ చేసేదికాదు. అది పౌరులకు 'భద్రత'ను కల్పించిందని ఎవరైనా చెబితే అది చాలా చిన్న విషయం అవుతుంది. ఎందుకంటే పేదలకు 'భద్రత' కల్పించటం అర్థరహితం అవుతుంది. అందుకు భిన్నంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక నూతన శకానికి తెర లేపుతున్నానని వాగ్దానం చేసింది. ఈ పథకం ద్వారా రాజ్యం తన పౌరులకు కొంతవరకు ఆర్థిక భద్రతను కల్పించటానికి ముందుకు వచ్చింది. అంటే పేదలకు అది ఎంతోకొంత మేలు చేస్తుంది.

గతంలో కూడా పేదరికం నిర్మూలనకు ఉద్దేశించిన పనికి ఆహారం వంటి పథకాలున్నాయి. అయితే వాటిలో హామీలు ఏమీ లేవు. వాటికి బడ్జెట్ కేటాయింపులు ఉండేవి. అవి ప్రతి సంవత్సరం మారుతూ ఉండేవి. ఆ కేటాయింపులు ఒక్కోసారి పెరగటం, మరోసారి తరగటం జరిగేది. అయితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వీటికి పూర్తిగా భిన్నమైంది. ఈ చట్టం ఉపాధికి హామీని ఇచ్చింది.

ఈ పథకం కింద ఉపాధిని పొందుతున్నవారిలో 40 శాతం దళిత, ఆదివాసీ కుటుంబాలకు చెందినవారే. పాలక వర్గాలకుండే కుల వివక్ష కారణంగాను, వర్గ వైషమ్యాల కారణంగాను ఈ వాగ్దానం అమలులో తీవ్రమైన ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. యుపిఏ-2 పాలనలో చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చేయవలసిన వాస్తవ బడ్జెట్ కేటాయింపులలో కోతను విధించటం ద్వారా ఈ పథకానికి తూట్లు పొడవటం మొదలయింది. 'ఈ పథకం డిమాండ్ ను అనుసరించి అమలు చేసేది. కనక అవసరమైతే అదనపు కేటాయింపులు చేయటం జరుగుతుంది. బడ్జెట్‌లో చేసిన కేటాయింపులనుబట్టి అభిప్రా యానికి రాకూడదు' అంటూ ఈ పథక కేటాయింపులకు కోత పెట్టడాన్ని ఆయన సమర్థించుకున్నారు. అయితే అలా చేయటం వల్ల కేటాయింపులకు మించి డిమాండ్ ఏర్పడినప్పుడు వేతన బకాయిలు పోగుపడ్డాయి. కేటాయింపుల కంటే డిమాండ్ నిరంతరం పెరుగుతుండగా ఒకవేళ కేటాయింపులను పెంచకపోతే కాలక్రమంలో వేతన బకాయిలు పెరిగి పోతాయి. ప్రస్తుతం ఈ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. వేతన బకాయిలు నిరంతరం పెరిగి పోతున్నాయి. అంటే సంవత్సర కాలంలో అనేక మంది కార్మికులకు వేతనాలు అందవు. అంతే కాకుండా వేతనాలను అందుకోవటానికి పట్టే సగటు కాలం కూడా నిరంతరం పెరుగుతూ ఉంటుంది. వేతనాలు సకాలంలో అందని స్థితిలో కార్మికులు ఈ పథకం నుంచి నిష్క్ర మించటం మొదలెడతారు. తత్ఫలితంగా ఈ పథకం కింద పనికి వుండే డిమాండ్ ఏదో ఒక స్థితిలో దెబ్బ తింటుంది. అదే సమయంలో చట్టప్రకారం నిరుద్యోగానికి చేయవలసిన చెల్లింపులు చెల్లించకుండా, కనీసం తగిన సమయంలో పేర్లు నమోదు చేసుకున్న వారికి కూడా పని ఇవ్వకుండా, దరఖాస్తు దారులను రిజిస్టరు చేయకుండా డిమాండ్‌ను తగ్గించే ధోరణి కనపడుతోంది. ఒక ఆర్థిక హక్కుగా ఉండవలసిన హక్కును నిర్వీర్యం చేయటం జరుగుతోంది. రాజ్యం దయాదాక్షిణ్యాలతో పేదలకు ఎంతోకొంత ఉపశమనం అందించే మరో పేదరిక వ్యతిరేక కార్యక్రమంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్చటం జరిగింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేదరిక వ్యతిరేక కార్యక్రమంగా కూడా గణనీయమైన విస్తృతి ఉంది. ఈ కార్యక్రమం మొదలయినప్పటి నుంచి దేశం లోని ప్రతి మూడు గ్రామీణ కుటుంబాలలో ఒకదానికి ఎప్పుడో ఒకప్పుడు పని దొరికింది. 2017-18లోనే ఈ కార్యక్రమం కింద ఎనిమిది కోట్ల మంది ప్రజలకు పని దొరికింది. ఆ సంవత్సరంలో ప్రతి కుటుంబానికి సగటున 46 రోజులపాటు పని దొరికింది. ప్రపంచంలోనే అత్యంత ఉద్యోగితను సృష్టించే పథకం ఇది. అయితే రానురాను ఈ కార్యక్రమానికి చేసే కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయి. నిజానికి ఇది ఉపాధి హామీ పథకం అవటం అటుంచి ఉపాధిని సృష్టించే కార్యక్రమంగా కూడా దీని విస్తృతి కుచించుకు పోతున్నది. ఇంతకు ముందే చెప్పినట్టు ఒకవేళ ఈ పథకానికి చేస్తున్న కేటాయింపులు నిలకడగా ఉన్నట్టయితే లేక ప్రతి సంవత్సరం కావలసిన దానికంటే కేటాయింపులు తక్కువగా వుంటే కాలక్రమంలో వేతన బకాయిలు పెరుగుతాయి. అటువంటి పరిస్థితులలో నికర కేటాయింపులు, నికర వేతన బకాయిలు తగ్గుతాయి. అయితే వాస్తవంలో జరుగుతున్నదేమంటే చేస్తున్న కేటాయింపు లలో నిలకడ ఉండటం లేదు. నికర కేటాయింపులు తగ్గటం వలన నికర వేతన బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయి. ఉదాహరణకు 2017-18 సంవత్సరంలో ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసిన తరువాత జరిగిన కేటాయింపు 2010-11 సంవత్సరంలో జరిగిన కేటాయింపు కంటే తక్కువగా ఉంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2012-13లో కాలయాపనతో జరిగిన వేతన చెల్లింపులు 39 శాతం ఉండగా 2016-17లో కాలయాపనతో జరిగిన వేతన చెల్లింపులు 56 శాతంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

వేతన బకాయిలను కూడా లెక్క లోకి తీసుకోకుండా చేసే స్థూల కేటాయింపులో తగ్గుదల స్థూల జాతీయోత్పత్తితో పోల్చి చూసినప్పుడు చాలా తీవ్రంగా ఉంది. ఈ కార్యక్రమం సరియైన రీతిలో నడవాలంటే స్థూల జాతీయోత్పత్తిలో 1.7 శాతం కేటాయించాలని ప్రపంచ బ్యాంకు కూడా అంచనా వేసింది. అందుకు భిన్నంగా 2017-18 సంవత్సరంలో జరిగిన కేటాయింపు (వాస్తవంలో చేసిన వ్యయం కాదు) కేవలం 0.28 శాతం మాత్రమే. 2010-11 సంవత్సరంలో 0.58 శాతంగాను, 2011-12 సంవత్సరంలో 0.34 శాతంగాను ఉన్న కేటాయింపుల కంటే 2017-18 సంవత్సరంలో చేసిన కేటాయింపు తక్కువగా ఉంది. వాస్తవ వ్యయాలను, అంతకు ముందటి సంవత్సరాల నికర రుణాలను చూసినప్పుడు స్థూల జాతీయోత్పత్తిలో అటువంటి నికర వ్యయం వాటా 2012-13వ సంవత్సరంలో 0.36 శాతం ఉంటే 2016-17 సంవత్సరం కల్లా అది 0.30 శాతం కంటే కిందకు దిగజారింది. కాబట్టి మనం ఏవిధంగా చూసినప్పటికీ స్థూల జాతీయోత్పత్తిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం కేటాయిస్తున్న నిధుల శాతం సాపేక్షంగా చూసినప్పుడు కాలక్రమంలో తగ్గిపోతు న్నది. అయితే వేతనాల చెల్లింపులు సకాలంలో జరగటం లేదనే వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరించటం లేదు. నిజానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేసే వేతనాల చెల్లింపులలో 90 శాతం 15 రోజుల లోపు జరుగుతున్నాయని ప్రభుత్వం అంటోంది. అయితే ఇది పూర్తిగా అబద్ధం. 3500 గ్రామ పంచాయతీలను ఒక శాంపిల్‌గా తీసుకుని ఒక పరిశోధకుల బృందం సవివరంగా చేసిన అధ్యయనాన్ని జనవరి 4న కొత్త ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక పత్రికా సమావేశంలో విడుదల చేశారు. ఈ అధ్యయనం ప్రకారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనికి చేయవలసిన వేతన చెల్లింపులు సగటున 50 రోజులు ఆలస్యంగా జరుగుతున్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కార్మికులకు ఎదురవుతున్న ఇతర ప్రతిబంధకాలకు అదనంగా సకాలంలో అందవలసిన వేతనాలను ఆధార్‌తో లింకు చేయాలని అంటున్నారు. తత్ఫలితంగా ఈ కార్యక్రమం కింద లభిస్తున్న పనికిగల డిమాండ్ మందగిస్తుంది.


దేశంలో వేగంగా పెరుగుతున్న నిరుద్యోగితపై చాలా కాలం తరువాత దృష్టిని కేంద్రీకరించారు. అటువంటి నిరుద్యోగంపై అన్ని ప్రభుత్వ వ్యయాలకంటే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక బ్రహ్మాండమైన ఆయుధంగా పని చేయగలదు. ఒకవేళ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అనుకుంటే ఈ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి బదులుగా దానిపై మరింతగా వ్యయం చేయాలి. అయితే ప్రస్తుత ధోరణి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేదిగానే ఉంది.

వాస్తవంలో డిమాండ్ చేసిన పనిని కూడా ఇవ్వటంలేదు. అటువంటి పరిస్థితిలో చట్ట ప్రకారం చెల్లించవలసిన నిరుద్యోగ భృతి కూడా చెల్లించటం లేదు. నిజానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక డిమాండ్ ఆధారిత కార్యక్రమంగా పని చేయటం లేదనేది సుస్పష్టం. అందు కోసం అందుబాటులో ఉంచే వనరులపై దాని విస్తృతి ఆధారపడి ఉంటుంది. ఒక డిమాండ్ ఆధారిత కార్యక్రమానికి వనరులు అందుబాటులో లేకపోవటమనే పరిస్థితిలో వైరుధ్యం ఉంది. అటువంటి కార్యక్రమానికి ముందుగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలి. నిధులు అందుబాటులో ఉండటాన్నిబట్టి ప్రజల ఆర్థిక హక్కును ప్రతిబింబించే అటువంటి కార్యక్రమాన్ని నిర్వహించటం జరగ కూడదు. ఇటువంటి పథకానికి నిధులను కేటాయించటం కోసం ప్రజల హక్కును ప్రతిబింబించని కార్యక్రమాలపై ప్రభుత్వం చేసే వ్యయాన్ని తగ్గించుకోవాలి. అయితే ఆచరణలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందని మనం గమనిస్తాం. అంటే ఇతర వ్యయాలకు ప్రాధాన్యతను ఇచ్చిన తరువాత మిగిలిందే ఈ పథకానికి కేటాయింపులు జరుగుతున్నాయి. పర్యవసానంగా పనికిగల డిమాండ్‌ను అనుసరించి చేయవలసిన వ్యయానికి సరిపడా నిధులు అందుబాటులో ఉండటం లేదు.

పైన పేర్కొన్న అధ్యయనం ప్రకారం పని కోసం వస్తున్న డిమాండ్‌లో భాగంగా అధికారికంగా రిజిస్టర్ చేసుకున్న వారిలో కూడా 68 శాతం కంటే ఎక్కువ మందికి వాస్తవంలో పని కల్పించటం లేదు. అధికారికంగా రిజిస్టర్ చేసుకున్న పని డిమాండ్‌లో వాస్తవంలో సగం మందికి కూడా అందుబాటులోకి రావటం లేదు. ఈ నిష్పత్తి పెరుగుతూ ఉంది. ఆ విధంగా ప్రజల ఆర్థిక హక్కు రద్దవుతోంది. ఇది ఈ చట్టాన్ని చేసిన పార్లమెంటుపై దాడితో సమానం అవుతుంది. ఈ పథకాన్ని ఉద్యోగితను సృష్టించే సామాన్యమైన కార్యక్రమంగా తీసుకున్నా దీని విస్తృతి కాలక్రమంలో తగ్గిపోయింది. ఇదో విపరీత స్థితి. దేశంలో వేగంగా పెరుగుతున్న నిరుద్యోగితపై చాలా కాలం తరువాత దృష్టిని కేంద్రీకరించారు. అటువంటి నిరుద్యోగంపై అన్ని ప్రభుత్వ వ్యయాలకంటే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక బ్రహ్మాండమైన ఆయుధంగా పని చేయగలదు. ఒకవేళ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అనుకుంటే ఈ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి బదులుగా దానిపై మరింతగా వ్యయం చేయాలి. అయితే ప్రస్తుత ధోరణి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేదిగానే ఉంది.

సందర్భం

జోహార్ కా॥ టి ఎన్



గుండెల నిండా ధైర్యం ఉంది
పదాల నిండా పదునే ఉంది
మానవత్వం నిండుగ ఉంది
మంచిమాట దండిగ ఉంది
ఎవరయ్యా నీవెవరయ్యా

పేదోడివెంటే పయనం నీది
సగటు జీవి స్వరమే నీది
జడిలో అలజడిలో మా నీడగ ఉండే
ఎవరయ్యా నీవెవరయ్యా

కణకణమండే సూరీడల్లే
సంద్రంలోని అలలకిమల్లె
జనసంద్రంలో నిత్యం తిరిగే
ఎవరయ్యా నీవెవరయ్యా

నిత్యం జ్వలించు నిప్పుకి మల్లే
బాధని మాపే బంధువుమల్లే
నీకుమల్లే నువు జీవించే
నీవెవరో కాదయ్యా
ఖండితంగ నువు కమ్యూనిస్టువయ్యా

చీకటిలో మెరుపే నీవు
కరిగే కొవ్వొత్తివి నీవు
కడదాకా వెలిగే నీవు
కడతేరని ధైర్యం నీవు

ఉద్యమాల ఊపిరి నీవు
అరుణారుణ కాంతివి నీవు
దండులోన కండవు నీవు
ముందుండే నాయకుడీవు

కులమతాల అడ్డుగోడలను
కూల్చే నిర్మాతవు నీవు
వేరుపరచు రాజకీయులకు
అడ్డుండే ఐక్యత నీవు

కష్ట జీవి చెమటవు నీవు
తిష్టజీవి దడవే నీవు
న్యాయానికి చెలిమే నీవు
సరియైన నేస్తం నీవు

కమ్యూనిస్టువయ్యా
నీవు నిజంగా కమ్యూనిస్టువయ్యా

(దివంగత కా॥ టి నరసింహయ్యకు అరుణాంజలి)

\- జంధ్యాల రఘుబాబు

జనవాక్యం

ఓటు మనందరి హక్కు



మన ఓటు హక్కును మనకు తెలియకుండానే తొలగించేస్తున్నారు. లేదా మన ఓటు వేరెవరో వేసేస్తున్నారు. మన ప్రమేయం లేకుండా మన ఓటు ఎలా పోతుంది? దానికి కారకులెవరు? తెలుసుకోవాలన్న ప్రయత్నం చేద్దామన్నా, ఎవరిని ప్రశ్నించాలో తెలియదు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇది ప్రధాన లోపం. ఓటు నమోదు చేయడానికి ఎంతో మంది అధికారులు, ఎన్నో ప్రశ్నలు, ఎన్నెన్నో తనిఖీలు ఉంటాయి. మరి ఓటు తీసేటప్పుడు అవన్నీ పాటించరా? వేలి ముద్రతో లక్షలకు లక్షలు ఒక ఖాతా నుండి ఇంకొక ఖాతాకు తరలించే అవకాశం వున్న దేశంలో వేలి ముద్ర ద్వారా మన ఓటును వేరే వాళ్లు వేయకుండా ఆపలేమా? ఆ వ్యవస్థను తెచ్చుకోలేమా? అంతెందుకు, ఇంట్లో కూర్చొనే షాపింగ్ చేస్తున్నాం. సెల్‌ఫోన్‌తో లక్షలకు లక్షలు బదిలీ చేస్తున్నాం. అటువంటిది ఇంట్లో కూర్చొని ఓటు వేయలేమా? ఈవిధమైన అవకాశం వస్తే, ఎన్నికల సమయంలో సుదూర ప్రాంతాలలో వున్న వారు, పోలింగ్ బూత్‌కు వెళ్లలేని వారందరికీ ఓటు వేసే అవకాశం వస్తుంది. అలా చేస్తే ఓటింగ్ శాతం కచ్చితంగా పెరుగుతుంది. పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా తగ్గుతుంది. దీనివల్ల నిర్వహణ ఖర్చు కూడా భారీగా తగ్గే అవకాశం వుంది. ఓటు మనందరి హక్కు. దాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిది.

బి శ్రీనివాస్, విజయవాడ.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

కామెంట్

వ్యక్తుల గోప్యతను హరిస్తున్న 'నిఘా'

'ఏ కంప్యూటర్ నుంచి వచ్చిన, స్వీకరించిన, దాచుకున్న సమాచారాన్ని అయినా అడ్డగించడానికి, పర్యవేక్షించడానికి, సంకేత లిపిని ఛేదించడానికి' పది ప్రభుత్వ సంస్థలకు అధికారమిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల ఉత్తర్వు జారీ చేసింది. 2000 సంవత్సరం నాటి ఐ.టి. చట్టం, 2009 నాటి నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు ఇచ్చారు. వాట్సప్, టెలిగ్రాం వంటి విషయ ప్రసార మాధ్యమాలపై నిఘా వేసేందుకు 2011 నాటి ఐ.టి. చట్టం నిబంధనలను సవరించాలని కూడా ఆలోచిస్తున్నారు. ఈ వేదికలలో 'చట్ట వ్యతిరేక' సమాచారాన్ని ఎవరు ఉంచారో వారి 'ఆనవాళ్లు' తెలియజేయమని కోరడానికి నిబంధనలను మార్చాలనుకుంటున్నారు. దీనివల్ల రెండు వైపులా సంకేత నిక్షిప్త సందేశాల ప్రయోజనమే దెబ్బతింటుంది. వాట్సప్ వంటి వ్యవస్థలు సమాచారాన్ని నిల్వ చేసే గడువును పెంచడం కూడా ఈ సవరణల ఉద్దేశం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల ప్రజలకు భయం కలిగింది. వెర్రి ఆవేశానికి లోనవుతున్నారు. దీనికి ప్రభుత్వం తనకు బాగా అలవాటైన ధోరణిలోనే స్పందించింది. ఈ చట్టాలు యు.పి.ఎ. హయాంలోనే వచ్చాయని షరా మామూలుగా సమాధానం ఇచ్చింది.

ఈ ఉత్తర్వునే కాదు. అసలు ఐ.టి. చట్టాన్నే పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది. దానితో పాటు మన నిఘా విధానాన్ని కూడా పునస్సమీక్షించాలి. 2017లో పుట్టస్వామి కేసులో న్యాయస్థానం ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పును దృష్టిలో ఉంచుకుని ఈ పని చేయాలి. ఇన్నేళ్లుగా ప్రభుత్వం సమాచారంపై నిఘా వేయడం లేదని, అడ్డుకోవడం లేదని కాదు. మన దేశంలో ఏటా 9,000 ఫోన్ సంభాషణలను రహస్యంగా వింటున్నట్టు 2014 నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ



అధీనంలోని 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్' (సి-డాట్) కూడా 2013లో కేంద్ర పర్యవేక్షక వ్యవస్థకు రూపకల్పన చేసింది. ఇది స్వయం ప్రతిపత్తిగల వ్యవస్థ. సి-డాట్ వార్షిక నివేదికలో నిఘా పని 'సంపూర్ణమైంది' అని పేర్కొన్నారు.

ప్రజల జీవితాలు డిజిటల్ కార్యకలాపాలతో ముడిపడి పోయిన తర్వాత కంప్యూటర్లు, ఫోన్లు వారి జీవితంలో విడదీయరాని భాగాలయ్యాయి. ప్రభుత్వమే 'డిజిటల్ భారత్' అని ప్రచారం చేస్తున్నప్పుడు సమాచారాన్ని పరిరక్షించవలసిన బాధ్యత, గోప్యతకు విలువ ఇవ్వాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. వ్యక్తుల గోప్యతను పరిరక్షించడం అవసరం. అంతే తప్ప చట్టాల మీద చట్టాలు చేయడం కాదు. దేశ భద్రత సాకుతో గోప్యతను దెబ్బ తీయకూడదు. 1885 నాటి భారత టెలిగ్రాఫ్ చట్టం, 1898 నాటి భారత పోస్టాఫీసుల చట్టం, ఐ.టి. చట్టంలోని 69వ సెక్షన్ మొదలైనవన్నీ ఏదో ఒక రకంగా నిఘా వేయడానికి ఉద్దేశించినవే. ఇవన్నీ వలసవాదుల కాలం నాటివి. వీటి ప్రకారం ఏ సమాచారాన్ని అయినా అడ్డగించవచ్చు. నిఘా వేయవచ్చు. సంకేత నిక్షిప్త సమాచారాన్ని ఛేదించవచ్చు. ఇవన్నీ 'దేశ భద్రత, సార్వభౌమాధికారం, ఇతర దేశాలతో స్నేహ సంబంధాల' పేరుతోనే సాగుతున్నాయి.

సమాచారాన్ని పరిరక్షించే అంశంపై బి.ఎన్.శ్రీకృష్ణ కమిటీ కొన్ని అంశాలను స్పష్టంగా చెప్పింది. 'దాపరికం ఉన్న నిఘాకు అవకాశం ఉండకూడదు. అది పుట్టస్వామి తీర్పునకు అనుకూలం. నిఘా వేయడానికి అడ్డూ ఆపు, నిఘాకు పరిమితి ఉండాలి' అని పేర్కొంది. గోప్యత, భద్రత అంశాలను పరస్పరం పోటీగా నిలబెట్టడం కొత్త కాదు. అయితే ఈ చర్చ అసంపూర్ణంగా ఉంది.

మనం మాట్లాడతాం. చదువుతాం. పని చేస్తాం. బ్యాంకు పనులు చేస్తాం. మన భావాలు వ్యక్తం చేస్తాం. నిరసన తెలియజేస్తాం. అసమ్మతి వ్యక్తం చేస్తాం. వీటన్నింటికీ ఫోన్లు, కంప్యూటర్లు వినియోగించుకుంటాం. ప్రస్తుతం చట్ట వ్యతిరేక కార్య కలాపాలు, ప్రమాదాలు కూడా ఈ డిజిటల్ పరికరాల ఆధారంగానే జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వం వీటిని విస్తారంగా అణచి వేయడం, నిఘా వేసి ఉంచడం అంటే ప్రభుత్వం సర్వాంతర్యామి అవతారమెత్తి పెద్దన్న పాత్ర పోషించడమే.

సమాచారానికి రక్షణ లేనప్పుడు వ్యక్తుల గోప్యతను పరిరక్షించడం కచ్చితంగా వెనకపట్టు పడుతుంది. సమాచార రక్షణకు శ్రీకృష్ణ కమిటీ రూపొందించిన విధంగా చట్టం ఏదైనా రావచ్చునేమో. అయితే ఈ ప్రక్రియ ఎలా ఉంటుందో మాత్రం ప్రభుత్వం చెప్పడం లేదు. న్యాయ వ్యవస్థ పర్యవేక్షణకు వీలు లేకుండా ఐ.టి. చట్టంలో అస్పష్టత ఉంటే మొత్తం వ్యవహారం దాపరికంగానే మిగిలిపోతుంది. చట్టాలతోనూ, న్యాయ వ్యవస్థ పరిశీలనతోనూ నిమిత్తం లేకుండా ప్రభుత్వం ఉత్తర్వుల మీద ఉత్తర్వు జారీ చేస్తూ ఉంటుంది.

అవసరం కొద్దీ, ఏది ఎంత మోతాదు? సరైన ప్రక్రియేనా కాదా? అన్న విషయంతో సంబంధం లేకుండా ప్రభుత్వం ఆచరణలో సకల నియమాలనూ ఉల్లంఘిస్తూ ఏకమొత్తంగా నిఘా వేయడానికి ప్రయత్నిస్తే ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసం తగ్గుతుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులో సరిగ్గా ఇదే ప్రమాదం పొంచి ఉంది. జాతీయ భద్రత పేరుతో భారత ప్రభుత్వం ఇటీవల అనేక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రశ్నార్థకమైన అనేక చర్యలు తీసుకుంది. ఆధార్ కార్డు వ్యవహారం, పెద్ద నోట్ల రద్దు మొదలైన అంశాలలో వ్యక్తుల ప్రైవేటు జీవితంలోకి తొంగి చూసే చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రజల విషయంలో దాపరికం లేకుండా పని చేసే అవకాశం కనిపించడం లేదు.

విషయ ప్రసారంలో సాంకేతిక మార్పులు వచ్చాక భారత టెలిగ్రాఫ్ చట్టం ఆమోదించినప్పటి నుంచి పరిస్థితి సమూలంగా మారిపోయింది. మనం మునుపటి కన్నా చాలా మందితో సమాచారం ఇచ్చి పుచ్చుకుంటున్నాం. ఇదివరకు ఎన్నడూ లేనంత మందితో సంబంధాలు పెట్టు కుంటున్నాం. ఫోన్లు, కంప్యూటర్లు, అంతర్జాలం పుణ్యమా అని మనం వాటిని సందేశాలో, సమాచారమో పంపడానికో మాత్రమే వినియోగిం చుకోవడం లేదు. మన వ్యక్తీకరణకు, మన నిత్య జీవితంతో అవి అవిభాజ్యం అయిపోయాయి. అందువల్ల 'ఒక వ్యక్తి ఫోన్లను, కంప్యూటర్లను, వాటి లోని సమాచారాన్ని ప్రభుత్వ వ్యవస్థలు గమనించవచ్చు, చూడవచ్చు, నిఘా వేయవచ్చు' అంటే ప్రజల జీవితాల్లో జోక్యం చేసుకోవడమే. మనం మాట్లాడతాం. చదువుతాం. పని చేస్తాం. బ్యాంకు పనులు చేస్తాం. మన భావాలు వ్యక్తం చేస్తాం. నిరసన తెలియజేస్తాం. అసమ్మతి వ్యక్తం చేస్తాం. వీటన్నింటికీ ఫోన్లు, కంప్యూటర్లు వినియోగించుకుంటాం. ప్రస్తుతం చట్ట వ్యతిరేక కార్య కలాపాలు, ప్రమాదాలు కూడా ఈ డిజిటల్ పరికరాల ఆధారంగానే జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వం వీటిని విస్తారంగా అణచి వేయడం, నిఘా వేసి ఉంచడం అంటే ప్రభుత్వం సర్వాంతర్యామి అవతారమెత్తి పెద్దన్న పాత్ర పోషించడమే. భారత నిఘా వ్యవస్థ స్వరూపమే సమగ్రంగా మారాల్సిన అవసరం ఉంది. గోప్యతకు భంగం కలగకూడదు. పుట్ట స్వామి కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలులోకి రావాలి. సమాచార పరిరక్షణకు చట్టరీత్యా రక్షణ ఉండాలి.

('ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకీయం)

'అనాథ' పాపకు పాలిచ్చిన కానిస్టేబులమ్మ!



కొద్దిరోజుల కిందటే హైదరాబాద్‌లో రోడ్డు మీద తల్లి వదిలేసిన ఓ చిన్నారికి అర్ధరాత్రి వెళ్లి పాలిచ్చిన కానిస్టేబుల్ ప్రియాంక గురించి చదివాం. తాజాగా బెంగళూరులోనూ అలాగే ఓ కానిస్టేబుల్ తనలోని మాతృత్వాన్ని చాటుకున్నారు.

బుధవారం ఉదయాన్నే నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిసరాల్లో చలికి వణుకుతూ, అత్యంత దీనస్థితిలో ఉన్న ఓ పసికందును ఉదయం నడకకు వెళ్లినవారు చూసి, వెంటనే తీసుకువెళ్ళి బెంగళూరులోని యెలహంక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఆ పాపకు సంబంధించిన పూర్తి వివరాలు కనుక్కొనే బాధ్యతను కానిస్టేబుల్ సంగీత హలిమణికి పై అధికారులు అప్పగించారు.

ఆమె ఆస్పత్రికి వెళ్లేసరికి ఆ పసిబిడ్డకు వైద్యులు గ్లూకోజు సెలైన్ ఎక్కిస్తున్నారు. కడుపులో ఏమీ లేకపోవడంతో ఆ చిన్నారి నీరసంగా ఉంది. పాప శరీరమంతా దుమ్ము అంటుకుంది. చీమలు కుట్టినట్లు గాట్లు కనిపిస్తున్నాయి. ఆ బిడ్డ పరిస్థితి చూసి ఆమె మనసు కదిలిపోయింది. దాంతో, వెంటనే సంగీత తనకు పది నెలల బిడ్డ ఉంది కాబట్టి, ఈ పాపకు పాలివ్వగలను అని చెప్పారు. డాక్టర్ సరే అనడంతో ఆ పసికందుకు పాలు పట్టారు.

పాపకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉండడంతో.. కానిస్టేబుల్ పాలిచ్చిన వెంటనే నగరంలోని మరో ప్రభుత్వ ఆస్పత్రి వాణి విలాస్ ఆస్పత్రికి తరలించారు. ఆ పసికందు రక్తహీనతతో బాధపడుతోందని, శరీరంలో సరైన





మోతాదులో గ్లూకోజు లేదని అనిపించింది. అంతకు ముందురోజే ఆ పాప జన్మించిందని, 10-12 గంటల పాటు పాలు లేవని అర్థమైంది' అని యెలహంక జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఆస్మా టబాస్సుమ్ వివరించారు. 'ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉంది' అని వాణీ విలాస్ ఆస్పత్రికి చెందిన అధికారి డాక్టర్ రవీంద్రనాథ్ మేటి అంటున్నారు. కానిస్టేబుల్ సంగీత పాలు పట్టడం వల్లే పసికందు బతికిందని ఇద్దరు వైద్యులూ అన్నారు. 'చిన్నారిలో రక్తం, చక్కెర స్థాయి మెరుగుపడేందుకు చనుబాలు ఎంతగానో మేలు చేస్తాయి' అని డాక్టర్ మేటీ వివరించారు. తర్వాత వాణీ విలాస్ ఆస్పత్రికి వెళ్లి కూడా చిన్నారి పరిస్థితి గురించి ఆరా తీశారు సంగీత.

'పాప ఆరోగ్య పరిస్థితి బాగుందని వైద్యులు చెప్పారు. కళ్లు కూడా తెరవని ఆ పసికందును ఆస్పత్రిలో వదిలి వెళ్లడానికి నాకు మనసొప్పలేదు. ఇంటికి వెళ్లగానే నా బిడ్డను చూసిన తర్వాత నా మనసు కాస్త కుదుటపడింది' అని కానిస్టేబుల్ సంగీత చెప్పారు. 'చాలా గొప్ప పని చేశావు అని నా భర్త ప్రశంసించారు. నాకు ఇప్పటికే బిడ్డ ఉన్నందున, ఆ చిన్నారిని దత్తత తీసుకోలేకపోతున్నాను' అని సంగీత అన్నారు. తన పాలిచ్చి మాతృత్వాన్ని చాటుకున్న సంగీతను అందరూ ప్రశంసిస్తున్నారు. ★



ఆమె ఆలోచనలో పడింది!

వాళ్లిద్దరికీ రెండో వివాహమే. ఇరువైపుల పెద్దలు తీసుకొచ్చిన సంబంధమే. పెళ్లికి ముందే ఇద్దరూ అన్నీ మాట్లాడుకున్నారు. తీరా పెళ్లయ్యాక అతను సఖ్యతగా ఉంటున్నాగానీ, ఓ అచ్చటా ముచ్చటా లేకపోతే ఆమె ఏం అనుకోవాలి? ఈ పరిస్థితిని మామగారు అవకాశంగా తీసుకుని లైంగికంగా వేధిస్తుంటే ఆమె ఏం చేయాలి? అతను దగ్గరకు రాకుండానే ఆమెకు బిడ్డ ఎలా పుట్టాడు? ఇప్పుడు ఆమె పుట్టింట్లోనే ఎందుకుంది? ఈ పరిస్థితుల్లో ఉన్న ఆమెకు 'ఐద్వా అదాలత్' నుంచి ఎలాంటి న్యాయం జరిగింది? చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.

ఆమె పేరు చంద్రిక. అతని పేరు చంద్రమోహన్.

చంద్రికకు పదకొండేళ్లకే తెలిసీ తెలియని వయసులో పెళ్లి చేశారు. భర్తతో వెళ్లననీ బాగా ఏడ్చేసరికి ఆ సంబంధం ఇరువైపుల పెద్దలూ రద్దు చేసుకున్నారు. తర్వాత చంద్రిక తన చదువును కొనసాగించింది. ఎంబిఏ అయిపోయాక మళ్లీ చంద్రికకు పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించి, సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. చంద్రమోహన్ సంబంధం వచ్చింది.

చంద్రమోహన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పెళ్లయిన మూడేళ్లకే విడాకులయ్యాయి. అప్పటికి ఆమెకో కొడుకూ, ఆ పిల్లాడు ఆమెతోనే ఉన్నాడనీ, ఆమె మరో పెళ్లి చేసుకుందని చెప్పారు. దీంతో చంద్రిక వైపు వాళ్లూ సంబంధం కలుపుకోవడానికి సిద్ధపడ్డారు. ఇద్దరూ ఈడూ జోడూ బాగున్నారని అన్ని విషయాలూ మాట్లాడుకున్నాక పెళ్లి ఖాయం చేసుకున్నారు.

పెళ్లయ్యాక చంద్రిక ఎన్నో ఆశలతో కాపురానికి వెళ్లింది. చంద్రమోహన్ చంద్రికతో ఎంతసేపైనా మాట్లాడేవాడు. ఆమెకు తినేవి ఏం కావాలన్నా తెచ్చిపెట్టేవాడు. రాత్రయ్యాక అటు తిరిగి పడుకుండిపోయేవాడు. కొన్నిరోజుల తర్వాత చంద్రిక 'ఎందుకలా ప్రవర్తిస్తున్నారు? నేనంటే మీకు ఇష్టం లేదా? అలాంటిదేమన్నా ఉంటే పెళ్లికి ముందే చెప్పి ఉండాల్సింది కదా?' అని అడిగింది. 'అదేం లేదు. కాకపోతే ముందు జరిగిన పెళ్లి తాలూకా ఆలోచనల వల్ల నిన్ను దగ్గరకు తీసుకోలేకపోతున్నా!' అన్నాడు. దాంతో చంద్రిక 'మిమ్మల్ని నేనేం ఇబ్బందిపెట్టను. మీరు మామూలుగా ఉండటానికి ప్రయత్నించండి. వీకెండ్స్ బయటకు వెళ్దాం. మీ మనసు కూడా కాస్త తేలికపడుతుంది' అంటూ అతనికి సపోర్ట్‌గా నిలబడింది. అప్పటి నుంచి వారంతపు రోజుల్లో బయటకు వెళ్లేవాళ్లు. కానీ, ఏడాది గడుస్తున్నా అతనిలో ఏమార్పూ లేదు. దాంతో చంద్రిక 'మనం డాక్టర్ దగ్గరకు వెళదాం' అంది. 'దేనికి? 'మనమిలా ఎంతకాలం దూరంగా ఉండటం. ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళితే బెటర్ కదా?' అంది చంద్రిక. 'ఇప్పుడు ఆ ఆలోచనలేమీ లేవు. కాకపోతే నాన్నకి గుండెపోటు వచ్చింది. అందువల్ల నీ దగ్గరకు రాలేకపోతున్నా!' అన్నాడు. దీంతో అనుమానం వచ్చి, అత్తగారికి చెప్పింది. ఆమె కనీసం ఆశ్చర్యం కూడా వ్యక్తం చేయలేదు. పైగా మౌనంగా ఉండిపోయింది. అలా మరో ఏడాది గడిచిపోయింది.

చంద్రిక ఒత్తిడి చేస్తుంటే ఒకరోజు ఆమెను తీసుకుని డాక్టర్ దగ్గరకు వెళ్లాడు చంద్రమోహన్. 'డాక్టర్ నాన్నగారి అనారోగ్యం వల్ల నా మానసిక పరిస్థితి బాగోలేదు. ఆమెకు నేను దగ్గర కాలేకపోతున్నా. వేరే పద్ధతిలో సంతానం పొందాలనుకుంటున్నాం!' అన్నాడు. చంద్రిక అతని మాటలకు ఆశ్చర్యపోయింది. ఈలోపు డాక్టర్ మాట్లాడుతూ 'ఇది సహజంగా జరగడమే ఉత్తమం. మీ సమస్యకు కౌన్సెలింగ్ చేస్తే సరి అయిపోతుంది. ఆలోచించుకోండి!' అన్నారు. 'మరో ఆలోచన ఏమీ లేదు. ఇంతకుమించి వేరే మార్గమూ లేదు' అన్నాడు. అలా రెండుసార్లు డాక్టర్‌తో సంప్రదింపులు జరిపాక, చంద్రికనూ ఒప్పించాడు చంద్రమోహన్. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రికను చెక్ చేసి, చిన్న చిన్న సమస్యలుంటే వాటికి మందులు వాడారు. ఆ తర్వాత అతని వీర్యం కలెక్ట్ చేసి పంపమన్నారు. ఆరోజు చంద్రమోహన్ తీసుకుని వెళ్లాక, ఆసుపత్రి నుంచి ఫోన్ వచ్చింది. 'ఇంకా పంపలేదేంటండీ?' అని అడిగారు.



'అక్కడికే వచ్చారు' అంటూ సమాధానం చెప్పింది చంద్రిక. అప్పుడు అతని రూములో ల్యాప్‌టాప్ ఓపెన్ చేసే ఉంది. అందులో వీడియో ఒకటి ప్లే అవుతూ ఉంది. అది గే వీడియో. అప్పుడు చంద్రికకు అనుమానం వచ్చింది. అతను ల్యాప్‌టాప్ చేతిలోకి తీసుకుని, అన్నీ పరిశీలించింది. అతను తన ఆఫీసులో అతనితో సంభాషణలు, ఫొటోలు చూశాక.. స్వలింగ సంపర్కం కలిగి ఉన్నాడని అర్థమైంది.

అతను తిరిగి వచ్చాక అదే విషయంపై నిలదీసింది. అంతే! అతను ఒక్కసారి షాక్ అయ్యాడు. తర్వాత తేరుకుని 'అవును. నువ్వు అనుకునేది నిజమే. కానీ మా నాన్న బాధ పడలేకే పెళ్లి చేసుకున్నా. ఇప్పుడేమైంది. ఎలాగైనా నా ద్వారానేగా తల్లివి అవుతున్నావు. దయచేసి ఎవరికీ ఈ విషయం చెప్పకు.. ప్లీజ్' అంటూ ఆమె చేతులు పట్టుకుని ఏడ్చాడు. చంద్రిక కరిగిపోయింది. నాకూ ఇది రెండోపెళ్లి. అతను ఎలా ఉన్నా, నాకంటూ భర్త అనేవాడు ఉండటం ముఖ్యం అని తనకి తనే సర్దిచెప్పుకుంది. ఐదుసార్లు ఫెర్టిలిటీ పద్ధతి ప్రయోగంలో ఐదోసారి విజయవంతమైంది. చంద్రిక కన్సీవ్ అయ్యింది. భర్తకు ఇచ్చిన మాట ప్రకారం బయటకు మాత్రం విషయం చెప్పలేదు. అయితే మామగారి ప్రవర్తన సరిగా ఉండకపోవడం ఇబ్బందిగా అనిపించేది. ఆ విషయం భర్తకు చెప్పినా చంద్రమోహన్ పట్టించుకునేవాడు కాదు. ఈ పరిస్థితుల్లోనే బాబు పుట్టాడు. బాబు పుట్టిన తర్వాత మామగారి వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దాంతో చంద్రిక భర్తపై ఒత్తిడి చేసింది. అతను తండ్రికి చెప్పకపోగా, ఆమెనే మందలించాడు. పైగా ఈ మధ్య చిన్న విషయానికే ఆమెపై చేయి చేసుకుంటున్నాడు. ఈ పరిస్థితులపై ఒకరోజు చంద్రిక గట్టిగా నిలదీసింది. దాంతో తండ్రీ, కొడుకు, ఆడపడుచూ ముగ్గురూ కలిసి చంద్రికను కొట్టి, ఇంట్లోంచి గెంటేశారు. ఆమె నైటీలోనే ఉంది. ఏం చేయాలో పాలుపోక, అలాగే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కి వెళ్లింది. వాళ్ల సహకారంతో ఆమెను లోపలికి రానిచ్చారు. అప్పటికే వాళ్లమ్మకు ఫోన్ చేస్తే, వాళ్లూ వచ్చారు. చంద్రిక కొడుకును తీసుకుని, తల్లితో అలాగే వెళ్లిపోయింది. అలా వెళ్లి మూడేళ్లు గడిచిపోయాయి. పెద్దల సమక్షంలో రెండు మూడు పంచాయతీలు జరిగాయి.

చూడు చంద్రికా.. ఇంత చదువుకుని కూడా ఇంత అమాయకంగా ఉండటమే నీకింత నష్టం జరగడానికి కారణం. భార్యాభర్తల అనుబంధం అంటే పిల్లల్ని కనడానికో, సమాజానికి తెలియజేయడానికో కాదు. అది ప్రేమానురాగాల అనుబంధం. ఆత్మీయ అనురాగాల సంబంధం.

అందులో చంద్రిక కోరిందేంటంటే.. ఆ ఇంట్లో కాకుండా, బయటకు వస్తే అతనితో ఉంటానంది. తన బిడ్డకు తండ్రిగా ఉంటే చాలనుకుని, వాళ్లముందు అతని విషయం బయట పెట్టలేదు. దీంతో ఇప్పుడతను ఆమెపై రివర్స్‌లో మాట్లాడుతున్నాడు. ఈ పరిస్థితుల్లో ఆమె 'ఐద్వా అదాలత్'కు వచ్చింది.

చంద్రిక : నా భర్త బయటకు వచ్చి, నాతో ఉంటే చాలు.

బాధ్యులు అతనికి లేఖ పంపారు. అతను రాలేదు. ఫోన్ చేస్తే స్పందించలేదు. చంద్రిక మామగారు తర్వాత వారం ఫోన్ చేశారు.

'ఇక్కడ మీ సంఘం వాళ్లతోనే మాట్లాడుతున్నాం. బాబుని మాకు ఇచ్చేస్తే, ఆమెకు కావాల్సింది సొమ్మే కదా?! ఎంత కావాలంటే అంత పడేస్తామన్నాం. ఎన్నికలని వాయిదా పడింది. ఈలోపే ఆ అమ్మాయి మీ దగ్గరకు వచ్చింది' అన్నారు.

'ఇక్కడకు రండి. ఇక్కడైనా ఇబ్బంది లేదు. సమస్య సామరస్యంగా పరిష్కరించుకోవడమే!' అని నచ్చజెప్పారు బాధ్యులు.

'బాబును వచ్చేవారం పంపుతాను!' అని ఫోన్ పెట్టేశారు.

కానీ, తరువాతి వారం ఎవరూ రాలేదు. చంద్రమోహన్‌కి కాల్ చేస్తే, 'నేను మీ దగ్గరకు రాను. లీగల్‌గానే ప్రొసీడ్ అవుతాను' అన్నాడు. 'మీరు ముందు నుంచీ ప్లాన్‌గానే ఆమెతో ప్రవర్తించారు. అయినా మీరు చెప్పేవన్నీ చెల్లవు. మీవైపు తప్పు లేకపోతే మా దగ్గరకు రావడానికి ఇబ్బంది ఏంటి? ఇప్పటివరకూ ఆమె ఎవరి దగ్గర మీ గురించి బయటపెట్టలేదు. మాకు అన్నీ చెప్పింది' అన్నారు. 'మీరు నన్ను బెదిరిస్తున్నారు' అన్నాడు చంద్రమోహన్. 'మేము బెదిరించడం లేదు. విషయం చెప్తున్నాం!' అన్నా... అతను అలాగే మాట్లాడుతూ.. రానంటూ ఫోన్ పెట్టేశాడు.

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

బాధ్యులు ఏమన్నారంటే ...

చూడు చంద్రికా! నీవు ఇంత చదువుకుని, ఇంత అమాయకంగా ఉండటమే నీకింత నష్టం జరగడానికి కారణం. భార్యాభర్తల అనుబంధం అంటే పిల్లల్ని కనడానికో, సమాజానికి తెలియజేయడానికో కాదు. అది ప్రేమానురాగాల అనుబంధం. ఆత్మీయ అనురాగాల సంబంధం. వాళ్లబ్బాయి గురించి తెలిసినా, అతడి తల్లిదండ్రులు పెళ్లి చేశారు. వాళ్లబ్బాయి ఫర్‌ఫెక్ట్ అనుకోవడానికి నీకు వేరే పద్ధతిలో బిడ్డపుట్టేలా ప్లాన్ చేశారు. అందులో నువ్వు పావు అయ్యావు. వాళ్లు అనుకున్నది సాధించారు. నిన్ను వాళ్లంతా కలిసి మోసం చేశారు. ఇప్పటికైనా, నీకంటూ ఆత్మాభిమానం ఉందన్న విషయం తెలుసుకోవడం లేదు. నీవు ఇంత చదువుకుని, నీ కాళ్లపై నువ్వు నిలబడగలిగి, ఇంతలా వాళ్లకి లొంగిపోవాల్సిన ఆగత్యం ఏమిటి? నీలాంటి అమ్మాయిలు చాలామంది ఇలాగే అన్యాయం అయిపోతున్నారు. ఇప్పటికే ఇతని వల్ల నీతో కలిపి ఇద్దరు మోసపోయారు. మళ్లీ అతనికి మరో పెళ్లి చేసినా, ఆశ్చర్యపోనవసరం లేదు. అందుకే మోసం చేసి, అతను చట్టపరంగా ఎదుర్కొంటానంటే, నువ్వెందుకు జాలిపడాలి? ఆలోచించు.. నీ ఆలోచనే నీ జీవితాన్ని సరైన మార్గంలో పెడుతుంది.'

బాధ్యులు చెప్పాక చంద్రిక ఆలోచనలో పడింది. బంధువుల సహకారంతో లాయరు దగ్గరకు వెళ్లింది. ప్రస్తుతం చంద్రిక చట్టపరంగా ఎదుర్కోవడానికి సిద్ధపడింది.

'చంద్రిక నీ న్యాయపోరాటం వెనుక మేమూ ఉంటాం. ఆల్ ది బెస్ట్!' అన్నారు బాధ్యులు.

ధైర్యంగా సంసిద్ధమైంది చంద్రిక.

- శాంతిశ్రీ

గోంగూరతో ఆరోగ్యం

గోంగూరతో చేసే వంటకాలు చాలా ప్రత్యేకం. గోంగూరతో ఏ వంట చేసినా.. నోరూరాల్సిందే. ఇందులో దేశవాళీ గోగు, పుల్ల గోగు అని రకాలు ఉంటాయి. గోంగూరలో క్యాల్షియం, ఇనుము, విటమిన్-ఎ, సి, రైబోఫ్లేవిన్, ఫోలిక్‌యాసిడ్, పీచు ఎక్కువగా ఉంటుంది. ఇందులో ఐరన్ అధికం. ఇలా గోంగూరలో పలు ఔషధ గుణాలున్నాయని పరిశోధకులు చెబుతారు.



- వ్రణాలు, గడ్డలపైన గోంగూర ఆకును ఆముదంతో నూరి, వెచ్చగా చేసి వేస్తే త్వరగా తగ్గిపోతాయని నిపుణులు చెబుతున్నారు.
- రాత్రిపూట సరిగా చూపు కనపడక పోవటం, రేచీకటిలాంటి సమస్యలతో బాధపడేవారు భోజనంలో ఆకుకూరగానో, పచ్చడిగానో, ఊరగాయగానో గోంగూర వాడితే కొంతమేరకు మంచి ఫలితం ఉంటుంది.
- విరోచనాలు అధికంగా అవుతుంటే కొండ గోంగూర నుంచి తీసిన జిగురును నీటిలో కలిపి, తాగితే ఫలితముంటుంది. మిరపకాయలు వేయకుండా ఉప్పులో ఊరవేసిన గోంగూరను అన్నంతో తిన్నా విరోచనాలు తగ్గిపోతాయి.
- దగ్గు, ఆయాసం, తుమ్ములతో ఇబ్బంది పడేవారు గోంగూరను ఆహారంలో తీసుకుంటే స్వస్థత ఉంటుంది.
- శరీరంలో నీరు చేరినప్పుడు గోంగూర మేలు చేస్తుంది. అయితే అధిక ఉష్ణ శరీరతత్వం ఉన్నవారు గోంగూరను మితంగా తింటేనే మంచిది. ★

జీవన సౌరభం

స్నేహం కోసం ప్రాణమివ్వడం కష్టమేమీ కాదు. అంత త్యాగం చేసే స్నేహితుడ్ని పొందడమే కష్టం.

మీకోసం



రెండు స్పూన్లు బీట్‌రూట్ రసం, స్పూను పాలు కలిపి ముఖానికి రాసుకుని పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే.. చర్మం నిగారిస్తుంది.

అత్తయ్యను ఎలా మార్చాలి?

మా పాప వయస్సు పది సంవత్సరాలు. ఈ మధ్యనే పుష్పవతి అయ్యింది. తనకు శానిటరీ ప్యాడ్ పెట్టుకోవడం రాదు. ప్రస్తుతం అన్నీ నేనే దగ్గరుండి చేస్తున్నా. కానీ అత్తయ్య మాత్రం మరక చూడు ఎలా కనిపిస్తుందో అంటూ పాపను చీటికీ మాటికీ అరుస్తుంది. చిన్నపిల్ల తనకు చేతకాదు అని చెప్పినా ఆవిడ పట్టించుకోవడం లేదు. ఈ మధ్య పాపమీద చేయి కూడా చేసుకుంది. అత్తయ్యను ఎలా మార్చాలో అర్థం కావడం లేదు.

- ఓ సోదరి

వారిద్దరి మధ్య మీరెంతగా నలిగిపోతున్నారు అనే విషయం మీ ఉత్తరం స్పష్టం చేస్తోంది. ఈ విషయంలో మిగతా కుటుంబసభ్యుల సహాయమూ తీసుకోండి. మీ అత్తయ్య ఉద్వేగం, ఉద్రేకంలో ఉన్నప్పుడు కాకుండా మామూలు స్థితిలో ఉన్న సమయంలో మీ భర్త, ఆడపడుచుల ద్వారా ఆమెకు నెమ్మదిగా నచజెప్పే ప్రయత్నం చేయండి. పాప వయస్సు కేవలం పది సంవత్సరాలే అంటే తను ఇంకా నేర్చుకునే దశలోనే ఉంది. కాబట్టి తప్పులు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే పాపకు పీరియడ్ సమయంలోనే కాకుండా విడి సమయాల్లో కూడా శానిటరీ ప్యాడ్‌ను ఎలా ఉపయోగించాలి అనేది శిక్షణ ఇవ్వండి. ఎందుకంటే ఇబ్బంది కల్గిన తర్వాత కాకుండా ఆ సమస్య రాకుండా చూసుకుంటే మంచిది కదా! మీ అత్తగారి కోసమే కాకుండా పాపకు తనమీద తనకు ఆత్మవిశ్వాసం ఏర్పడటానికి ఈ శిక్షణ ఎంతగానో సహకరిస్తుంది. అలాగే మీ అత్తయ్య సానుకూల ధోరణిలో ఉన్నప్పుడు.. విడమర్చి చెప్పండి. పాపకు ఈ సమయంలో ఎలా శిక్షణ





డాక్టర్ పద్మజ, సైకాలజిస్టు

ఇవ్వాలి? అనే విషయాల్లో ఆమె సలహాలు, సూచనలు తీసుకోండి. ఇదంతా మీరిద్దరూ స్నేహపూరిత వాతావరణంలో కలిసి చర్చించుకోండి. అలాగనుక చేస్తే ఆమెకూ కష్టసుఖాలు తెలుస్తాయి. కొంతవరకు పాప విషయంలో ఆమె కోరుకునే పరిస్థితి ఉంటుంది. పాప కూడా ఆందోళనకు గురికాకుండా, నెమ్మదిగా అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకుంటుంది. ★

సెన్సెక్స్ ↑ 13
36,386

నిఫ్టీ ↑ 02
10,906

రూపాయి ↓ 13 పై
అమెరికా డాలరుకు రూ.
71.17

▮టొయోటా 'కమ్రి హైబ్రిడ్'..



టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) శుక్రవారం భారత మార్కెట్లోకి కొత్త 'కమ్రి హైబ్రిడ్' వెహికల్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ధరను రూ.36.95 లక్షలుగా నిర్ణయించింది. 2.5 లీటర్ ఇంజన్ కలిగిన ఈ కారును 9 ఎయిర్‌బ్యాగ్స్‌తో అందుబాటులోకి తెచ్చామని టికెఎం ఎండి మసకజు యోషిమురా పేర్కొన్నారు.

విప్రో క్యూ3 లాభాల్లో 32% వృద్ధి

న్యూఢిల్లీ : దేశంలో మూడో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ విప్రో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో 31.8 శాతం వృద్ధితో రూ.2,544.5 కోట్ల నికర లాభాలు సాధించింది. ఈ సందర్భంగా విప్రో తమ వాటాదారులకు బోనస్ షేర్లు అందించాలని నిర్ణయించింది. ప్రతీ మూడు షేర్లపై ఒక బోనస్ షేర్ అందించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. 2017-18 ఇదే క్యూ3లో రూ.1,930.1 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.13,669 కోట్లుగా ఉన్న కంపెనీ రెవెన్యూ.. క్రితం క్యూ3లో 10.17 శాతం పెరిగి రూ.15,059.5 కోట్లకు చేరింది.

పటిష్టమైన తమ క్లయింట్ల సంబంధాలు, తమ ఎత్తుగడల పెట్టుబడులు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తదితర అంశాలు క్రితం త్రైమాసికం ఫలితాలకు మద్దతు చేశాయని విప్రో సిఇఒ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి జడ్ నీముచ్‌వాలా పేర్కొన్నారు. వచ్చే మార్చి త్రైమాసికంలో తమ ఐటి సేవల వ్యాపారం రెవెన్యూ 2,047-2,088 మిలియన్ డాలర్ల మధ్య నమోదు కావొచ్చని ఆ కంపెనీ అంచనా వేసింది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఈ ఐటి కంపెనీ ప్రతీ షేర్‌పై రూ.1మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. 2019 జనవరి 30ని రికార్డు తేదిగా గుర్తించింది. శుక్రవారం బిఎస్ఇలో విప్రో షేర్ 2.91 శాతం పెరిగి రూ.346.20 వద్ద ముగిసింది.

రెండేళ్లలో 5000 శాఖలకు విస్తరణ

ఫిన్‌కేర్ ఎస్ఎఫ్‌బి సిఇఒ వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఆర్థిక సంవత్సరం 2020-21 నాటికి ఫిన్ కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బి) 5000 శాఖలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ సంస్థ ఎండి, సిఇఒ రాజేష్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు శుక్రవారం ఆయన ఇక్కడ వెల్లడించారు. ప్రస్తుతం 11 రాష్ట్రాలు.. 134 జిల్లాల్లో 532 శాఖలతో విస్తరించి ఉన్నామన్నారు. 17 మాసాల క్రితం ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న ఫ్యూచర్ ఫైనాన్స్, దిషా మైక్రో ఫైనాన్స్‌లు సంయుక్త భాగస్వామ్యంలో ఫిన్ కేర్ ఎస్ఎఫ్‌బిని ఏర్పాటు చేశాయన్నారు. వచ్చే మార్చి కల్లా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఐదేసి చొప్పున కొత్త శాఖలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం రూ.2,836 కోట్ల స్థూల రుణాలు, రూ.1432 కోట్ల డిపాజిట్లు కలిగి ఉన్నామన్నారు. ఇప్పటి వరకు 14 లక్షల ఖాతాదారులను చేరామని తెలిపారు. తమ బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 1.36 శాతంగా, నికర నిరర్థక ఆస్తులు 0.3 శాతంగా ఉన్నాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఇదే అత్యల్పమని అన్నారు. 2020-21 నాటికి రూ.10వేల కోట్ల అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎమ్)ను చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇదే సమయంలో 40 లక్షల ఖాతాదారులను చేరాలని నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.3500 కోట్ల స్థూల రుణాలు, రూ.2,000 కోట్ల డిపాజిట్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. త్వరలో ఎపిలోని గుంటూరు, విజయవాడ, రాజమండ్రి తదితర పట్టణాల్లో కొత్త శాఖలు తెరువనున్నామని ఫిన్‌కేర్ బిజినెస్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ దశరత్ రెడ్డి తెలిపారు. ఈ శాఖల ఏర్పాటు కోసం ఉద్యోగులను తీసుకునే కసరత్తుతో పాటు కార్యాలయాలను గుర్తించామన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఎయిరిండియా రాయితీ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక రాయితీని అందిస్తున్నట్లు ప్రకటించింది. తమ వెబ్‌సైట్ నుంచి 60 ఏళ్లు పైబడిన భారతదేశ పౌరులు బుక్ చేసుకునే ప్రతి ఎకానమీ క్లాస్ టికెట్‌పైనా 50 శాతం వరకూ డిస్కౌంట్‌ను పొందవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సీనియర్ సిటిజన్లు వయస్సును ధ్రువీకరించేందుకు ప్రభుత్వం గుర్తించిన సరైన గుర్తింపు కార్డులను పొందుపర్చాల్సి ఉంటుందని తెలిపింది. ప్రయాణ తేదీకి వారం రోజుల ముందు టిక్కెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించింది. అదే విధంగా సీనియర్ సిటిజన్‌తో ప్రయాణించే చిన్నారులకు రూ. 1000ల ప్రత్యేక డిస్కౌంట్‌ను కూడా ఆఫర్ చేసింది.

సన్ ఫార్మా కకావికలం..!

- మీడియా కథనాలతో కుదేలైన సంస్థ స్టాక్..
- కార్పొరేట్ అవకతవకలపై సెబీకి ఫిర్యాదు!
- 12.12 శాతం మేర పతనమైన షేర్లు
- ఒకే రోజు రూ.8,736 కోట్ల విలువ ఆవిరి..



న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సన్‌ఫార్మా షేర్లు శుక్రవారం భారీగా కుదేలయ్యాయి. సన్ ఫార్మాలో ప్రమోటర్లు సంస్థను అడ్డుగా పెట్టుకొని వివిధ అక్రమ లావాదేవీలను కొనసాగిస్తున్నారంటూ వెలువడిన కథనాల నేపథ్యంలో మదుపరులు భారీగా ఈ సంస్థ షేర్లను విక్రయించారు. ఇంట్రాడేలో సన్‌ఫార్మా షేర్లు ఏకంగా 13 శాతం వరకు నష్టపోయాయి. దీంతో ఈ సంస్థ స్టాక్ ఆరేండ్ల కనిష్టానికి పడిపోయింది. గత కొన్ని రోజులుగా సన్‌ఫార్మాలో నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు, అవకతవకలు జరుగుతున్నాయని తమకు ఫిర్యాదు అందినట్లు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గత నెలలోనే ప్రకటిస్తూ వాటిని కొంత వరకు ధ్రువీకరించింది. ఆ ఫిర్యాదును పూర్తిస్థాయి పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం మరో ఫిర్యాదు కూడా దాఖలైనట్లు మీడియాలో వార్తలు రావడంతో కంపెనీ షేర్లు కుప్పకూలాయి. తాజా కథనాలు సన్ ఫార్మాపై కోలుకోలేని దెబ్బ కొట్టాయి. ఆరంభ ట్రేడింగ్‌లో కంపెనీ షేరు విలువ 12 శాతానికి పైగా కుంగి రూ.375.40కు పడిపోయింది. ఇది దాదాపు 52 వారాల కనిష్ఠం కావడం విశేషం. క్షణాల వ్యవధిలోనే కంపెనీ తన మార్కెట్ విలువలో రూ.12,400 కోట్లకు పైగా కోల్పోయింది. అనంతరం కొంత కోలుకొని మార్కెట్లు ముగిసే సమయానికి 8.52 శాతం నష్టంతో రూ.390.75 వద్ద ముగిసింది. దీంతో శుక్రవారం ఒక్కరోజే కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.8,736 కోట్ల మేర పతనమైంది. ఫలితంగా సన్ ఫార్మా మార్కెట్ క్యాపిటలైజేషన్ లక్ష కోట్ల మార్కుకు దిగువకు జారి రూ.93,751.44కు చేరింది.

ప్రధాన కారణం ఇదే..

మనీలైఫ్ మేగజైన్‌లో వెలువడ్డ కథనం ప్రకారం సన్ ఫార్మా ప్రమోటర్లు దిలీప్ సంఘ్వీ, సునీల్ వాడియాలు ఉమ్మడిగా ఆదిత్య మెడీసేల్స్ అనే సోల్ డిస్ట్రిబ్యూషన్ సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా అమ్మకాలు కొనసాగిస్తున్నారని తేలింది. 2014 నుంచి 2017 మధ్యకాలంలో ఆదిత్య మెడిసేల్స్ కంపెనీ.. సన్ ఫార్మా సహ వ్యవస్థాపకుడు సుధీర్ విలియాకు నియంత్రణలోని సురక్ష రియల్టీ మధ్య రూ.5,800 కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయని, వీటికి తోడు ఆదిత్య మెడీ ద్వారా సురక్షా రియాల్టీ అనే సంస్థతో కలిసి సుమారు రూ.5,000 నుంచి 6000 కోట్ల లావాదేవీలు జరిపినట్టు మనీ లైఫ్ ప్రచురించింది. సంస్థ ప్రమోటర్లుగా సన్ ఫార్మాను అడ్డం పెట్టుకుని ప్రమోటర్లు వ్యక్తిగత వ్యాపారాలను కొనసాగిస్తు న్నారంటూ ఒక వ్యక్తి సెబీకి ఫిర్యాదు చేసినట్టు మేగజైన్ తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆధారలతో కథనం కూడా వెలువరించింది. దీంతో మార్కెట్లలో ఒక్కసారిగా సన్‌ఫార్మా కలకలం మొదలైంది. ర్యాన్‌బాక్సీ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సెబీకి ఫిర్యాదు చేసిన వ్యక్తే సన్ ఫార్మాపై తాజాగా ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది. ఫిర్యాదుదారు దిలీప్ సంఘ్వీ పైన, అతని బావమరిది సుధీర్ వాలియాపైన సెబీకి 172 పేజీల సుదీర్ఘ లేఖ రాశారని సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి ఫిర్యాదుదారు అనేక సాక్ష్యాధారాలను మార్కెట్ నియంత్రణ సంస్థకు సమర్పించిన నేపథ్యంలో సెబీ దర్యాప్తునకు ఆదేశించినట్టు సమాచారం. అయితే సన్‌ఫార్మా మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. కొందరు వ్యక్తులు, సంస్థలు కావాలనే మదుపరుల ప్రయోజనాలను దెబ్బ తీసేలా ఇలాంటి అసత్య ఆరోపణలను సృష్టించి ప్రచారం చేస్తున్నారని.. నష్ట నివారణకు గాను సెబీ తగిన చర్యలు తీసుకొని, బాధ్యులపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని సన్ ఫార్మా కోరింది.

2019లో రాబడులు పెరగొచ్చు

కార్వీ స్టాక్ బ్రోకింగ్ సిఇఒ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రస్తుత ఏడాది 2019లో ఈక్విటీ మార్కెట్లలో సామర్థ్యం కలిగిన స్టాక్స్‌లో రాబడులు పెరుగొచ్చని కార్వీ స్టాక్ బ్రోకింగ్ సిఇఒ రాజీవ్ సింగ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అంచనాల ప్రకారం నిఫ్టీ 11,750 వద్ద ప్రతిఘటన ఎదుర్కోవడంతో పాటుగా 12వేల స్థాయి వద్ద కూడా ఒడిదుడుకులకు గురైయ్యే అవకాశం ఉందన్నారు. 2018లో నిఫ్టీ కేవలం 3 శాతం రాబడులను మాత్రమే అందించిందన్నారు. ప్రస్తుత ఏడాది ముగింపు నాటికి నిఫ్టీ 14వేల మార్క్‌ను చేరుకోవచ్చన్నారు. తాము బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్, సైక్లికల్ రంగాలకు ప్రాధాన్యతనిస్తామన్నారు. 2019 ప్రథమార్థంలో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో దేశ మార్కెట్లకు ప్రస్తుత ఏడాది కీలకమైందన్నారు. అంతర్జాతీయంగా వాతావరణం సానుకూలంగా ఉండటంతో మార్కెట్లపై విశ్వాసం పెరుగొచ్చన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో భారీగా తగ్గిందని, దీంతో రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్నారు.

కొనసాగిన స్తబ్దత..

ముంబయి : స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల స్తబ్దత కొనసాగింది. దీంతో వరుసగా మూడో రోజూ మార్కెట్లు స్వల్ప లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 13 పాయింట్లు పెరిగి 36,387 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 2 పాయింట్లు లాభపడి 10,907 వద్ద నమోదయ్యింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇకో



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

కేల్కర్ కమిటీ దేనికి సంబంధించింది?

1. ఈ కింది చర్యలలో ఆర్థిక సంస్కరణల పరిధిలోకి రానిది ఏది ?
ఎ. ప్రత్యేక ఆర్థిక మండలాలు
బి. అధిక, కఠోర శ్రామిక చట్టాలు
సి. చిన్నతరహా రంగానికి తక్కువ ప్రత్యేకతలు
డి. పరిశ్రమలలో ప్రవేశ ప్రతిబంధనాలను తొలగించడం

2. భారతదేశంలో ఈ కింది వాటిలో ఏ చర్య మంచి కోశ సంబంధమైన పాలనకు ఆటంకాన్ని కలిగిస్తుంది ?
ఎ. రుణ జిడిపి నిష్పత్తిని పెంచడం.
బి. సంయుక్త పన్ను జిడిపి నిష్పత్తి వృద్ధి చేయడం.
సి. ఆర్థిక లోటును సున్నాకు తగ్గించడం.
డి. వడ్డీ చెల్లింపుల సాపేక్షతను రాబడి వసూళ్లకు తగ్గట్టుగా తగ్గించడం.

3. లోటు ద్రవ్యం అనగా ?
ఎ. సమిష్టి వనరుల సమీకరణను ప్రభావితం చేయడం.
బి. ద్రవ్య సరఫరా లోటుకు మూలం.
సి. స్వభావంలో ప్రతి ద్రవ్యోల్బణం.
డి. స్వభావంలో ద్రవ్యోల్బణం పెంచుతుంది.

4. ఇండియన్ స్టాక్ మార్కెట్‌కు సంబంధించి అధిక సంఖ్యాక లావాదేవీలను జరుపుతుంది ?
ఎ. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా
బి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్
సి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్
డి. ఇంటర్నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్

5. కేంద్ర ప్రభుత్వం 1990-91లో దేశ ఆర్థిక విధానంలో చాలా వరకూ సంస్కరణలను చేయడానికి ప్రేరేపించిన సంక్షోభం ?
ఎ. చెల్లింపుల సమతూక సంక్షోభం
బి. ప్రభుత్వ రంగంలో సంక్షోభం
సి. ఆర్థిక సంక్షోభం
డి. విదేశీ మారకం

6. పదకొండో పంచవర్ష ప్రణాళిక ప్రధానమైన లక్ష్యం ?
ఎ. ప్రజలందరికీ ఆహారభద్రతను గట్టిపరచడం.
బి. 9.5 శాతం అభివృద్ధి రేటును సాధించడం.
సి. సరళీకృత విధానాల వల్ల సాధించిన కార్యసిద్ధిని స్థిరీకరించడం.
డి. పెరుగుతున్న ఆదాయ అసమానతలను అతి తక్కువ స్థాయికి తగ్గించడం.

7. ఒక కర్మాగారం ఎల్లప్పుడూ దేనిని కలిగి ఉంటుంది ?
ఎ. అమ్మకందారులను   బి. ఫైళ్లు
సి. విద్యుచ్ఛక్తి   డి. కార్మికులు

8. పొదుపు ఒక ?
ఎ. పెరుగుదలకు ప్రధానమైన నిర్ధారకం
బి. పెరుగుదల ఒకే ఒక నిర్ధారకం
సి. పెరుగుదలకు ఒకానొక నిర్ధారకం
డి. పెరుగుదలతో సంబంధం

9. భారతదేశంలో జాతీయ ఆదాయాన్ని మదింపు చేయడానికి అనుసరించిన పద్ధతి ?
ఎ. వ్యాపార శేషము
బి. నికర గుణిజ పద్ధతి
సి. నికర ఎగుమతులు
డి. విదేశీ నిల్వలు

10. అటవీ సంరక్షణ కింద 33 శాతం లక్ష్యాన్ని చట్టబద్ధం చేసినది ?
ఎ. అటవీ విధానం, 1950
బి. అటవీ విధానం, 1956
సి. అటవీ విధానం, 1962
డి. అటవీ విధానం, 1952

11. కొత్త వ్యవసాయ వ్యూహ రచన (హరిత విప్లవం) ను మొట్టమొదట అంగీకరించింది ?
ఎ. మొదటి పంచవర్ష ప్రణాళిక
బి. రెండో పంచవర్ష ప్రణాళిక
సి. మూడో పంచవర్ష ప్రణాళిక
డి. నాల్గో పంచవర్ష ప్రణాళిక

12. గున్నార్ మిర్థాల్ ఇండియాను అభివర్ణించింది ?
ఎ. ఆదర్శరాజ్యం   బి. సులభరాజ్యం
సి. బహుత్వరాజ్యం   డి. ఉదారరాజ్యం

13. ఆరో పంచవర్ష ప్రణాళిక ముసాయిదాలో భారత ప్రభుత్వం చేర్చిన విశిష్ట భావన ?
ఎ. దీర్ఘకాలపు ప్రణాళిక
బి. కనీస అవసరాల పథకం
సి. నిరంతర ప్రణాళిక (రోలింగ్ ప్లాన్)
డి. గ్రామీణాభివృద్ధి పథకం

14. 'ప్లానింగ్ ఫర్ ది పూర్' అనే గ్రంథాన్ని రచించినవారు ?
ఎ. బి.ఎస్.మిన్‌హాస్   బి. వై.కె.అలఘ్
సి. జగదీష్ భగవతి   డి. ఐ.జి.పటేల్

15. భారతదేశంలో పురుషుల జనాభా సంఖ్య కంటే స్త్రీ జనాభా సంఖ్య అధికంగా ఉన్న ప్రాంతం ?
ఎ. పశ్చిమ బెంగాల్   బి. మిజోరాం
సి. నాగాలాండ్   డి. పుదుచ్చేరి

16. ప్రణాళిక వనరుల అంచనాతో కూడిన జాతీయ ప్రణాళిక రూపకల్పనకు తగిన నిర్దేశిక సూత్రాలను తయారుచేసే బాధ్యత కలది ?
ఎ. ప్రణాళికా సంఘం
బి. జాతీయ అభివృద్ధి మండలి
సి. ఆర్థిక మంత్రిత్వ శాఖ
డి. కేంద్ర మంత్రివర్గం

17. భారతదేశంలో 1991 నూతన పారిశ్రామిక విధానంలోని ప్రతిపాదనలలో ఒక ముఖ్యమైన ప్రతిపాదన ప్రకారం 51.0 శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి సౌకర్యం కల్పించింది?
ఎ. అన్ని పరిశ్రమలకు
బి. ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలకు
సి. ఎగుమతి పరిశ్రమలకు
డి. హెచ్చు ప్రాధాన్యత గల పరిశ్రమలకు



18. భారతదేశంలో 14 బ్యాంకులను జాతీయం చేసిన రోజు ?
ఎ. 15 మార్చి 1967
బి. 10 ఏప్రిల్ 1968
సి. 19 జులై 1969
డి. 20 ఏప్రిల్ 1970

19. ఈ కింది వానిలో ఏ లావాదేవీ కరెంట్ ఖాతా(చాలూ)లో రుణం అవుతుంది ?
ఎ. సరుకులను ఎగుమతి చేయడం.
బి. నౌకరీలను ఎగుమతి చేయడం.
సి. విదేశీయులకు ఒక బహుమతిని ఇవ్వడం.
డి. విదేశీయుల నుంచి ఒక బహుమతిని పొందడం.

20. భూమి అభివృద్ధి బ్యాంకులు ఈ కింది వానిలో దేని భాగస్వామ్యంలో ఉంటాయి ?
ఎ. వాణిజ్య బ్యాంకు
బి. భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు
సి. భారత ఆహారసంస్థ
డి. సహకార పరపతి వ్యవస్థ

21. త్వరితగతిన పారిశ్రామికీకరణకు దేశం ప్రారంభించిన కొత్త విధానం ?
ఎ. ప్రయివేటు పారిశ్రామికవేత్తలకు వివిధ రకాల రాయితీలను కల్పించడం.
బి. ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఏర్పాటు చేయడం.
సి. అనేక విదేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం.
డి. పారిశ్రామిక నిర్వహణలో సరికొత్త విధానాలను ప్రవేశ పెట్టడం.

22. వేగవంతమైన దేశాభివృద్ధికి ప్రాథమిక విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సిందిగా నొక్కి వక్కాణించిన భారతీయ విద్యావంతుడు ?
ఎ. రంగరాజన్
బి. అమర్త్యసేన్
సి. మన్‌మోహన్ సింగ్
డి. మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా

23. కేల్కర్ కమిటీ దేనికి సంబంధించింది ?
ఎ. ప్రత్యక్ష పన్నులు
బి. పరోక్ష పన్నులు
సి. ప్రత్యక్ష, పరోక్ష పన్నులు రెండూ
డి. ఎగుమతి, దిగుమతుల సుంకాలు

24. జాతీయ పొదుపు సర్టిఫికెట్లు, కిసాన్ వికాస్ పత్ర పథకాలను కొనసాగించవద్దని ఈ మధ్య సిఫార్సు చేసిన కమిటీ ఏది ?
ఎ. రాజా చెల్లయ్య కమిటీ
బి. కేల్కర్ కమిటీ
సి. రాకేశ్ మోహన్ కమిటీ
డి. నరసింహన్ కమిటీ

25. మిగులు విలువ సిద్ధాంతాన్ని కనుగొన్నది?
ఎ. ఆడమ్ స్మిత్   బి. రికార్డో
సి. హెగెల్   డి. కార్ల్‌మార్క్స్

26. 'కిసాన్ క్రెడిట్ కార్డ్' పథకాన్ని సూత్రీకరించింది ?
ఎ. ఆర్.డి.ఐ   బి. జి.ఐ.సి
సి. ఐ.సి.ఐ.సి.ఐ   డి. ఎన్.ఎ.బి.ఎ.ఆర్.డి (నాబార్డ్)

27. భారతదేశంలో గణనీయమైన ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు దోహదపడిన కొత్త పారిశ్రామిక విధానం అమల్లోకి వచ్చిన సంవత్సరం?
ఎ. 1977   బి. 1981
సి. 1991   డి. 1989

28. మొట్టమొదటి భారతదేశపు జాతీయ ఆదాయాన్ని, పద్ధతి ప్రకారం అధికారికంగా మదింపు చేసిన 1949 జాతీయ ఆదాయ కమిటీ అధ్యక్షులు ?
ఎ. పి.సి.మహలనోబిస్
బి. వి.కె.ఆర్.వి.రావు
సి. డి.ఆర్.గాడ్గిల్
డి. కె.టి.షా

సమాధానాలు : 1.బి, 2.ఎ, 3.డి, 4.సి, 5.ఎ, 6.బి, 7.డి, 8.సి, 9.బి, 10.డి, 11.సి, 12.డి, 13.సి, 14.ఎ, 15.డి, 16.బి, 17.డి, 18.సి, 19.సి, 20.డి, 21.బి, 22.బి, 23.సి, 24.సి, 25.డి, 26.డి, 27.సి, 28.ఎ, ★

ఉద్యోగాలు

ఏపీపీఎస్సీ వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:

1. అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్లు : 2 (లెజిస్లేచర్ సెక్రటేరియట్ సర్వీస్‌లో).
అర్హతలు: తెలుగు ఒక పార్ట్‌గా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. జర్నలిజం లేదా తెలుగు పుస్తకాల రచనలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం.
వయసు: జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్/ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఆధారంగా.
మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: ఏప్రిల్ 25, 2019.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు: రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.80.
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 23, 2019.
ఫీజు చెల్లించుటకు చివరి తేదీ: జనవరి 22, 2019.

2. అగ్రికల్చర్ ఆఫీసర్లు - 27 (అగ్రికల్చర్ సర్వీస్‌లో)
జోన్ల ఖాళీలు: జోన్-1: 5, జోన్-2: 9, జోన్-3: 3, జోన్-4: 10.
అర్హత: అగ్రికల్చర్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఉత్తీర్ణత.
వయసు: జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్/ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: ఏప్రిల్ 17, 2019.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు: రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29, 2019.
ఫీజు చెల్లించుటకు చివరి తేదీ: జనవరి 28, 2019.

3. జూనియర్ లెక్చరర్లు : 237 (ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో).
సబ్జెక్టుల వారీ ఖాళీలు: ఇంగ్లిష్-19, తెలుగు-18, హిందీ-17, ఉర్దూ-4, సంస్కృతం-3, ఒరియా-2, మ్యాథమెటిక్స్-16, ఫిజిక్స్-19, కెమిస్ట్రీ-21, బోటనీ-19, జువాలజీ-20, కామర్స్-18, ఎకనామిక్స్-25, సివిక్స్-18, హిస్టరీ-18.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ (ఎంఏ/ ఎంఎస్సీ/ ఎంకాం/ బీఎస్సీ ఆనర్స్/ బీఏ ఆనర్స్/ బీకాం ఆనర్స్) లేదా తత్సమాన పీజీ ఉత్తీర్ణత.
వయసు: జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్/ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా.
మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: 2019, జులైలో.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు: రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8, 2019.
ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2019.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.
వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కమిటీ నాయకులు కొండా ప్రసాద్ మాట్లాడుతూ 35 రోజులుగా ఈ ప్రాంతానికి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం దారుణమన్నారు. కనీసం ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బైఠాయింపు

విజయనగరం జిల్లా మాన్సాస్ కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు



భూముల వేలం ఆపాల్సిందే

'మాన్సాస్' కార్యాలయం వద్ద రైతుల బైఠాయింపు - హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండల రైతులు నగరంలోని మహారాజా అలక్‌నారాయణ సైన్స్ అండ్ ఆర్ట్స్ సొసైటీ (మాన్సాస్)కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. జిల్లాలోని విజయనగరం, దత్తిరాజేరు, గంట్యాడ, బొండపల్లి, చీపురుపల్లి మండలాల్లో మాన్సాస్‌కు చెందిన వందలాది ఎకరాలను రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు. వాటిని రియల్ ఎస్టేట్‌దారులకు అమ్ముకోవడానికి మాన్సాస్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో దత్తిరాజేరు మండలంలోని భూములను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలానికి శుక్రవారం అర్ధాంతరంగా నోటిఫికేషన్ ఇచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు కోట వద్ద రైతులు బైఠాయించారు. ఈ భూములు వందేళ్లకు పైగా తమ కుటుంబాల సాగులో ఉన్నాయన్నారు. భూముల వేలం ఆపాలని, ప్రభుత్వ ధరకు ఆ భూములను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. దీంతో, మాన్సాస్ డైరెక్టర్ పూసపాటి అతిథి, దేవాదాయ శాఖాధికారులు దిగొచ్చారు. ఈ భూములను వేలం వేయబోమని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో దత్తిరాజేరు మండలం దత్తివెంకటాపురం, భూపాలరాజుపురం తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మాన్సాస్ సంస్థ విజయనగరం ఎంపి పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబానికి చెందినది. భూ సంస్కరణల చట్టం నుంచి తప్పించుకోవడానికి అప్పట్లో తమ మిగులు భూములను మాన్సాస్ సంస్థకు బదలాయించారనే ఆరోపణలున్నాయి.

చలమలే గతి!

- గిరిజన గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- వేసవికి ముందే నీటి ఎద్దడి
- ఆందోళనలో ఆదివాసీలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలోని మన్యప్రాంతంలో ప్రధానంగా కురుపాం నియోజకవర్గ పరిధిలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాభావంతో బోర్లు, నేల బావులు ఎండిపోవడంతో గిరిజనులు కొండల్లోని ఊట గెడ్డలు, చలమల నీటిపై ఆధారపడుతున్నారు. రెండు, మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. చలమల, ఊటల నీరు కూడా తగ్గిపోతుండడంతో గిరిజనులకు తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. జనవరిలోనే పరిస్థితి ఈ విధంగా ఉండడంతో వేసవిలో ఏ విధంగా ఉంటుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

ఒడిశా సరిహద్దులోగల కొమరాడ మండలం చోళ్లపథం పంచాయతీకి చెందిన రెబ్బలో 30 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో ఒక్క మంచినీటి బోరూ లేదు. ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలోగల గెడ్డకు కాలినడకన వెళ్లి ఊటనీటిని తెచ్చుకొని తాగుతున్నారు. ఇటీవల వర్షాల్లేకపోవడంతో గెడ్డలో ఎక్కడ గోతులు తవ్వినా ఊట నీరు రావడం లేదు. దీంతో, గ్రామస్తులకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. వేసవికి ముందే ఈ పరిస్థితి రావడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కుంతేషు, గుర్లమ్మ, ఊసనందితోపాటు మరో నాలుగు పంచాయ తీల్లో గిరిజనులు తాగునీటికి కటకట లాడుతున్నారు. కురుపాం మండలం కోటకొండలో సుమారు 300 జనాభా ఉంది. గ్రామంలోని తాగునీటి బోరు అడుగంటిపోవడంతో ఊట చలమల నీటిపై గ్రామస్తులు ఆధారపడుతున్నారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో కాలినడకన వెళ్లి నీటిని మోసుకురావాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతు న్నారు. వర్షాల్లేక ఊట చలమ కూడా ఎండిపోతే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందు తున్నారు. ఈ పంచాయతీలోని నాంద్రగడ్డ, ఈతమాను గూడతోపాటు మండలంలో మరో 15 పంచా యతీల్లో తాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయి.

విజయనగరం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 1,503 గిరిజన గ్రామాలున్నాయి. వీటిలో 4,160 బోర్లు, 745 రక్షిత నీటి పథకాలు, ఐదు సమగ్ర రక్షిత నీటి పథకాలు, 123 సోలార్ పంపుసెట్లు ఉన్నట్లు అధికారిక రికార్డులు తెలియజేస్తున్నాయి. 974 గ్రామాల్లోనే పూర్తి స్థాయిలో నీటి వనరులున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వేసవి వచ్చే సరికి ఏటా వాటి పనితీరు కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ ఏడాది వర్షాలు కురవక ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బోరులు, బావులు ఎండిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో సోలార్ పంపుసెంట్లు, రక్షిత మంచినీటి పథకాలు పని చేయడం లేదు. కురుపాం మండలంలో తోలుం గుడలో 50 కుటుంబాలున్నాయి. గ్రామంలోని రెండు బోర్లూ పూర్తిగా అడుగంటడంతో గ్రామ సమీపాన ఉన్న ఊట నీటి చుట్టూ కుండీ కట్టుకుని అందులో ఊరిన నీటిని గ్రామస్తులు తాగుతున్నారు. వర్షాల్లేక అదీ ఎండిపోవడంతో తాగునీటి



కష్టాలు మొదలయ్యాయి. జి.శివడ, ఒబ్బంగి, తిత్తిరి, జరడ, పొడి పంచాయతీలోని కొండలపై ఉన్న గ్రామాల్లో నీటి సమస్య తీవ్రమైంది. పాచిపెంట మండలంలోని పర్యాపురం, రాయిగుడ్డువలస, బొర్ర మామిడి, గుట్టూరు, క్యారంగి పంచాయతీల్లోని ప్రజలు కిలోమీటర్ల మేర కాలినకడన వెళ్లి గెడ్డ, ఊట నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. గుమ్మలక్ష్మీపురంలో పది పంచాయతీల్లోని, జియ్యమ్మవలస ఎనిమిది, కొమరాడ ఎనిమిది, సాలూరు ఆరు, మక్కువలో ఎనిమిది పంచాయతీల్లోని గిరిశిఖర గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

ట్యాంకు నిర్మించాలి



మా గ్రామంలో తాగడానికి నీరు లేదు. వందమంది ఉన్న మా గ్రామంలో బావి, ట్యాంకు నిర్మించాలని అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. తాగునీరు లేక చలమలపై ఆధారపడుతున్నాం. నీటి కాలుష్యం వల్ల వ్యాధుల బారిన పడుతున్నాం. పాలకులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-ఎ.పున్నయ్య, నాంద్రగడ్డ, కురుపాం


ఒక్క బోరూ లేదు



దీర్ఘకాలంగా మా గ్రామానికి తాగునీటి సమస్య తప్పడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు మొరపెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గ్రామంలో ఒక్క మంచినీటి బోరూ లేదు. గతంలో నిర్మించిన మినీ రక్షిత మంచినీటి ట్యాంక్ మూడునాళ్లకే మరమ్మతులకు గురైంది. గెడ్డ నీటిని తాగాల్సి రావడంతో ఏటా వ్యాధుల బారిన పడుతున్నాం

-కె.అప్పారావు, రెబ్బ, కొమరాడ

ఊట నీరే దిక్కు



కొండల్లోని ఊట నీరే దిక్కు. వేసవి వచ్చిందంటే మాకు కష్టాలు మొదలవుతాయి. మా తాగునీటి కష్టాలు తీరాలంటే రక్షిత మంచినీటి పథకం నిర్మించాలి. బోర్లు వేసి చేతులు దులుపుకుంటున్నారు. అవి కొంతకాలం పని చేసి మూలకు చేరుతున్నాయి. వేసవికి ముందు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- శంకర్, గిరిజనుడు, కుంతేసు, కొమరాడ

సుజల పథకం ద్వారా నీటి సరఫరా



ఏజెన్సీలో అక్కడక్కడా తాగునీటి ఎద్దడి ఉన్నది వాస్తవమే. ఇప్పటికే సమస్య తీవ్రంగా ఉన్న 102 గ్రామాలను గుర్తించాం. సృజల పథకం ద్వారా నీటి సమస్య పరిష్కరిస్తాం. జనవరిలో క్రాస్‌ప్రోగ్రాం ద్వారా బోర్లు, పంపుసెట్లను బాగుచేసి గిరిజన ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ జి.లక్ష్మీశా, ప్రాజెక్టు ఆఫీసర్, పార్వతీపురం ఐటిడిఎ



జెసిఎల్ ఎదుట విచారణకు హాజరైన యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్,ప్రభాకర్, కార్మిక సంఘాల నేతలు

పెప్సికో కంపెనీపై చర్యలు తీసుకోండి

జెసిఎల్ శ్రీనివాసులును కోరిన కార్మిక నేతలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

శ్రీసిటీలో యూనియన్ పెట్టారన్న అక్కసుతో 50 మంది కార్మికులను తొలగించిన పెప్సికో కంపెనీపై చర్యలు తీసుకోవాలని జెసిఎల్ (జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్) శ్రీనివాసులును కార్మిక నేతలు కోరారు. విధుల్లో ఉన్న కార్మికుల చేతివేళ్లు తెగిపోతే 'నీళ్లతో కడుక్కుని పనిచేయండి' అంటూ యాజమాన్య హుకుంపై తిరగబడి ప్రశ్నించడం, ఆ తర్వాత వర్కర్లను తొలగించడంతో కార్మికులు పెప్సికో కంపెనీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసుకుని న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జెసిఎల్ ఎదుట విచారణకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, ప్రభాకర్‌లు శుక్రవారం హాజరయ్యారు. వీరికి మద్దతుగా టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు నరసింహమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, కార్మిక నేతలు గౌరి, గిరి, చంద్రశేఖర్‌నాయుడు, యుగంధర్, గణేష్, రాజేశ్వరిలు హాజరై జెసిఎల్ శ్రీనివాసులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ .. శ్రీసిటీలో కార్మిక చట్టాలు అమలుకావడం లేదని ఫిర్యాదు చేశారు. టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకున్నారన్న నెపంతో దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని పేర్కొన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీనిపై జెసిఎల్ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ కార్మికులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.



శ్రీకాకుళం జిల్లా శెలగపేటలో పోర్టు బాధిత ప్రజలతో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

చదువే బడుగులకు ఆయుధం

కారెం శివాజీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

చదువే బడుగులకు ఆయుధమని, సమస్యల పట్ల మనోధైర్యంతో ముందుకెళ్లాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ పేర్కొన్నారు. కర్మ సిద్ధాంతం పోవాలంటే చదువును ఆయుధంగా ఉపయోగించుకోవాలని డా॥ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన పిలుపును అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పర్యటలో భాగంగా కారెం శివాజీ తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని టౌన్‌క్లబ్ సర్కిల్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే సుగుణమ్మతో కలిసి నివాళులర్పించారు. అనంతరం చంద్రగిరి నియోజక వర్గం బ్రాహ్మణ పట్టు పంచాయతీ కుండా హరిజన వాడలో పర్యటించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కారెం శివాజీ మాట్లాడుతూ దళితులు, బడుగు వర్గాలు వారు ధైర్యంగా వుండాలని పాత కాలం నాటి కర్మ సిద్ధాంతం ప్రకారం మన బతుకులు ఇంతే అనుకొనే రోజులు పోయాయన్నారు. అనంతరం 0ఆయన సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

విశాఖ కేంద్ర గ్రంథాలయాన్ని నిర్మించాలి

ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన ఇఎఎస్ శర్మ



ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని దండు బజారులో ఉన్న ఎకరం స్థలంలో జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని నిర్మించాలని, ఆ స్థలాన్ని ఆక్రమించిన ప్రత్యూష కంపెనీపై చర్యలు తీసుకోవాలని విశ్రాంతి ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ డిమాండ్ చేశారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత గుడి ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి శుక్రవారం పౌర గ్రంథాలయ సేవా సమితి ఆధ్వర్యాన ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దండు బజారులోని ఎకరం స్థలంలో ఉండే గ్రంథాలయం వల్ల ఎందరో విద్యావంతులు తయారయ్యారని తెలిపారు. ఈ గ్రంథాలయం ఉత్తరాంధ్ర గ్రామీణ ప్రాంతాల నుంచి చదువు కోసం, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి వచ్చే చిన్న, సన్నకారు రైతు పిల్లలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేదన్నారు. అటువంటి గ్రంథాలయ స్థలాన్ని 2010లో ప్రయివేటు రియల్ ఎస్టేట్ ప్రయోజనం కోసం ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ప్రత్యూష కంపెనీకి లీజుకు ఇవ్వడంతో గ్రంథాలయాన్ని తొలగించిందన్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహించడంతో 2014 మే లో ప్రభుత్వం ప్రయివేటు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసిందని చెప్పారు. అయినప్పటికీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఒత్తిడి మేరకు ఇంకా ఆ స్థలం ప్రత్యూష కంపెనీ ఆధీనంలోనే ఉందని ఆరోపించారు. ఆ స్థలాన్ని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అక్కడే జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని నిర్మించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా 1986లో ఎన్టీఆర్ సిఎంగా ఉన్న సమయంలో గ్రంథాలయాలపై ఉద్యమం చేశారని గుర్తు చేశారు. దాని ఫలితంగా అన్ని మండలాల్లో ఒకేరోజు 625 గ్రంథాలయాలను ప్రారంభించారన్నారు. అదే పార్టీ ప్రస్తుతం అధికారంలోకి కొనసాగుతున్న గ్రంథాలయాలపై చిన్నచూపు చూస్తూ ఉన్నవి తొలగించడం బాధాకరమన్నారు. గ్రంథాలయ నిర్మాణం, స్థలం ఆక్రమణపై పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షులు బిఎల్ నారాయణ పోరాటం చేస్తూనే 'కంచే చేను మేస్తే' అనే పుస్తకం రాసి మరింత మందికి తెలిసేలా చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం బీచ్‌రోడ్డులో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరగ్రంథాలయ సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ, కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఐద్వా నాయకులు పి.మణి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వివి. శ్రీనివాస్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎన్.రమణాచలం, లోక్‌సత్తా నాయకులు ఎమ్ఎస్.మూర్తి, శ్రీహరిగణేష్, శ్రీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

2013 భూసేకరణ చట్టం వర్తింపజేయాలి

ఆ తర్వాతే భావనపాడు పోర్టు ప్రక్రియను ప్రారంభించాలి

వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

2013 భూసేకరణ చట్టం ప్రకారం భావనపాడు పోర్టుకు భూసేకరణ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాకే పోర్టు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు పోర్టు ప్రభావిత శెలగపేట, భావనపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. బాధిత ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులతో గ్రామాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సబబు కాదన్నారు. పోర్టు నిర్మాణానికి ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. అదే సమయంలో 2013 చట్టాన్ని ఉల్లంఘించి రైతుల, కూలీల, మత్స్యకారుల సమస్యలను పట్టించుకోకుండా, గ్రామసభల ఆమోదం లేకుండా, సామాజిక ప్రభావం అంచనా వేయకుండా బలవంతంగా భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. పోర్టు బాధిత ప్రజలకు అభ్యంతరాలుంటే, అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు బాధిత ప్రజలకు చట్టప్రకారం పరిహారం చెల్లించకుండా పోర్టు నిర్మాణానికి పూనుకోవడం సరికాదన్నారు. ప్రజలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. ఆయన వెంట ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సింహాచలం, ఎస్.ప్రసాద్, నాయకులు కె.ఎల్లయ్య, ఎన్.షణ్ముఖరావు ఉన్నారు.

రెండోరోజుకు మీ సేవా సిబ్బంది సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల నిర్వాహకుల సమ్మె శుక్రవారానికి రెండోరోజుకు చేరింది. విజయనగరం జిల్లావ్యాప్తంగా 518 మీ సేవ కేంద్రాలూ మూతపడ్డాయి. సమ్మెలో భాగంగా మీ సేవ కేంద్రాల నిర్వహకులు విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మీ సేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెకు ఎపి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి మద్ధతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలోనూ సమ్మె కొనసాగింది. జిల్లాలోని 710 మీ సేవ కేంద్రాలూ మూతపడ్డాయి. విశాఖ గ్రామీణ జిల్లాలోని ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు, నక్కపల్లి, నర్సీపట్నం మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కృష్ణా జిల్లావ్యాప్తంగా బందరు, గుడివాడ, నూజివీడు, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరుతోపాటు మిగతా ప్రాంతాల్లో కూడా ఉన్న అన్ని మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. కర్నూలు జిల్లావ్యాప్తంగా ఉన్న 847 మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. మీసేవ నిర్వాహకుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉస్సేన్‌బాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మీసేవ కేంద్ర నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మీసేవ కేంద్ర నిర్వాహకులకు ప్రతినెల రూ.15 వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

12, 13లో తరుణీ తరంగాలు మహిళా ఫెస్ట్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవకాశాలు, ప్రోత్సాహాలు లేకపోవడం వల్లే మహిళలు, విద్యార్థినులు, సాహిత్యం, కళలు, సినిమా, వైజ్ఞానిక ప్రగతిలో ముందుకు రాలేకపోతున్నారని తరుణీ తరంగాలు అధ్యక్షులు రావి శారద, ప్రధాన కార్యదర్శి జి జ్యోత్స్న, ఉపాధ్యక్షులు ఎన్ విద్యాఖన్నా అన్నారు. శుక్రవారం మొఘల్‌రాజ్‌పురం జనశిక్షణ సంస్థాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాది నిర్వహించిన స్ఫూర్తితోనే ఈ సంవత్సరం ఫిబ్రవరి 12, 13 తేదీల్లో సిద్ధార్థ అకాడమీలో మహిళా సాంస్కృతిక సంబరాలను 25 ఈవెంట్స్‌తో జరుపనున్నట్లు తెలిపారు. ఈ సంబరాల్లో సుమారు 1500 మంది విద్యార్థినులు, మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. విజయవాడ నగరంతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వివిధ కళాశాలల విద్యార్థినులు, మహిళలు, భాగస్వాములు కావాలని కోరారు. గొంతును కలాన్ని సవరించుకుందాం, సృజనాత్మకత శక్తిని వెలికితీద్దామని పిలుపునిచ్చారు.

ఎందరో రచయిత్రులు, కళాకారులు తెర వెనకే ఉండిపోయారని, వారిలో ఉన్న కళానైపుణ్యాన్ని సమాజం వెనక్కు లాగుతోందని అన్నారు. సామాజిక ప్రతిబంధకాలను మహిళలు తీవ్రంగా ప్రతిఘటించవలసి వస్తోందని తెలిపారు. ఆటలు, పాటలు, కళలు, సృజనశీలత, మానసిక కార్యదీక్ష, ఆరోగ్యానికి నూతన ఆలోచనలు రేకెత్తించడానికి, ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రాథమికస్థాయి నుంచే వారిలో సృజనాత్మకతను గమనించి ప్రోత్సహిస్తే, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, సుశీల, గొప్ప నాట్యకారిణి రేషద్ కుమారి, మహాశ్వేతాదేవిగా ఎందరో ఎదిగే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కె ఉషారాణి, సిహెచ్ వాణి, కామేశ్వరి, ఎం రత్నకుమారి, డి రూప పాల్గొన్నారు.

చర్చలకు పిలిచి సిపిఎం నాయకునిపై దాడి

ప్రజాశక్తి-గాజువాక, విశాఖ



ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగించేలా జివిఎంసి 52వ వార్డు పరిధి శీకువానిపాలెం సమీపంలో ఏర్పాటు చేస్తున్న డ్రై రీసోర్స్ సెంటర్‌ను తరలించాలని ఉద్యమిస్తున్న సిపిఎం జోన్ కార్యదర్శి ఎం. రాంబాబును చర్చలకని పిలిచి పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన జివిఎంసి అధికారుల ఎదుటే న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికంగా డ్రై రీసోర్స్ సెంటర్‌ను తరలించాలని 17 రోజులుగా ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినప్పటికీ అధికారులు వెనక్కు తగ్గకుండా నిర్మాణాలను సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మద్దతుగా తొలి నుంచీ సిపిఎం నాయకులు ఉద్యమిస్తున్నారు. పోరాటానికి సిపిఎం జోన్ కార్యదర్శి రాంబాబు నేతృత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం చర్చలకని అఖిలపక్ష నాయకులను న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌కు పిలిచారు. సెంటర్ ఏర్పాటుకు సహకరించాలని జోనల్ కమిషనర్ చక్రధర్‌రావు చెప్పారు. ప్రజలకు హాని కలిగించే ఈ సెంటర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని రాంబాబు తన వాదనను వినిపించారు. దీంతో ఆగ్రహానికి గురైన జోనల్ కమిషనర్ రాంబాబును ఏకవచనంతో సంబోధించారు. ఇంతలో న్యూపోర్టు సిఐ భాస్కరరావు జులుం ప్రదర్శించారు. రాంబాబును మెడ పట్టుకుని చర్చల ప్రాంతం నుంచి బయటకు తోసేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న స్థానికులు పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వద్ద భారీ ఆందోళనకు సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న సహకార ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - తూర్పుగోదావరి

సమస్యలు పరిష్కరించాలంటూ తూర్పుగోదావరి జిల్లాలో సహకార సంఘ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 33వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఆయా డిసిసిబి బ్రాంచి కార్యాలయాల వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. పలుచోట్ల అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సహకారా సంఘాల్లో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేయాలని నినదించారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేయనున్నట్టు నాయకులు స్పష్టం చేశారు.

పెట్రో బాదుడు..

డీజిల్‌పై 20, పెట్రోల్‌పై 8 పైసలు పెంపు

న్యూఢిల్లీ : దేశంలో పెట్రో ఉత్పత్తులపై ధరల బాదుడు కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా వరుసగా పదోరోజు డీజిల్ ధరలు పెరగగా.. ఒకరోజు విరామం తర్వాత పెట్రోల్ ధర మళ్లీ మండుతోంది. ఈ నెలలో ఇప్పటికే రూ. 2 పెరిగిన చమురు ఉత్పత్తుల ధరలు.. మున్ముందు మరెంతో భారంగా మారనున్నాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు మండుతుంటే.. పెట్రో ధరల భారంతో అవి మరింత పిరమవుతాయని వాపోతున్నారు. కాగా, శుక్రవారం లీటరు పెట్రోల్, డీజిల్ ధరలు రూ. 0.08, రూ. 0.20 పైసలు ఎగబాకాయి. సవరించిన ధరల ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ. 70.55 కాగా, డీజిల్ రూ. 64.97 లకు చేరింది. ఇవే ధరలు దేశ వాణిజ్య రాజధానిలో రూ.76.18, రూ. 68.02గా నమోదయ్యాయి. హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 74.84 కాగా, డీజిల్ రూ. 70.63కు చేరింది.



లడఖ్‌లో విరిగిపడిన మంచు చరియలు

నలుగురు మృతి, శిథిలాల కింద మరో ఆరుగురు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని లడఖ్‌లో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో నలుగురు మృతి చెందారు. మరో ఆరుగురు ఆ మంచు పెళ్లల్లో చిక్కుకున్నారు. ఈ ఘటన ఖర్దుంగ్ లా ప్రాంతంలో శుక్రవారం చోటుచేసుకున్నది. సరిహద్దు రోడ్ల సంస్థ(బీఆర్‌ఓ) తెలిపిన వివరాల ప్రకారం.. పది మంది ప్రయాణికులతో కూడిన ఓ ట్రక్కు ఆ ప్రాంతంలో ఉదయం ఏడు గంటలకు వెళుతున్నది. ఆ సమయంలో కొండల మీద నుంచి మంచు పెళ్లలు వేగంగా జారి పడుతూ వచ్చి ట్రక్కు మీద పడ్డాయి. దీంతో నలుగురు ప్రయాణికులు మృతి చెందగా.. మరో ఆరుగురు మంచు చరియల కింద చిక్కుకుపోయారు. శిథిలాల్లో చిక్కుకుపోయిన క్షతగాత్రులను రక్షించడానికి బీఆర్‌ఓ వెంటనే తన సిబ్బందిని, మెషనరీని రంగంలోకి దించింది. అలాగే స్థానిక పోలీసులు, ఆర్మీ, రాష్ట్ర విపత్తు సిబ్బంది(ఎస్‌డీఆర్‌ఎఫ్) కూడా ఘటనస్థలికి చేరుకున్నాయని బీఆర్‌ఓ అధికారి తెలిపారు. ఇప్పటి వరకు మూడు మృతదేహాలను శిథిలాల నుంచి బయటకు తీసినట్టు, మంచు పెళ్లల కింద చిక్కుకుపోయిన వారి కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. గతకొన్ని రోజులుగా జమ్మూకాశ్మీర్‌లో భారీగా మంచు కురుస్తున్న విషయం తెలిసిందే. దీనితో జమ్మూకాశ్మీర్‌లోని తొమ్మిది జిల్లాలకు భారత వాతావరణ విభాగం కూడా గురువారం హెచ్చరికలు జారీ చేసింది.

అసమ్మతి గళాన్ని అణచివేయొద్దు

ప్రభుత్వాల తీరును ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : దళితులు, అణచివేతకు గురైన వర్గాల ప్రయోజనాల కోసం అండగా నిలబడే మేధావులు, కార్యకర్తలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయని, విషపూరితమైన ప్రచారానికి పాల్పడుతున్నాయని అంతకంతకు ఈ ప్రచారం ఉధృతమవుతోందని సిపిఎం విమర్శించింది. భీమా కొరెగావ్ కేసులో మేధావి ఆనంద్ తెల్టుంబ్డే పట్ల వ్యవహరించిన తీరుతో ఇది ధృవీకరించబడిందని పేర్కొంది. ఈ సంఘటనలో ఆయన లేకపోయినప్పటికీ తప్పుడు కేసులో ఇరికించారని విమర్శించింది. సీనియర్ ప్రొఫెసర్ అయిన తెల్టుంబ్డే అనేక విమర్శనాత్మకమైన పుస్తకాలు రాశారు. తన విధానాలు, కార్యకలాపాలను విమర్శించే వారిపై ఇటువంటి దాడులకు దిగడం, అసమ్మతి గళాలకు 'పట్టణ నక్సల్స్' గా ముద్ర వేయడాన్ని పొలిట్‌బ్యూరో విమర్శించింది. అస్సాంకి చెందిన కురువృద్ధుడు, గౌరవనీయమైన హిరేన్ గగోయ్‌ని, మరికొందరిని దేశద్రోహం ఆరోపణలపై కేసు నమోదు చేయడాన్ని విమర్శించింది. ఇటువంటి మేధావులను, కార్యకర్తలను ఈ రీతిలో వేధించడాన్ని సిపిఎం ఖండిస్తోందని పేర్కొంది. తక్షణమే తెల్టుంబ్డేపై తప్పుడు కేసును ఉపసంహరించాలని డిమాండ్ చేసింది.

మమత ర్యాలీకి కాంగ్రెస్ మద్దతు



న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శనివారం కోల్‌కతా నగరంలో తలపెట్టిన ర్యాలీకి తమ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. ప్రస్తుతం యుఎఇ పర్యటనలో ఉన్న రాహుల్ ఈ మేరకు శుక్రవారం తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. ప్రతి పక్షాల ఐక్యత కోసం మమత చేపడుతున్న ఈ ర్యాలీ ద్వారా 'ఐక్య భారత్' నినా దాన్ని ముందుకు తీసుకెళ్తా మన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పక్షాన లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని ఆయన వెల్లడించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలని బిజెపి ప్రభుత్వంపై కోట్లాది మంది ప్రజలు కోపంతో ఉన్నారని, వీరందరూ ర్యాలీలో పాల్గొని తమ నిరసన తెలియజేస్తారని రాహుల్ అన్నారు. కుల, మతాలకు అతీతంగా చేపట్టనున్న ఈ ర్యాలీ ద్వారా ప్రజలు తమ అభీష్టాన్ని తెలియజేస్తారన్నారు. అన్ని పక్షాలు ఏకం కావడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమని, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకికతత్వ పరిరక్షణ సాధ్యమవుతుందని రాహుల్ అన్నారు. బిజెపి ప్రభుత్వ పని తీరు అన్ని వ్యవస్థలను నాశనం చేసే విధంగా ఉందని విమర్శించారు.

మార్చి మొదటివారంలో ఎన్నికల షెడ్యూల్ !

లోక్‌సభతో పాటు ఐదురాష్ట్రాల్లోనూ...ఇసి కసరత్తు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి మొదటివారంలో ప్రకటించే అవకాశాలున్నాయి. భారత ఎన్నికల కమిషన్ (ఇసి) అధికార వర్గాల సమాచారం మేరకు.. లోక్‌సభ ఎన్నికలు ఎన్ని విడతలుగా నిర్వహించాలి..? ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై ఈసీ కసరత్తు షురూ చేసింది. ప్రస్తుత లోక్‌సభ పదవీ కాలం జూన్ 3న ముగియనున్నది. లోక్‌సభతో వటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నాలుగురాష్ట్రాలతోపాటు జమ్మూకాశ్మీర్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని ఈసీ భావిస్తున్నది.

ప్రస్తుతం జమ్మూలో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్నది. ఇక్కడ ఆరునెలల్లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 2018 నవంబరు నెలలో జమ్మూకాశ్మీర్ అసెంబ్లీని రద్దు చేసిన విషయం విదితమే. ఇక ఆంధ్రప్రదేశ్, ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పదవీకాలం జూన్ 18న పూర్తికావస్తున్నది. సిక్కిం ప్రభుత్వం పదవీకాలం మే27క ముగియనున్నది. గత లోక్‌సభ ఎన్నికల నిర్వహణ తీరు ఇలా ఉన్నది. 2004లో నాలుగు విడతలు, 2009లో ఐదు విడతలు, 2014 నాటికి దశాబ్దవ్యవధిలో తొమ్మిది విడతలుగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించారు.

భారత్ క్షిపణి రక్షణ వ్యవస్థపై అమెరికా దృష్టి

వాషింగ్టన్ : భారత్‌తో క్షిపణి రక్షణ సహకారానికి గల అవకాశాలపై ట్రంప్ ప్రభుత్వం చర్చిస్తోంది. భారత్‌తో ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్చలు జరుగుతున్నాయని పెంటగన్ ప్రకటించింది. అమెరికా ఇండో-పసిఫిక్ వ్యూహంలో భారత్ కీలకమైన శక్తి అని పేర్కొంది. 'క్షిపణి రక్షణ సమీక్ష' పేరుతో 81పేజీల నివేదికను అధ్యక్షుడు ట్రంప్ విడుదల చేసిన నేపథ్యంలో పెంటగన్ ప్రకటన వెలువడింది. రష్యా నుండి ఎస్-400 వైమానిక రక్షణ వ్యవస్థ కొనుగోలుకు 500కోట్ల డాలర్ల మొత్తం వెచ్చించేందుకు భారత్ సిద్ధమైన నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యాతో ఈ ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల అమెరికా తన అసంతృప్తిని బహిరంగంగానే వెలిబుచ్చింది.

'ఆపరేషన్ కమలం' విఫలం

సిఎల్‌పి సమావేశానికి హాజరైన 76 మంది ఎమ్మెల్యేలు

బెంగళూరు, ప్రజాశక్తి ప్రతినిధి : కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బిజెపి చేసిన 'ఆపరేషన్ కమలం' కుట్ర మరోసారి విఫలమైంది. శుక్రవారం సాయంత్రం ఇక్కడ మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీ సమావేశానికి 76మంది శాసనసభ్యులు హాజరై తమ ఐక్యతను చాటిచెప్పారు. మరో నలుగురు శాసనసభ్యులు మాత్రం గైర్హాజరయ్యారు. 16మంది కాంగ్రెస్ శాసనసభ్యులను ప్రలోభాలకు గురి చేసి తమవైపు తిప్పుకోవడం ద్వారా కుమారస్వామి సర్కార్‌ను కూల్చాలని యడ్యూరప్ప సాగించిన కుట్రలు విఫలమయ్యాయి. దీంతో తాము అధికారంలోకి రావాలని బిజెపి నిస్సిగ్గుగా చేసిన యత్నాలు ముచ్చటగా మూడోసారి విఫలం చెందాయి. బిజెపి శిబిరంలో కనిపించిన గోకాక్ ఎంఎల్ఎ రమేష్ జారకిహెళి,అథణి నుంచి మహేష్ కుమతళ్లి, బళ్లారి రూరల్ బి.నాగేంద్ర,చించోళి ఎంఎల్ఎ ఉమేష్ జాధవ్ మాత్రం ఈ రోజు జరిగిన సిఎల్‌పి సమావేశానికి హాజరుకాలేదు. ఆ నలుగురికి దీనిపై 'షోకాజ్' నోటీసులు జారీచేస్తామని సిద్దరామయ్య చెప్పారు. ఈసాయంత్రం గంటసేపు జరిగిన సమావేశం తరువాత కాంగ్రెస్ శాసనసభ్యులను ఇక్కడికి సమీపంలోని ఈగల్‌టన్ రిసార్టుకు బస్సుల్లో తరలించారు. బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని భావించిన వారిలో



పలువురు ఈ సమావేశానికి హాజరై తాము ఎవరి వలలో పడలేదని స్పష్టం చేశారు. కర్ణాటక ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రధాని మోదీతో సహా అమిత్‌షా, పలువురు కేంద్రమంత్రులు తీవ్ర ప్రయత్నాలు చేశారని, కొందరు ఎంఎల్ఎలకు 25నుంచి 100కోట్ల రూపాయల వరకు డబ్బు ఆశను చూపడంతోపాటు, మంత్రి పదవులు కూడా ఎరవేశారని ఆరోపించారు. దేశంలో మోడీ ప్రభావం తగ్గుతోందని, వచ్చే ఎన్నికల్లో అధికారం దక్కదని, రాష్ట్రంలో 4సీట్లు మించి రావని, సిద్దరామయ్య చెప్పినట్లు సమాచారం.బిజెపి ప్రలోభాలకు లొంగితే భవిష్యత్ వుండదని తమ పార్టీ ఎంఎల్‌లను హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి హాజరుకాలేమంటూ బళ్లారి నాగేంద్ర,చించోళి ఉమేష్ జాధవ్ ముందుగానే సమాచారం తెలిపారని సిద్దరామయ్య విలేకరుల సమావేశంలో చెప్పారు.

కాశ్మీర్‌లో మరణాలపై

కమాండర్ వ్యాఖ్యలు దురదృష్టకరం

తరిగామి వ్యాఖ్య

శ్రీనగర్ : కాశ్మీర్‌లో మరణాల గురించి సైనిక కమాండర్ చేస్తున్న ప్రకటనలు, వ్యాఖ్యలు చాలా దురదృష్టకరమైనవని సిపిఎం వ్యాఖ్యానించింది. హత్యలకు గురయ్యేది పౌరులైనా, భద్రతా సిబ్బందైనా, ఉగ్రవాదులైనా మరణాల రేటు ఎన్నడూ కూడా 'అద్భుతమైన వార్త' కాదని సిపిఎం నేత మహ్మద్ తరిగామి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న కాశ్మీర్ ఘర్షణలు అనేక మంది యువత ప్రాణాలను హరిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హత్యలనేవి విషాదకరమైన క్రమమని, ఈ రక్తపాతాన్ని ఆపడానికి మార్గాలను అన్వేషించాల్సి వుందని



అన్నారు. ఇక్కడ యువత ఉగ్ర వాదం వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారో తీవ్రంగా సమీక్షించాల్సిన అవసరం వుందని అన్నారు. యువతలో ఒంటరి వారమై పోయామన్న భావన, నిరాశా నిస్పృహలు పేరుకుపోయినపుడు వాటిని తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అని ఆలోచించాల్సింది పోయి ప్రభుత్వం కండ బలం ద్వారానే సమస్యను పరిష్కరించాలని ఆలోచించడం సరైన వైఖరి కాదని ఆ ప్రకటన పేర్కొంది. చర్చలు, సంప్రదింపులే ఇందుకు సరైన పరిష్కారమని స్పష్టం చేసింది.

2022కన్నా ముందే రోదసిలోకి హ్యూమనాయిడ్ రోబోలు..!

ఇస్రో ఛైర్మన్ కె. శివన్

బెంగళూరు : గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా హ్యూమనాయిడ్ (మనిషిని పోలిన రోబోట్)తో ప్రయోగాలు నిర్వహించనున్నట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తెలిపింది. జంతువులతో ప్రయోగాలు జరపబోమని ఇస్రో ఛైర్మన్ కె. శివన్ స్పష్టం చేశారు. గగన్‌యాన్ ప్రాజెక్ట్ ద్వారా 2022 వరకల్లా రోదసిలోకి మనుషుల్ని(వ్యోమగాముల్ని) పంపించాలనేది ఇస్రో లక్ష్యం. దానికన్నా ముందు చేపట్టే రెండు ప్రయోగాల్లో హ్యూమనాయిడ్‌తో రోదసిలో పరీక్షలు నిర్వహించనున్నట్టు శివన్ తెలిపారు. తమ ప్రయోగాల లక్ష్యం మనుషుల్ని రోదసిలోకి పంపి సురక్షితంగా భూమిపైకి తిరగి వచ్చేలా చేయడమేనని శివన్ వివరించారు.

బిజెపికి మాజీ ఎంపి ఉదయ్ సింగ్ షాక్

పార్టీకి రాజీనామా.. మహాకూటమిలో చేరిక!

పాట్నా: సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో బీజేపీకి మరోషాక్ తగిలింది. బీహార్‌లోని పూర్ణియా లోక్‌సభ నుంచి రెండుసార్లు ఎన్నికైన బీజేపీ ఎంపీ ఉదయ్ సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. అంతేకాదు, మహాకూటమిలో చేరనున్నట్టు సంకేతాలనిచ్చారు. పార్టీ నాయకత్వపు నియంతృత్వ పోకడలే తన రాజీనామాకు ప్రధాన కారణమని తెలిపారు. జేడీ(యూ)తో సీట్ల పంపకాలపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదరణ గణనీయంగా పెరుగుతున్నదని ఆయన అన్నారు. తాను బీజేపీలో కొనసాగుతున్నప్పుడూ కాంగ్రెస ముక్త్ భారత్ నినాదాన్ని ఆమోదించలేదని చెప్పారు. ప్రతిపక్షం లేకుండా ప్రజస్వామ్యం మనలేదని, అది టొటాలిటేరియన్ పాలనలోకి జారుతుందని వివరించారు. పార్టీ ప్రస్తుత నాయకత్వ అప్రజాస్వామిక విధానాలపట్ల క్యాడర్‌లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని అన్నారు.

6 నెలల తర్వాత చూడండి..

మోడీ..జస్ట్ ఒక ఎంపీగా ఉంటారు : ప్రకాశ్ రాజ్

బెంగళూరు : దాదాపు ఐదు భాషల్లో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. రీల్ జీవితంలో విలక్షణ నటుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ప్రకాశ్‌రాజ్.. ఇక రియల్ జీవితంలో కఠిన పాత్రను పోషించనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తానని ప్రకటించిన ఆయన పొలిటికల్ జీవితంలో విజయంకోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇచ్చారు. మోడీపై ఆయన చేసిన విమర్శలు హాట్ టాపిక్‌గా మారాయి. 'నేను రాజకీయాల్లోకి వచ్చింది ప్రధానమంత్రి మోడీపై వ్యతిరేకతతోకాదు. ఆయన ఎవరు? ఆరునెలల తర్వాత చూడండి.. ఆయన కేవలం ఒక ఎంపీగా ఉంటారు' అని ప్రకాశ్ రాజ్ అన్నారు. 'మరో 50 ఏండ్లు అధికారం మాదేనని వారు (బీజేపీ) అహంకారపూరిత వ్యాఖ్యలుచేస్తున్నారు. అది నిర్ణయించేంది దేశ పౌరులు



మాత్రమే. మోడీ ప్రధానిగా ఎన్నికైన తర్వాత ఆయనను గౌరవించాను. మార్పు తెస్తారని ఆశించాను. కానీ, ఉద్యోగాలపై ఆయన చేసిన వాగ్దానం ఏమైంది? వ్యవసాయ సంక్షోభంపై చేసిందేమిటి? పెద్దనోట్ల రద్దుతో ఒరిగిందేమిటి? జీఎస్టీ అమలు ప్రణాళిక సరిగాలేదని అప్పుడే చెప్పాం.. జీఎస్టీని దాదాపు 200 సార్లు మార్పులు చేశారు' అని ప్రకాశ్‌రాజ్ అన్నారు. 'బీజేపీ ప్రభుత్వం ప్రజల జీవితాలతో ప్రయోగాలు చేస్తున్నది. మాకు శాస్త్రీయ కోణంలో పరిష్కారాలు కావాలి. ఇప్పటికే నష్టం జరిగిపోయింది' అని ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు.

బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో ప్రతీ ఎన్నికల్లోనూ తీవ్ర పోటీ ఉన్నప్పటికీ.. వరుసగా మూడుసార్లు ఈ స్థానంలో బీజేపీ విజయం సాధిస్తూ వస్తున్నది.

సంచలనం రేపిన జవాన్ కొడుకు ఆత్మహత్య!

న్యూఢిల్లీ : సైనికులకు అందించే ఆహారంపై ఫిర్యాదు చేస్తూ వీడియోలు తీసి సంచలనం సృష్టించిన జవాన్ కొడుకు ఆత్మ హత్యకు పాల్పడ్డారు. బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ తేజ్ బహదూర్ యాదవ్ కుమారుడు రోహిత్ (22) హర్యానాలోని రెవారీ జిల్లాలో శాంతి విహార్‌లోని తన గదిలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తున్నది. రోహిత్ ఆత్మహత్య చేసుకున్నట్టు తమకు సమాచారం అందగానే స్పాట్‌కు చేరుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. ఘటన జరిగిన గదికి లోపలి నుంచి తాళం వేసి ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. రోహిత్ మృత దేహం బెడ్‌పై ఉన్నదని, ఆయన చేతిలో తుపాకీ ఉన్నదని వివరించారు. అయితే ఆయన తండ్రి కుంభమేళాకు వెళ్లారని, ఈ ఘటనా సమాచారాన్ని వారికి అందించినట్టు తెలిపారు.

అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

రాజస్థాన్ క్యాబినెట్ నిర్ణయం

జైపూర్ : అసెంబ్లీలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజస్థాన్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ అంశంపై ఆ రాష్ట్ర క్యాబినెట్ శుక్రవారం చర్చలు జరిపింది. దీనిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ...అసెంబ్లీలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లను ఆమోదించాలని కేబినెట్ భేటిలో నిర్ణయించినట్టు తెలిపారు. కాగా తమ పార్టి అధికారంలో ఉన్న ఐదు రాష్ట్రాల్లో ఈ నిర్ణయాన్ని ఆమోదించాలని పార్టి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కోరుకుంటున్నారని వెల్లడించారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళకు రిజర్వేషన్లు కల్పించాలని చాలాకాలంగా తమ పార్టి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. సుదీర్ఘ పోరాటాల అనంతరం ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందిందని, కానీ రాజ్యసభలో బిల్లు నిలిచిపోయినట్టు ఆయన వివరించారు. డిప్యూటిసీఎం సచిన్‌పైలట్ మాట్లాడుతూ...పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన మహిళ బిల్లు పట్ల తమ పార్టి చిత్తశుద్ధితో ఉందన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న అసెంబ్లీల్లో ఈ బిల్లును ఆమోదించాలన్నది తమ పార్టీ ఉద్దేశమని స్పష్టం చేశారు.

ఏడేళ్లలో ఏడు పర్వతాలు..

అతిచిన్న వయసులో ఘనత సాధించిన సత్యరూప్

న్యూఢిల్లీ : ఏడేళ్లలో అన్ని ఖండాల్లోని అత్యంత ఎత్తైన ఏడు పర్వతాలను, అగ్ని పర్వతాలను అధిరోహించి భారతీయ పర్వతారోహకుడు సత్యరూప్ సిద్దాంత రికార్డు నెలకొల్పాడు. ప్రపంచంలో అతిచిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించాడు. అంటార్కిటికాలో 4285మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్‌సిడ్లే శిఖరంపైకి బుధవారం చేరుకొని ఈ ఘనత సాధించాడు. ఈ పర్వతాన్ని ఎక్కిన తొలి భారతీయుడు ఇతనే కావడం విశేషం. ఆయన ప్రస్తుతం కోల్‌కతలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. 35ఏండ్ల 262రోజుల వయసులో ఆయన రికార్డు సృష్టించడంతో గిన్నిస్‌బుక్‌లోకెక్కారు. కాగా ఇంతకు ముందు ఆస్ట్రేలియాకు చెందిన డేనియల్ (36ఏండ్ల 157రోజుల)పేరిట ఉండేది.

ప్రత్యేకం

41 శాతం అధిక ధరకు రాఫెల్ విమానాలు



నిర్ణయం మోడీదేనంటూ ద హిందూ పత్రిక కథనం

న్యూఢిల్లీ : నిర్ధిష్టమైన ప్రక్రియను పక్కనపెట్టి కుదుర్చుకున్న ఒప్పందం కారణంగానే రాఫెల్ యుద్ధ విమానాల ధరలో పెరుగుదల చోటు చేసుకున్నట్లు తాజా పరిణామాలతో తేటతెల్లమైంది. దాదాపు 41 శాతం అధిక ధరతో రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ప్రధాని మోడీయే నిర్ణయం తీసుకున్నారంటూ ఆంగ్ల పత్రిక 'ద హిందూ' సంచలనాత్మక కథనం ప్రచురించింది.

వైమానిక దళం ఆరు స్క్వాడ్రన్ల (126) విమా నాలు కోరగా, ప్రధాని మోడీ మాత్రం 36 రాఫెల్ యుద్ధ విమానాలనే ఫ్రాన్స్ నుండి కొనుగోలు చేస్తున్నట్లు 2015 ఏప్రిల్ 10న ప్రకటించారు. దీంతో ఒక్కో విమానం ధర 41.42 శాతానికి పెరి గింది. విమానాల సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు 1.3 బిలియన్ యూరోలను చెల్లించేందుకు ఎన్డీయే ప్రభుత్వం అంగీకరించింది. అయితే 126 విమానా లకు చెల్లించాల్సిన ఈ మొత్తం వ్యయాన్ని 36విమా నాలకే పరిమితం చేసింది. దీంతో విమానాల ధరలు పెరిగాయని ఆ కథనం పేర్కొంది. రాఫెల్‌యుద్ధ విమానాల ధరకు సంబంధించి పూర్తి సమాచారాన్ని పార్లమెంట్ హక్కుల కమిటీకి వెల్లడించేందుకు కూడా ఎన్డీయే ప్రభుత్వం నిరాకరించింది. వాటి ధరల వివరాలను వెల్లడి చేయకూడదని ఫ్రాన్స్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. దీనిపై ఫ్రాన్స్ ప్రభుత్వం వివరణ ఇస్తూ రక్షణ పరికరాలు, నిర్వహణ సామర్థ్యాలు, భద్రతపై ప్రభావం చూపే అవకాశ మున్నందున భాగస్వామ్య దేశం ఇచ్చిన రహస్య సమాచారానికి రక్షణ కల్పించేందుకే అటువంటి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపింది. ఫ్రాన్సు ప్రభుత్వం వివరణ మేరకు కేవలం ధరను వెల్లడించే విషయంలో మాత్రమే ఈ ఒప్పందం వర్తించదన్నది సుస్పష్టమవుతున్నది.

2007లో అప్పటి యుపిఎ ప్రభుత్వం 126 రాఫెల్ విమానాలను భారత్‌కు హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) లైసెన్స్ కింద సరఫరా చేసేందుకు టెండర్ దాఖలు చేసింది. 126 విమానాలలో 18 సిద్ధమై ఉన్నవి కాగా, మిగిలిన 108 విమానాలు నిర్మాణ దశలో వున్నాయి. సిద్ధంగా ఉన్న ఒక్కొక్క యుద్ధ విమానానికి 79.3 మిలియన్ యూరోల ధరను టెండర్‌లో పేర్కొంది. 2011 నాటికి వీటి ధర ఒక్కొక్క దానికి 100.85 మిలియన్ యూరోలకు పెరిగింది. 2016లో 36 రాఫెల్ యుద్ధ విమానాలకు గాను ఒక్కొక్క దానిపై 9 శాతం డిస్కౌంట్‌ను ఎన్డీయే ప్రభుత్వం పొందింది. ఈ మేరకు రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఒక్కొక్క విమానం ధర 91.75 మిలియన్ యూరోలు తగ్గింది. అయితే కథ ఇంతటితో ముగియలేదు. 13 నిర్ధిష్ట విస్తరణలు గల విమానాల రూపకల్పన అభివృద్ధికి గాను 1.4 బిలియన్ యూరోలను డస్సాల్ట్ కోరింది. వైమానిక దళం ప్రత్యేకంగా పేర్కొన్న హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అదనపు సామర్థ్యాలను సమకూర్చేం దుకు గాను ఈ అదనపు మొత్తాన్ని డస్సాల్ట్ కోరింది. అనంతరం జరిగిన చర్చల్లో ఈ అదనపు వ్యయం 1.3 బిలియన్ యూరోలకు తగ్గింది. అంటే దాని రూపకల్పన, అభివృద్ధి వ్యయాన్ని ఇప్పుడు 36 రాఫెల్ విమానాల ధరకు జోడించడంతో 2007లో ఒక్కొక్క విమానం ధర 11.11 మిలియన్ యూరోల నుండి 36.11 మిలియన్ యూరోలకు పెరిగింది. ఈ ఒప్పందం 2016లో నిలిచిపోయిందని ఆ కథనం తెలిపింది.

ఈ క్రమంలోని 36 రాఫెల్ యుద్ధ జెట్ విమానాలపై కాంట్రాక్టర్ డస్సాల్ట్ ఏవియేషన్ వాస్తవ ధర 1.4 బిలియన్ యూరోల నుండి 1.3 బిలియన్ యూరోలకు ధరను తగ్గించింది. దీనిపై ఏడుగురు సభ్యులు గల భారత ప్రతినిధి బృందం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అందులో సభ్యులుగా వున్న రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ముగ్గురు సీనియర్ అధికారులు వెల్లడించిన అభిప్రాయాలను ద హిందూ పత్రిక సమీక్షించింది.

"వైమానిక దళం కోరిన 126 విమానాలకు సంబంధించి 2009లో పేర్కొన్న 1.4 బిలియన్ యూరోల కన్నా 2015 మే నాటి 1.3 బిలియన్ యూరోల ధర మెరుగ్గా ఉందని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందంలో మెజార్టీ సభ్యులు అంటే నలుగురు నిర్ణయించారు. అంతేకాకుండా ఐఎస్‌ఇ వ్యయం నాన్ రికరింగ్ వ్యయం (ఎన్‌ఆర్‌సి). విమానాల కొనుగోలు సంఖ్యపై దీని ప్రభావం ఉండదు. ఈ వాస్తవాలను రక్షణ సేకరణల కౌన్సిల్ (డిఎసి) అంగీకరించింది భద్రతపై ఏర్పడిన కేబినెట్ కమిటీ (సిసిఎస్) కూడా దీనికి ఆమోదం తెలిపింది"

కాగా36 యుద్ధ విమానాల సేకరణల ప్రతిపాద నలను ఆగస్టు 2015-జులై 2016 మధ్య వివిధ సందర్భాలలో ఐదు సార్లు డిఎసి పరిశీలనకు పంపారు. 10 వివాదాస్పద అంశాలలో ఒక దానిని భారత ప్రతినిధి బృందం 4-3 మెజార్టీతో అంగీకరిం చింది. ఈ నేపథ్యంలో నిర్ణాయక ప్రక్రియపై ప్రభు త్వం సుప్రీం కోర్టుకు సమర్పించిన నివేదికలో " ప్రతి నిధి బృందం నివేదిక, సిసిఎస్ ఆమోద ప్రతిపాదన లపై రక్షణ మంత్రిత్వ శాఖలో అంతర్ ప్రభుత్వ చర్చలు జరిగిన అనంతరం ఆగస్టు 24, 2016న ప్రతిపాదనను సిసిఎస్ ముందుంచారు" అని ఆ నివేదికపేర్కొంది. ప్రతిపాదిత ఒప్పందంపై ఇతర వివాదాస్పద అంశాలతో పాటు ధరల ఒప్పందం కూడా సిసిఎస్‌కు సమర్పించిన నివేదికలో ఉంది.

డిఎసి పాత్ర

రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారికర్ నేతృత్వం వహిస్తున్న రక్షణ సేకరణల కౌన్సిల్ (డిఎసి) పాత్రపై ప్రభుత్వం సమర్పించిన నివేదికలో ఎటువంటి సమాచారం లేకపోవడం ప్రాధాన్యతను సంతరించు కుంది. రక్షణ సేకరణల ప్రక్రియ (డిపిపి)లో నిర్ణయం తీసుకోవడంలో డిఎసి సాధికారత కలిగి ఉంటుంది. కాని మనోహర్‌పారికర్ ఈ విషయంలో తన బాధ్యతల నుండి తప్పించుకున్నారు ప్రధాని మోడీ పారిస్‌లో 36 రాఫెల్‌యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించారు. "డస్సాల్ట్ ఏవియేషన్ తెలియచేసిన దానికన్నా మరింత మెరుగ్గా విమా నాలు కొనుగోలు చేస్తున్నాం" అని ప్రకటించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని సిసిఎస్ భారత ప్రతి నిధి బృందంలోని మెజార్టీ నిర్ణయాన్ని ఆమోదించింది

ప్రత్యేక రాయితీ?

2015-2016 సంవత్సరాలలో 36 యుద్ధ విమానాల ధరలు తగ్గించడానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇచ్చిందా? అతి ముఖ్యమైన ప్రశ్నగా ఆంగ్ల పత్రికా కథనం వెల్లడించింది. దీనికి సమాధానం అవును అనుకుంటే ఒక ఆకర్షణీయమైన రీతిలో రాయితీ ఇచ్చి ఉండాలి. బ్రిటన్, జర్మని, ఇటలీ, స్పెయిన్‌లకు చెందదిన ప్రముఖ అంతరిక్ష, రక్షణ కంపెనీలతో కూడిన యూరో ఫైటర్ టైఫూన్ కన్సార్టియం నుండి ఈ రాయితీ వచ్చి ఉండాలి. వాస్తవానికి చర్చల ప్రతినిధి బృందంలోని అసమ్మతి సభ్యులు కొన్ని అంశాలను లేవనెత్తిన్నట్లు అధికారిక పత్రాలు వెల్లడిస్తున్నాయని పత్రికా కథనం వెల్లడించింది.

"(ఎఫ్) అంశం-6 : వైమానిక దళం కోరిన 126 విమానాలకు యూరోపియన్ ఏరోనాటిక్ డిఫెన్స్ అండ్ స్పేస్ కంపెనీ (ఇఎడిఎస్) 20 శాతం డిస్కౌంట్‌తో వేసిన టెండర్‌ను నిర్లక్ష్యం చేశారు. ఇఎడిఎస్ ఇచ్చిన టెండర్ కొటేషన్‌ను ప్రతినిధి బృందం 36 రాఫెల్ విమానాల డెలివరికి సమానం గా తీసుకుని, ధరలతో పోల్చింది. ఇఎడిఎస్ అయాచి తంగా ఇచ్చి 20 శాతం డిస్కౌంట్ రక్షణ సేకరణల ప్రక్రియకు భిన్నంగా ఉందని మెజార్టీ సభ్యులు పేర్కొన్నారు.

కృత్రిమ ఉల్కల సృష్టిలో జపాన్

టోక్యో: అమెరికా, చైనా వంటి దేశాలు అంగారక, చంద్ర గ్రహాల మీద పరిశోధనల కోసం అంతరిక్ష నౌకలను పంపడాన్ని స్ఫూర్తిగా తీసుకున్న జపాన్ కృత్రిమ ఉల్కల సృష్టిపై దృష్టి పెట్టింది. ప్రపంచంలో మొట్టమొదటి కృతిమ (ఫేక్) ఉల్కాపాతాలను సృష్టించేందుకు అక్కడి ఏరో స్పేస్ ఎక్స్ ఫ్లోరెషన్ ఏజన్సీ ఓ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపింది. ఈ ' మ్యాన్ మేడ్ మీటియోర్ షవర్స్ ' సృష్టికి గల సాధ్యాసాధ్యాల పరిశీలనకు గాను 'ఎప్సి లాన్ రాకెట్-4' ను ఈ సంస్థ ప్రయోగించింది. అంతా సవ్యంగా జరిగితే అంతరిక్షంలో ఈ రాకెట్ మీడియం సైజు పెల్లెట్లను మండిస్తుందట. ఇలాంటి ప్రయోగాలు మరిన్ని జరిపేందుకు లక్షలాది పౌండ్లు వ్యయమవుతాయని అంచనా వేస్తున్నారు. సహజ సిద్ధమైన ఉల్కల కన్నా ఈ ఫేక్ మెటీయోర్స్ చాలా అద్భుతంగా ఉంటాయని, నింగిలో ఎక్కువసేపు కనబడుతాయని టోక్యోలోని ఏస్ట్రో లైవ్ ఎక్స్ పీరియెన్సెస్ సంస్థ పేర్కొంది. ఓ పెద్ద పెట్టె ఆకారంలో ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ ని తమ ఏజెన్సీకి అను బంధంగా ఉన్న కక్ష్యలోకి పంపినట్టు ఈ సంస్థ సీఈఓ లీనా ఒకజిమా తెలిపారు.



కొలంబియా పోలీస్ అకాడమిపై ఉగ్రదాడి

21 మంది మృతి, 68 మందికి గాయాలు

కొలంబియా పోలీస్ అకాడమిపై ఉగ్రవా దులు పంజా విసిరారు. ఈ ఘటనలో 21 మంది మృతిచెందగా, 68 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొగోటా పోలీస్ క్యాడెట్ ట్రైనింగ్ అకాడమీలో శుక్రవారం కారు బాంబు పేలింది. పోలీస్ క్యాడెట్ల ప్రమోషన్ కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి పేలుడు పదార్థాలతో నింపిన కారును అతివేగంగా దూసుకొచ్చి ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఉగ్రవాది సహా 21 మంది మృతి చెందారు. కారులో 80 కేజీల పేలుడు పదార్థాలు ఉన్నట్టు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దీన్ని తీవ్రవాద దాడిగా కొలంబియా రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ధారించింది. కొలంబియాలో ఈ స్థాయిలో భారీ బాంబు పేలుడు ఘటన చోటు చేసుకోవడం గత 16 ఏండ్లలో ఇదే మొదటిసారిగా రక్షణ శాఖ అధికారులు తెలిపారు. తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని కొలంబియా అధ్యక్షుడు ఇవాన్ డూక్యూ ట్వీట్ చేశారు. ఈ పేలుడుకు కారణమైన ప్రధాన సూత్రధారులను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. దేశ సరిహద్దులు, నగరాల్లో పోలీసు బందోబస్తును బలోపేతం చేయాలని ఆదేశించారు. బాంబు పేలుడులో మృతులకు నివాళిగా దేశంలో మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు.

అరిజోనాలో పోలీసుల కాల్పులు

మైనర్ బాలుడు మృతి

వాషింగ్టన్ : అరిజోనా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ మైనర్ బాలుడు మృతి చెందాడు. కారు దొంగిలించేందుకు బాలుడు ప్రయత్నించడంతోనే తాము కాల్పులు జరిపినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. అయితే, పోలీసుల తీరు పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఉద్ధేశపూర్వకంగానే కాల్పులకు తెగబడినట్టు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించారు. అరిజోనా పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గురువారం అర్ధరాత్రి ఫొయినిక్స్ సబర్బ్ ప్రాంతంలో గస్తీ పోలీసులకు ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతని చేతిలో ఉన్న బొమ్మ తుపాకీని నిజమైన తుపాకీగా భావించిన పోలీసులు కాల్పులు జరిపారు.

దావోస్ సదస్సుకు ట్రంప్ డుమ్మా

వాషింగ్టన్ : అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ కారణంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన విదేశీ పర్యటనను రద్దు చేసుకున్నారు. స్విట్జర్లాండ్ లోని దావోస్ నగరంలో వచ్చే వారం వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ జరుగనుంది. ఈసదస్సుకు ట్రంప్ హాజరు కావడంలేదని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ వెల్లడించారు. అమెరికా-మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం కోసం 5.6బిలియన్ డాలర్లు అవసరమని ట్రంప్ కోరారని అన్నారు. అయితే, డెమోక్రటిక్ పార్టీ సెనెటర్లు ట్రంప్ అభ్యర్థనను తోసిపుచ్చారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణాన్ని అడ్డుకుంటామంటూ నినాదాలు చేశారు. గోడ నిర్మాణానికి నిధులు రాబట్టాలని ట్రంప్ పట్టుబట్టారు. గతనెల22 నుంచి అమెరికాలో పాలన స్తంభించింది. వేతనాలు లేకుండానే 8లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గతేడాది దావోస్ సదస్సుకు ట్రంప్ హాజరయ్యారని, ఈఏడాది యూఎస్‌లో కొనసాగు తున్న షట్‌డౌన్ కారణంగా ఈ సదస్సుకు దూరమవుతున్నారని శాండర్స్ చెప్పారు.

అయితే, ట్రంప్‌కు బదులుగా అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పోంపియో, ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్ న్యూచిన్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు హాజరవుతారని శాండర్స్ తెలిపారు. ఈనెల22న జరగనున్న ఈ సదస్సులో పోంపియో ప్రారంభోపన్యాసం చేస్తారని చెప్పారు. ఇదిలా ఉండగా, అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ కారణంగా ట్రంప్ మానసిక వేదనకు గురవుతున్నారు. హౌస్‌స్పీకర్ నాన్సీ పెలోసి జర్మనీ, ఈజిప్టు, అఫ్ఘనిస్తాన్ దేశాల్లో పర్యటించాల్సి ఉంది. షట్‌డౌన్ కారణంగా ఆమెను కూడా తన పర్యటనను వాయిదా వేసుకోవాలని ట్రంప్ కోరారు.



మూడు రోజుల్లో 900 మంది బలి

కాంగో ఘర్షణలపై ఐరాస వెల్లడి

బ్రిజెల్లె/ఐరాస : రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో అధికారంకోసం జరుగుతున్న ఆధిపత్య పోరులో భాగంగా గత నెల చివరిలో మూడు రోజులపాటు కొనసాగిన హింసాకాండలో దాదాపు 890 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి గురువారం రాత్రి విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఈ హింసాకాండలో దాదాపు 465 ఇళ్లు దగ్ధం కాగా, రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఆరోగ్య కేంద్రం, హెల్త్ చెక్‌పోస్ట్, మార్కెట్, ఎన్నికల కమిషన్ కార్యాలయం వంటి పలు భవనాలు పూర్తి స్థాయిలో విధ్వంసానికి గురయ్యాయని ఐరాస తన నివేదికలో తెలిపింది.

ఈ ఘర్షణలు, హింసాకాండలో నిర్వాసితులైన దాదాపు 16 వేల మందికి పైగా ప్రజలు కాంగోనది దాటి డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోకి ప్రవేశించారని ఈ నివేదిక వివరించింది. ఈ హింసాకాండపై సమగ్ర దర్యాప్తు జరిపి కుట్రదారులను న్యాయస్థానంలో నిలబెట్టటం ప్రధానమని ఐరాస మానవ హక్కుల కమిషనర్ మిచెల్లీ బాచ్లెట్ అన్నారు. మానవ చరిత్రలో అత్యంత కిరాతకంగా జరిగిన ఈ హింసాకాండ తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అందరికీ ఆందోళన కలిగిస్తున్న ఈ హింసాకాండపై ఐరాస మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించింది.

కెన్యా హోటల్‌పై దాడి కేసులో కీలక నిందితుల అరెస్ట్

నైరోబి : కెన్యా రాజధాని నైరోబిలోని హోటల్‌పై జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు కీలక నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి మారణాయుధాలు, తుపాకులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. కాగా, ఈనెల 16న నైరోబిలోని లగ్జరీ హోటల్‌పై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 21 మంది మృతి చెందారు. మృతుల్లో అమెరికా పౌరులే అధికంగా ఉన్నారు. హోటల్‌లో చిక్కుకున్న 700 మందిని ప్రత్యేక బలగాలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. ఈ ఘటనకు తామే బాధ్యత వహిస్తున్నట్టు అల్‌షాబాబ్ ఉగ్రసంస్థ ప్రకటించుకుంది.

అమెరికా బెదిరింపులకు

క్యూబా ఖండన

హవానా : ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను మరింత తీవ్రతరం చేస్తా మంటూ అమెరికా చేస్తున్న బెదిరిం పులను క్యూబా తీవ్రంగా నిరసించింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటామంటున్న ఈ చర్య అంతర్జాతీయ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తుందని, తృతీయ దేశాల సార్వభౌమాధికారంపై, వారి ప్రయోజనాలపై నేరుగా దాడి చేసినట్టవుతుందని క్యూబా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. హెల్మ్స్-బర్టన్ చట్టం వర్తింపును 45రోజులకు సస్పెండ్ చేస్తూ అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకున్న వెంటనే ఈ హెచ్చరిక వెలువడింది. ఈ చట్టం 1996లో అమల్లోకి వచ్చింది. 1960వ దశకంలో క్యూబాలో జాతీయం చేయబడిన అమెరికన్ ఆస్తుల విషయంలో ఏ విదేశీయుడికైనా వ్యతిరేకంగా అమెరికా కోర్టుల్లో అమెరికన్ జాతీయులు క్లెయిమ్ చేసుకునే అధికారం ఈ చట్టం కల్పిస్తోంది. అయితే, చట్టబద్ధమైన ఒక క్రమం ద్వారా తమ దేశంలోని అమెరికన్ ఆస్తులు జాతీయం చేయబడ్డాయని క్యూబా ప్రభుత్వం చెబుతోంది. అమెరికా సుప్రీం కోర్టు కూడా దీన్ని గుర్తించిందని, జాతీయ, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే జరిగిందని పేర్కొంటోంది. 1996 నుంచి ట్రంప్‌తో సహా దాదాపు అందరూ అమెరికా అధ్యక్షులు ప్రతి ఆరు నెలలకోసారి ఈ చట్టం వర్తింపును నిలుపుచేస్తూ డిక్రీలు జారీ చేస్తూనే వస్తున్నారు. క్యూబా ఈ చర్యల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

పాలక సంకీర్ణంపై స్పెయిన్‌లో మహిళల నిరసన

వేలాది మంది ప్రదర్శన

మాడ్రిడ్ : అధికారం చేపట్టడానికి సిద్ధమైన కన్జర్వేటివ్ అల్ట్రా రైట్ వింగ్ సంకీర్ణానికి వ్యతిరేకంగా స్పెయిన్‌లోని అండలూసియా రాష్ట్రంలో వేలాదిమంది ఫెమినిస్టులు, ప్రగతిశీల గ్రూపులు నిరసన వ్యక్తం చేశాయి. గతేడాది డిసెంబరులో జరిగిన ప్రాంతీయ ఎన్నికల్లో పాలక సోషలిస్టు పార్టీ (పిఎస్ఓఇ) మెజారిటీ కోల్పోయింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఈ పార్టీనే అధికారంలో వుంది. ఎన్నికలు ముగిసిన అనంతరం జరిగిన చర్చల్లో కన్జర్వేటివ్ పాపులర్ పార్టీ (పిపి) మధ్యే మితవాదులైన సిటిజన్స్ పార్టీతో, అల్ట్రా మితవాద పార్టీ అయిన వోక్స్‌తో పొత్తు పెట్టుకుంది. ఇదిలావుండగా, వేలాదిమంది మహిళలు అండలూసియన్ పార్లమెంట్ ఎదుట ధర్నా చేశారు. మంగళ, బుధవారాల్లో ఈ ఆందోళన కొనసాగింది. మహిళల హక్కులపై దాడిని వారు తీవ్రంగా నిరసించారు. మితవాద పార్టీ అయిన వోక్స్ తీసుకున్న వైఖరులను వారు ఖండిస్తున్నారు. రాడికల్ ఫెమినిజాన్ని (స్త్రీవాదం) వోక్స్ పార్టీ తీవ్రంగా విమర్శిస్తోంది. అలాగే ఎల్‌జిబిటిక్యు హక్కులను, గర్భస్రావ హక్కులను కూడా తీవ్రంగా నిరసిస్తోంది.



ఇ-కామర్స్‌లోనూ సత్తా చాటుతా..

- రిటైల్, జియో మేళవింపుతో కొత్త వేదిక
- రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ

గాంధీనగర్: దేశంలో ఆన్‌లైన్ రిటైల్ దిగ్గజాలుగా వెలుగొందుతున్న అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ త్వరలో గట్టి షాక్ ఇవ్వనుంది. టెలికాం రంగంలో జియో ఇన్ఫోకామ్ సంచలనం మాదిరిగానే.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిటైల్ మార్కెట్‌లోకి రిలయన్స్ రిటైల్‌ను అందుబాటులోకి తెనున్నట్టుగా ఆ సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేశ్ అంబానీ తెలిపారు. రిలయన్స్ రిటైల్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ గ్రూపు సంస్థల మేళవింపుగా కొత్త ఈ-కామర్స్ వేదికను ప్రారంభించనున్నట్టుగా ఆయన తెలిపారు. దీనిని తొలిసారిగా గుజరాత్ రాష్ట్రం నుంచే ప్రారంభించనున్నట్టుగా ఆయన వెల్లడించారు. గాంధీనగర్‌లో తొమ్మిదో వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో మాట్లాడుతూ.. గుజరాత్ ఎప్పటికీ తమ మొదటి ప్రాధ్యాన్యమన్నారు. తాము అందుబాటులోకి తేనున్న ఈ-కామర్స్ వేదిక వల్ల గుజరాత్‌లోని దాదాపు 1.2 లక్షల మంది చిరు వ్యాపారులకు సాధికారికత లభించనుందని ఆయన వివరించారు. ఈ రంగంలోనూ సత్తా చాటుతామని ఆయన తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

కెసిఆర్‌కు మూడు గిప్టులిస్తా

సంక్షోభంలో రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు బిజెపితో కలిశానని, అయితే మోడీ నమ్మించి మోసం చేశారని, దేశంలో ఎక్కడా లేని పథకాలను రాష్ట్రంలో కొనసాగిస్తున్నామని ముగ్గురు మోడీలు అసూయ పడుతున్నారన్నారు. రాష్ట్రాలపై కేంద్రం చేస్తున్న దాడులను ఎదుర్కొనేందుకు బిజెపి వ్యతిరేక పార్టీలన్నీ ఒకే తాటిపైకి వచ్చి పోరాడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెథాయ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, తడిసి రంగు మారిన ధాన్యం క్వింటాలు రూ.200 ధర తగ్గించి రూ.1550కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఎంపి రాయపాటి సాంబశివరావు, ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, తెనాలి శ్రావణ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జానీమూన్, ఆహార కమిషన్ చైర్మన్ జెఆర్ పుష్పరాజ్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, సిఆర్‌డిఎ కమిషనర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ పాల్గొన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పి.మహేష్, కెవిపిఎస్ గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకుడు జి.నరేష్ తదితరులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

ఇకపై ఒకేసారి కుల ధృవీకరణ పత్రం

సమర్పించాలని, ఇప్పటికే యుసిలు ఇచ్చిన వాటి పరిస్థితి తెలుసుకునేందుకు ఏపి భవన్ రెసిడెంట్ కమిషనర్‌తో ఎప్పటికప్పుడు సంప్రదించి నిధులు రాబట్టాలన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలకు పూర్తిస్థాయిలో నిధులు రాబట్టేందుకు ప్రయత్నించాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, సర్వీస్ రూల్స్, మున్సిపాలిటీల్లో పనులకు నిధులు, ఎపిపిఎస్సీ విడుదల చేసిన, చేయాల్సిన నోటిఫికేషన్లు, జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులు, యువనేస్తం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

పడవ ప్రమాదాలను నివారించాలి

పడవ ప్రమాదాలను నివారించేందుకు ప్రమాదరహిత బోట్లు సమకూర్చుకోవాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. పడవ ప్రమాదాల నివారణపై సిఎస్ ఆయా శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. గత మూడేళ్లలో జరిగిన పడవ ప్రమాదాల్లో దాదాపు 67 మంది పైగా చనిపోయారని అధికారులు సిఎస్‌కు వివరించారు. ఇకపై ప్రమాదాలను నివారించేందుకు రక్షణ ఉండే అధునాతన పడవలు కొనుగోలు చేసుకోవాలని సిఎస్ సూచించారు. పడవలకు లైసెన్సులు ఇవ్వడం, శిక్షణ కలిగిన చోదకులను నియమించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చున్నారు. ప్రయాణీకులను చేరవేసే పడవలకు అనుమతులు తప్పనిసరి చేసి, గడువులోగా లైసెన్సులు ఇవ్వాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే జలవనరుల శాఖ అధికారులకు కొన్ని బాధ్యతలు అప్పగించాలని సూచించారు. జలవనరులు, పోలీస్, పంచాయతీరాజ్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు రెండు నెలలకోసారి సమావేశమై పడవ ప్రమాదాల నివారణ పై సమీక్షించాలన్నారు.

కేసు వివరాలు అప్పగించండి

జగన్ కేసుపై సిట్‌కు ఎన్ఐఏ కోర్టు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్‌పై దాడి కేసుకు సంబంధించి సిట్ అధికారులు సేకరించిన కేసు డైరీ, సేకరించిన వస్తువులు, దర్యాప్తు వివరాలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులకు తక్షణమే అప్పగించాలని విశాఖ సిట్ ఎసిపి బివిఎస్ నాగేశ్వరరావును ఆదేశిస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు నేటితో ఎన్ఐఎ కస్టడీ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం ఎన్ఐఎ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా, సిట్ అధికారులు తమకు సహకరించడం లేదని ఎన్ఐఎ దాఖలు చేసిన ఫిర్యాదుపై తొలుత విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. కౌంటర్ పిటీషన్ దాఖలు చేయాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. నిందితుడు శ్రీనివాస్‌కు ఈనెల 25 వరకు జుడీషియల్ రిమాండ్ విధించారు. విజయవాడ జైల్లో తమ క్లెయింట్‌కు భద్రత లేదని, ఆయన తరపు అడ్వకేట్ సలీమ్ పిటీషన్ దాఖలు చేశారు. ఇదే సమయంలో నిందితుడు శ్రీనివాస్ తనకెటువంటి ప్రాణహాని లేదని కోర్టుకు చెప్పడంతో న్యాయవాధులు అవాక్కయ్యారు. విచారణలో న్యాయమూర్తి భద్రత విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను వివరణ కోరగా విజయవాడ జైలులో భద్రత కల్పించలేమని చెప్పడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. న్యాయమూర్తి పార్ధసారధి నిందితుడు శ్రీనివాసరావును ఎన్ఐఎ అధికారులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని అడిగారు. తనను బాగా చూసుకున్నారని సమాధానమిచ్చారు. జైలులో ఉన్నప్పుడు తాను రాసుకున్న 22పేజీల పుస్తకాన్ని జైలు అధికారులు బలవంతంగా తీసుకున్నారని, పుస్తకాన్ని ఇప్పించాలని న్యాయమూర్తికి విన్నవించుకున్నారు. తాను డైరీలో రాసుకున్న వివరాలనతో పాటు జగన్‌పై ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందో, దాడి అనంతర పరిణామాలన్నింటినీ అందులో రాసుకున్నానని కోర్టుకు శ్రీనివాసరావు వివరించారు. తాను వాస్తవాలను నేరుగా ప్రజలకు మీడియా ద్వారా వివరించేందుకు అనుమతినివ్వాలని కోరగా, ఇందుకు చట్టాలు అంగీకరించవని. జైలులో ఉన్న కాలంలో ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని నిందితుని అభ్యర్ధనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. జైలు అధికారులు స్వాధీనం చేసుకున్న వస్తువులను దర్యాప్తు పూర్తయ్యే వరకు నిందితునికి ఇచ్చే అవకాశాలుండవని న్యాయమూర్తి తెలిపారు.

ఆ ఇద్దరు మహిళలకు పూర్తి భద్రత

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కోయిలండికి చెందిన కళాశాల అధ్యాపకురాలు బిందు (42), మల్లప్పురం జిల్లా అంగడిపురంకు చెందిన పౌర సరఫరాల శాఖ ఉద్యోగిని కనకదుర్గ (44) ఈ నెల 2న శబరిమల ఆలయంలోకివెళ్ళి అయ్యప్పస్వామిని దర్శించుకున్న విషయం తెలిసిందే. కాగా, మహిళలు ఆలయంలోకి వెళ్ళడాన్ని నిరసిస్తూ హిందూత్వశక్తులు హింసాత్మక చర్యలకు పాల్పడటమేకాక, వారిపై దాడి చేస్తామని కూడా ప్రకటించడంతో ఆ ఇద్దరు మహిళలు కొన్ని రోజుల పాటు అజ్ఞాతంలో వున్నారు. ఈ నేపథ్యంలో తమకు రక్షణ కల్పించాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఇద్దరుకాదు.. 51 మంది

ఆ ఇద్దరితోపాటు, ఆలయంలోకి ప్రవేశించిన ఇతర మహిళలకు కూడా ఇప్పటికే రక్షణ కల్పిస్తున్నామని కేరళ ప్రభుత్వం తరపున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా కోర్టుకు తెలిపారు. అన్ని వయసుల వారినీ అనుమతిస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు తర్వాత 50 ఏండ్ల మధ్య వయసున్న మహిళలు 51 మంది ఆలయంలోకి వెళ్ళారని హన్సారియా కోర్టుకు తెలిపారు. ఆలయంలోకి వెళ్ళిన ఆ 51 మంది మహిళల జాబితాను కూడా హన్సారియా కోర్టుకు అందచేశారు. కాగా, వారికి ఇప్పటికే భద్రత కల్పిస్తే.. దానిని కొనసాగించాలని కోర్టు ఆదేశించింది.

అమరావతిలో ఈనెల 31న శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూకర్షణం

- టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో ఈనెల 31న శ్రీవారి ఆలయనిర్మాణానికి భూకర్షణం, బీజాపాసనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ పేర్కొన్నారు. అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణ స్థలంలో భూకర్షణ కోసం జరుగుతున్న ఏర్పాట్లను టిటిడి జెఇఓ పోల భాస్కర్, సివిఎస్ఓ గోపీనాథ్ జెట్టీతో కలసి పరిశీలించారు. అనంతరం ఈఓ విలేకరులతో మాట్లాడుతూ భూకర్షణం జరిగే రోజు ఉదయం 9.15 నుంచి 9.40 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని తెలిపారు. ఆగమశాస్త్రం ప్రకారం భూకర్షణం చేయడం ఆనవాయితీగా వస్తోందని, ఆగమ సలహాదారుల సూచన మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సిఆర్‌డిఎ 25 ఎకరాల భూమిని కేటాయించిందని, ఇందులో ఐదు ఎకరాల్లో శ్రీవారి ఆలయం, మిగిలిన 20 ఎకరాల్లో మాస్టర్‌ప్లాన్ రూపొందించి ఆధ్యాత్మిక కార్యకలాపాల నిర్వహణ కోసం ఆడిటోరియాలు, కళ్యాణ మండపాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు.

సుమారు రూ.140 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టేందుకు ఆలయ ధర్మకర్తల మండలి టెండర్లు ఖరారు చేసినట్లు ఆయన వెల్లడించారు. భక్తుల కోరిక మేరకు గత ఏడాది జూలైలో కురుక్షేత్రలో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. జనవరి 27న కన్యాకుమారిలో శ్రీవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాబిషేకం నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో మార్చి 13న శ్రీవారి ఆలయాన్ని ప్రారంభిస్తామని ఈఓ పేర్కొన్నారు.ఏజెన్సీ ప్రాంతాలైన రంపచోడవరం, సీతంపేట, పార్వతీపురంల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశామన్నారు. విశాఖ, భువనేశ్వర్‌ల్లో శ్రీవారి ఆలయాలతో పాటు చెన్నైలో పద్మావతి అమ్మవారి ఆలయాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. భూకర్షణం కోసం హోమగుండాలు, వేదిక, సిఆర్‌డిఎ స్టాళ్లు, ఆలయ నమూనా ఎగ్జిబిషన్, ప్రత్యక్షప్రసారాలు, డిస్‌ప్లే స్క్రీన్లు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించామని ఈఓ చెప్పారు.భూకర్షణంలో భాగంగా శ్రీవారి కళ్యాణోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం అనంతరం పది రోజుల పాటు అర్చకులుఆగమోక్తంగా వైదిక కార్యక్రమాలు, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు చేపడతారన్నారు.

అనంతరం ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని టిటిడి ఈఓ సింఘాల్ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు శ్రీవారి సేవకులు, భజనమండళ్ల సభ్యులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, చీఫ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఎస్వీబీసి సిఈఓ వెంకట నగేష్, ఈఈ ప్రసాద్, డిప్యూటీ ఈఓలు రాజేంద్రుడు, అన్నవరం ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎఇఓ గోవింద రాజులు పాల్గొన్నారు.

కోల్‌కతాకు వెళ్లిన చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో నేడు తలపెట్టిన ర్యాలీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి అమరావతి నుంచి బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట మంత్రులు యనమల రామకృష్ణుడు, కమిడి కళా వెంకటరావు, నక్కా ఆనందబాబు, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు ఉన్నారు.

ఎన్టీఆర్‌కు కుటుంబ సభ్యుల నివాళి

సంక్షేమ పథకాలకు ఆధ్యుడు ఎన్టీఆర్ : బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



దేశంలో సంక్షేమ పథకాలు ప్రకటించి, అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని సినీ నటులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఎన్టీఆర్ ఘాట్‌ను సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఎన్టీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడని అన్నారు. బడుగు,బలహీన వర్గాలకు చేయూతనిచ్చి అధికారం కట్టబెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ గుర్తుండిపోతారని, తెలుగువారంతా ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలుగుజాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ ఎన్టీఆర్ అని, ఆయన గురించి ఎంత మాట్లాడినా తక్కువేనని నందమూరి రామకృష్ణ అన్నారు. అనంతరం నందమూరి సుహాసినీ మాట్లాడుతూ...తాత ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తామని, ఆయన స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం ఎల్లప్పుడు ఎన్టీఆర్ కృషి చేశారని కొనియాడారు. ప్రజలు ఆయనకు దేవుళ్లతో సమానమని, వారి కోసం ఎప్పుడూ పరితపించేవారని అన్నారు. ఎన్టీఆర్ మరణం లేని మహనీయుడని సినీ దర్శకులు క్రిష్ వ్యాఖ్యానించారు. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌తో పాటు కుటుంబ సభ్యులు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఎప్పటికీ తెలుగువారి గుండెల్లో ఆరాధ్యుడేనని కొనియాడారు నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఎన్టీఆర్ సమాధి వద్ద పుష్పాలుంచి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... ఎనీఆర్ ఆత్మ శాంతించలేదని, ఆయన ఆత్మ ఘోషిస్తూనే ఉందని అన్నారు. ఎన్టీఆర్ మహిళలను ఎంతో గౌరవించేవారని, కానీ నేటి టిడిపి నేతలు మహిళల పట్ల చాలా అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ ఘాట్‌కు పెచ్చులూడిపోతున్నాయని, ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ స్పందించి ఘాట్‌కు మరమ్మత్తులు చేయించాలని కోరారు.

లక్ష్యాన్నిబట్టి రుణాలివ్వాలి

బ్యాంకర్లకు సిఎం చంద్రబాబు సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ఫిబ్రవరి నెలాఖరులోగా 1.75 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందని, ఇందుకు అనుగుణంగా బ్యాంకర్లు నడుచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పేదలకు గృహనిర్మాణ కార్యక్రమం విజయవంతం అవ్వాలంటే బ్యాంకర్లు రుణాలు ఇచ్చి సహకరించాలని కోరారు. పట్టణ పేదలకు గృహనిర్మాణంపై సచివాలయంలో టిడ్కో, మెప్మా, పట్టణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణ మంజూరు కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు 44 బ్యాంకులు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించుకోవాలని సూచించారు.

'భారతీయుడు 2' షూటింగ్ ప్రారంభం



రజనీకాంత్ '2.0' విడుదల తర్వాత దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'భారతీయుడు 2'. కమల్ హాసన్, కాజల్ అగర్వాల్ ప్రధాన తారాగణంగా తమిళంలో రూపొందుతోంది. శుక్రవారం చెన్నైలో ఈ చిత్రం షూటింగ్ లాంఛనంగా ప్రారంభించారు. లైకా ప్రొడక్షన్ నిర్మాణంలో రూపొందుతోంది. అనిరుధ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ ముత్తురాజ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మూడు రోజుల క్రితమే కమల్ లుక్ విడుదలయి ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించిందని దర్శకుడు శంకర్ అన్నారు. 'ఓల్డర్ వైజర్ డెడ్ లైర్' అనే కాప్షన్‌తో విడుదలైన పోస్టర్ ఇప్పటికే ట్రెండ్ క్రియేట్ చేసిందని చెప్పారు. ఇండియన్‌తాతగా ఆయన లుక్ అదిపోయిందని సూర్యామూవీస్ నిర్మాత ఎ.ఎం. రత్నం తెలియజేశారు. ఈ చిత్రానికి సుభాస్కర్, కరుణామూర్తి నిర్మాతలు. ఎ.ఎం.రత్నం సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో వెన్నెల కిషోర్ కూడా ఓ హాస్య పాత్ర చేయనున్నాడు. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, తమిళ్ హీరో శింబు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తోంది. 2020లో ఈ సినిమా సంక్రాంతికి కానుకగా విడుదల కానుంది.


విక్రమ్ కుమార్


'మనం' ఫేమ్ విక్రమ్ కుమార్ దర్శకత్వంలో మరో తెలుగు సినిమా రాబోతుందని తెలిసింది. ఇప్పటి వరకూ తమిళంలో ఆయన ఓ చిత్రం పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం తెలుగు చిత్రంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని కాంబినేషన్‌లో ఆ చిత్రం రాబోతుంది. ఇప్పటికి కథ తుదిమెరుగుల్లో ఉంది. ఈనెలాఖరుకు

ఈసారి మహిళా సమస్యలపై...

ఫైనల్ వెర్షన్ కానుంది. ఈలోగా నాని తన కమిట్‌మెంట్స్‌ను పూర్తి చేసుకోనున్నాడు. నానికిది 24వ చిత్రం. ఈ చిత్రంలో నాయిక ఎవరనేది ఆసక్తికరంగా మారింది. 'మహానటి' తర్వాత కీర్తి సురేష్‌ను ఇందులో తీసుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. కథ ప్రకారం ఆమె అయితేనే కరెక్ట్‌గా సరిపోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. అంతర్లీనంగా మహిళల సమస్యలపై రూపొందే కథ కనుక నాయిక విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలో నాయిక వివరాలు తెలియజేస్తామని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రం రెగ్యులర్ చిత్రీకరణ ఫిబ్రవరి నుండి మొదలు కానుంది. పూర్తి థ్రిల్లర్‌గా ఉంటూనే చక్కటి సందేశం కూడా ఇమిడి ఉంటుందని సమాచారం. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ కెమెరామేన్ పి సి శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేయనున్నారు. తర్వలోనే ఈ చిత్రానికి సంబంధించి పూర్తి వివరాలను చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది.


నాని

14 గంటలు కుర్చీలోనే...


మాధవన్, నంబి నారాయణ్

మాధవన్ నటిస్తోన్న తాజా చిత్రం 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'. ఇందులో మాధవన్ శాస్త్రవేత్త నంబి నారాయణ్‌గా కనిపించబోతున్నాడు. ఆయన జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. రాజీవ్ రవీంద్రనాథన్, బిజో, గౌరవ్ వెంకటేష్‌లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో భాగంగా మాధవన్ తీవ్రంగా కష్టపడుతున్నాడు. నారాయణ్‌లా కనపడేందుకు హెయిర్‌స్టైల్, గడ్డం పెంచుతున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలను మాధవన్ ఇటీవలే సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ఇప్పుడు నారాయణ్ పాత్ర కోసం సిద్ధమవుతున్న మరో వీడియోను ఇన్‌స్టాగ్రామ్ షేర్ చేశాడు. 'ఆ పాత్రలో నటించేందుకు రెండేళ్లు పడితే, ఆ పాత్ర కోసం సిద్ధమవడానికి 14గంటలు కుర్చీలో కూర్చోవాల్సి వచ్చింది" అని పోస్ట్‌లో పేర్కొన్నారు. 'నంబి సర్ ఒరిజినల్ పాత్రలో నటించేందుకు చాలా ఆత్రుతగా ఉన్నా. ఆయన వయస్సు మరో 15 సంవత్సరాలు తగ్గింది. అయితే ఆ లుక్‌లో నేను ఎలా ఉంటానో తెలియదు. నా నిజ జీవితానికి మాత్రం దూరంగా ఉంటా. కానీ, కొన్నిసార్లు తారుమారు కూడా కావచ్చు. అయినా, ఉత్తమమైన దానికోసమే ప్రయత్నిస్తా" అని చెప్పుకొచ్చారు. ఈ చిత్రానికి అనంత్ మాహదేవన్, ఆర్ మాధవన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. అనంత మహదేవన్ మాట్లాడుతూ 'ఇస్రో గూఢచార్యానికి సంబంధించిన కేసు గురించి నేను విన్నాను. నంబి నారాయణ మీద గూఢచర్యం కేసు ఎలా బనాయించారు. దానిపై ఆ శాస్త్రవేత్త ఎలా పోరాడి తన నిర్ధోషిత్వాన్ని నిరూపించుకున్నాడు అన్నదానిపై పరిశోధన చేశాను. ఆ విషయాలను తెలుసుకోవడం కోసం నంబి నారాయణను కలిశాను. అతని జీవితానికి సంబంధించిన విషయాలన్నిటిపైనా అధ్యయనం చేశాను" అని తెలిపారు.

అందుకే సినిమాలు తిరస్కరిస్తున్నా

– దీపికా పదుకొనే



బాలీవుడ్‌లో హీరో కంటే ఎక్కువగా పారితోషికంగా పొందుతున్న కథానాయిక దీపికా పదుకొనే. ఏటా అత్యధిక పారితోషికం పొందుతున్న జాబితాలో ఈమె పేరే ప్రథమంగా ఉంటుంది. ఆమె నటిస్తున్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద అలాగే కోట్లు కురిపిస్తున్నాయి. మొన్న 'పద్మావత్' చిత్రమైతే ఏ హీరో చిత్రమూ కలెక్ట్ చేయని విధంగా తక్కువ సమయంలో రూ. 300 కోట్లు రాబట్టింది. తాజాగా ఆమె ప్రొడక్షన్ హౌస్‌ను ఏర్పాటు చేసి స్వంతంగా సినిమాలు చేస్తోంది. మొదటి చిత్రంగా యాసిడ్ బాధితురాలు లక్ష్మీఅగర్వాల్ జీవితాన్ని 'చాపాక్' పేరుతో తెరకెక్కిస్తోంది. అందులో టైటిల్ రోల్‌ను ఈమే పోషిస్తోంది. 51 మంది రియల్ వొమెన్ హీరోల జీవితాలపై ' ది డాట్ దట్ వెంట్ ఫర్ ఏ వాక్' పేరుతో ఓ పుస్తకాన్ని ప్రచురించారు. ఆ మహిళల్లో దీపికా పదుకొనే కూడా ఉంది. ఈ పుస్తకాన్ని దీపికా ఆవిష్కరించింది. అనంతరం ఆమె సినిమాలను తిరస్కరించడానికి కారణాలను వివరించింది.

" ఈ రోజు సినిమాల్లో అవకాశాల్లేవ్. సినిమాలు మారుతున్నాయి. సినిమాల్లో మహిళల స్థానమూ మారుతుంది. వాటితో పాటు పారితోషికం చెల్లించడంలోనూ మార్పు వస్తోంది. నా గురించి నేను మాట్లాడాలనుకుంటున్నా. నాకొచ్చిన గ్యాప్‌ను నేను మళ్లీ పూడ్చుకోగలను. నాతో నటిస్తున్న హీరోలు(మగవారు) పొందుతోన్న పారితోషికం, నేను తీసుకుంటున్న రెమ్యునరేషన్ విషయంపై విభేదాలు ఉన్నాయి. ఇటీవల ఓ సంఘటన జరిగింది. ఓ డైరెక్టర్ ఓ సినిమాలో చేసేందుకు ఛాన్స్ ఇచ్చారు. ఆ సినిమా చాలా క్రియేటివ్‌గా ఉంది. కానీ పారితోషికం విషయం చర్చకు వచ్చినప్పుడు నేను ఎంత చార్జ్ చేస్తానో చెప్పాను. అప్పుడు ఆ మనిషి వెనక్కి వెళ్లిపోయి వచ్చి నాతో ఓ మాట చెప్పాడు. 'హీరోకి సమానంగా పారితోషికం నీకు ఇవ్వలేను' అని చెప్పాడు. వెంటనే టాటా.. గుడ్ బై చెప్పేశాను. నా ట్రాక్ రికార్డు నాకు తెలుసు. నా పని గురించీ తెలుసు. నా సినిమా ఎలా ఆడాయాలో, అతని చిత్రాలు ఎలా ఆడాయాలో కూడా తెలుసు. ఇది అర్థం లేనితనం" అని చెప్పింది. అనంతరం దీపికా సినిమాలను తిరస్కరించడానికి కారణాలను వివరించింది. పురుషులకు, మహిళలకు సమానంగా పారితోషికం వస్తుందని ఆశిస్తున్నానని, కానీ అలా జరగడం లేదని పేర్కొంది. " ఈ రోజు నేను ఆ దిశగా అడుగులు వేయొచ్చు. నాకు నేను నిర్ణయాలు తీసుకొని రాత్రుళ్లు హాయిగా నిద్రపోవచ్చు. హీరోలతో సమానంగా పారితోషికం పొందడంలో గానీ, క్రియేటివ్‌గా నటించే విషయంలోగానీ ఆలోచించక్కర్లేదు. సినిమాల్లో నాకెలాంటి విలువ ఉంటుందో హీరోకీ అంతే. ప్రస్తుతం నేనే అలాగే కొనసాగుతున్నా" అని చెప్పింది.

చిరంజీవితో మరోసారి జోడీ


నయన తార

ప్రస్తుతం చిరంజీవి, నయన తార కలసి 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతోన్న ఈ చారిత్రక చిత్రంలో నయన తార సైరా భార్యగా నటిస్తోంది. ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత చిరంజీవి, కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇందులో కథానాయిక ఎవరు అన్నది మాత్రం ఇప్పటి వరకూ ప్రకటించలేదు. సాధారణంగా చిరంజీవి బాలకృష్ణ, వెంకటేష్ వంటి అగ్రహీరోలకు అనుష్క, నయనతార, తమన్నా, కాజల్ అయి ఉంటారు. అనుకున్నట్టే మరోసారి చిరంజీవి సరసన నయనతార కథానాయిక చేయనుందని తెలిసింది. ముందు ఈ పాత్ర కోసం నయనతో పాటు కాజల్, శ్రుతి హాసన్‌ను సంప్రదించారు. వీరిలో 63 ఏళ్ల చిరంజీవికి నయన తార అయితేనే సరిపోతుందని కొరటాల శివ చిత్రబృందం భావించింది. సినిమా వ్యాపార విలువ రీత్యా చూసినా నయనే కరెక్ట్ అని ఈ దర్శకుడి ఆలోచన. కాజల్ అగర్వాల్ ఇప్పటికే 'ఖైదీ నంబర్ 150'లో చేసింది. ఇక మిగిలింది శ్రుతి హాసన్. కానీ శ్రుతి కంటే నయనతార ఎంపికకే ఈ చిత్రబృందంలో సభ్యులు ఎక్కువ మంది మొగ్గ చూపారట.

నేనూ రాజ్‌పుత్‌నే

– కంగనా రనౌత్



బి.జె.పి మద్దతుతో కర్ణిసేన వివాదాలకు తెరతీయడం ఎప్పటికప్పుడు పరిపాటిగా మారుతోంది. గత ఏడాది దీపికా పదుకొనే చేసిన 'పద్మావత్' చిత్రంపై కూడా నానా రాద్ధాంతం చేసింది. చివరకు 'పద్మావతి' అనే టైటిల్‌ను 'పద్మావత్' అని మాత్రమే మార్చగలిగారు తప్ప మరేమీ చేయలేకపోగా.. ఆ చిత్రం విడుదలయ్యాక దీపికాను, దర్శకుడు భన్సాలీని ప్రశంసించడం వారి వంతైంది. ఇటీవల దీనికి సంబంధించిన వారే 'కేదార్‌నాథ్' చిత్రంపైనా ఇలానే వివాదం చేశారు. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించింది. ఇప్పుడు తాజాగా కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషించిన 'మణికర్ణిక' చిత్రంపై కొత్త వివాదానికి తెరలేపారు. బ్రిటీష్ వ్యక్తిని ప్రేమించిన వారి కథను భారతదేశంలో ఆడనీయబోమని, ఈ సినిమాలో రాణీలక్ష్మీబాయి ఇమేజ్ దెబ్బతిన్నా, బ్రిటీష్ వ్యక్తితో రాణి ప్రేమాయణం గురించి చూపించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారు అని హెచ్చరిస్తూ మహారాష్ట్రకు చెందిని కర్ణిసేన వింగ్ 'మణికర్ణిక' నిర్మాతలకు హెచ్చరించింది.

దీంతో ఆగకుండా కర్ణిసేన వేధింపులు రోజు రోజుకూ ఎక్కువవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కంగనా రనౌత్ వీటిపై స్పందించింది. "మణికర్ణిక' చిత్రాన్ని నలుగురితో కూడిన చరిత్రకారుల బృందం ధ్రువీకరించింది. అదే విధంగా సీబీఎఫ్‌సీ సెన్సార్ సర్టిఫికేట్ కూడా ఇచ్చింది. ఈ విషయం కర్ణిసేనకు తెలియజేశాం. అయినా కర్ణిసేన వేధింపులు ఆగడం లేదు. ఈ వేధింపులు ఆపకపోతే...నా గురించి తెలుసుకోవాలి..నేనూ రాజ్‌పుత్‌నే. వేధిస్తున్న వారిందరినీ నాశనం చేస్తా" అని కంగనా గట్టిగా హెచ్చరించింది. రాణి లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. మరాఠీ కుటుంబంలో పుట్టిన ఈమె ఝాన్సీ పాలకుడితో వివాహం తర్వాత లక్ష్మీబాయిగా మార్పు జరిగింది. ఝాన్సీరాణి జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. క్రిష్, కంగనా రనౌత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

లక్ష్మీస్ ఎన్టీఆర్



రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తోన్న చిత్రం 'లక్ష్మీస్ ఎన్టీఆర్'. ఈ చిత్రంలో ఎన్టీఆర్ పాత్రలో నటించే వ్యక్తిని ఓ వీడియో ద్వారా శుక్రవారం పరిచయం చేశారు. ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా "లక్ష్మీస్ ఎన్టీఆర్' పునర్జన్మదర్శనం' పేరుతో ఈ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. కానీ ఈ క్యారెక్టర్ చేస్తున్న వ్యక్తి పేరు మాత్రం వెల్లడించలేదు. ఎన్టీఆర్ పాత్రధారి కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తూ, కన్నీటిని ఆపుకొంటూ ఎన్టీఆర్ పాత్ర కనిపించింది. ఎన్టీఆర్, లక్ష్మీ పార్వతి జీవితాలపై నిజమైన కథను చూపించబోతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో లక్ష్మీ పార్వతిగా కన్నడ నటి యజ్ఞ శెట్టి నటిస్తున్నారు. ఇటీవల ఈమె లక్ష్మీపార్వతి పాత్రధారి లుక్, నారా చంద్రబాబు నాయుడు పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రాన్ని రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. కల్యాణ్ మాలిక్ సంగీతం అందిస్తున్నారు. ఈనెల 24న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

'మహాలక్ష్మి' చిత్రీకరణ పూర్తి



తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న 'దట్ ఈజ్ మహాలక్ష్మి' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. సాధారణ యువతి నుంచి అసాధారణ మహిళగా ఎలా మారుతుందనే కథతో సినిమా తెరకెక్కుతోంది. ఈ మధ్యే విడుదలైన టీజర్‌కు అనూహ్య ఆదరణ వచ్చిందని యూనిట్ చెప్పింది.. అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. మైఖేల్ ట్యాబ్యురియస్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా టైజాన్ ఖొరాకివాలా సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. మెడైంటే ఇంటర్నేషనల్ బ్యానర్‌పై మను కుమరన్ ప్రొడక్షన్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. నటి పరుల్ యాదవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా ఉన్నారు. తమన్నాను ప్రముఖ బాలీవుడ్ క్రిటిక్స్ రాజీవ్ మసంద్, అనుపమ్ చోప్రా ఇంటర్వ్యూ చేసి సినిమా ప్రమోషన్‌ను మొదలు పెట్టారు. 'క్వీన్' రీమేక్ దక్షిణాదిలో నాలుగు భాషల్లో రీమేక్ అవుతున్న సందర్భంగా చిత్రంలోని లీడ్‌రోల్ చేసిన నాయికలుతో రాజీవ్ మసంద్, అనుమపచోప్రా జరిపిన ఇంటర్వ్యూకు వారంతా హాజరయ్యారు. ఈ ఫొటోను తమన్నా తన ట్విట్టర్‌లో షేర్ చేసింది.

అభిమానం రెట్టింపు అయింది


నిత్యా మీనన్

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం ఆధారంగా తమిళ దర్శకురాలు ప్రియదర్శిని 'ది ఐరన్ లేడీ' అనే టైటిల్‌తో బయోపిక్‌ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. జయలలిత పాత్రలో నిత్యామీనన్ నటిస్తోంది. జయలలిత పాత్రలో నటించడం గురించి మొదటిసారిగా నిత్యా మీనన్ మాట్లాడుతూ 'జయలలితపై ఉన్న అభిమానం, గౌరవమే నన్ను ఆమె పాత్రలో నటించేలా చేసింది. తన జీవితం గురించి తెలుసుకుంటుంటే ఆమెపై అభిమానం రెట్టింపు అవుతుంది. నిజంగా రాజకీయాల్లో ఆమె సాధించిన విజయాలు ఇంకెవ్వరి వల్ల సాధ్యం కావు' అని నిత్యా మీనన్ చెప్పుకొచ్చింది. ఇటీవలే జయలలిత పాత్రలో ఉన్న నిత్యా మీనన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈలుక్‌లో నిత్యా మీనన్ అచ్చం జయలలితలా కనిపించింది. జయలలిత లాంటి బలమైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించాలంటే నిత్యామీనన్ లాంటి బలమైన నటి అయితేనే ఆ పాత్రకు న్యాయం జరుగుతుందని దర్శకనిర్మాతలతో జయలలిత అభిమానులు కూడా భావిస్తున్నారు.

జర్నీ



అందాల తీరం.. కోవలమ్

కేరళ. ఈ పేరు వినగానే ఇటీవల ప్రకృతి ప్రకోపానికి గురైన సముద్ర తీరం గుర్తుకొస్తుంది. పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకునే కేరళ తీరం ఆ ఉపద్రవం కారణంగా చిగురుటాకులా వణికింది. అలాంటి ప్రదేశం అనతికాలంలోనే పూర్వవైభవాన్ని సంతరించుకుంది. తీరం మాటున దాగిన పచ్చని పొలాలతో కొండల నడుమ కొబ్బరి, అరటిచెట్లు ఎప్పటిలాగానే.. సందర్శకులకు సాదర ఆహ్వానాన్ని పలుకుతున్నాయి. అంతేకాదు, ఇక్కడ గడిపే ప్రతిక్షణం జీవితంలో మర్చిపోలేని అనుభూతుల సమ్మేళనమే. చల్లగా పాదాలను పలకరిస్తూ దోబూచులాడే సముద్రపు కెరటాలను మనసారా పలకరించాలంటే కేరళలోని కోవలమ్ బీచ్‌లో అడుగులు వేయాల్సిందే. ఈ ప్రాంతానికి.. పర్యాటక దృష్టితో వచ్చే పర్యాటకులు ఎవరైనా సముద్ర తీరాన్ని ఆస్వాదించకుండా వెళ్ళరు. ఇంకా అనేక ప్రత్యేకతల గల కేరళలోని కోవలమ్ తీరపు అందాలే ఈ వారం 'జర్నీ' విశేషాలు...

మా మిత్రబృందంతో కోయంబత్తూరు నుంచి రైలు ప్రయాణం చేసి ఉదయాన్నే కేరళ చేరుకున్నాం. తిరువునంతపురంలోని రైల్వేస్టేషన్‌లో ట్రైన్ దిగాక, అక్కడి నుంచి కోవలమ్ బీచ్‌కు బస్‌లో వెళ్లడానికి సిద్ధమయ్యాం. అదే మార్గంలో వెల్లాయని సరస్సు ఉందని స్థానికుల ద్వారా తెలిసింది. తిరువునంతపురం జిల్లాలో నుంచి ప్రవహించే అతి పెద్ద మంచి నీటి సరస్సు వెల్లాయని. స్థానికులు దీన్ని వెల్లాయని కాయల్ అని పిలుస్తారు. మా మార్గంలో తొమ్మిది కిలో మీటర్ల దూరం ప్రయాణం తర్వాత అక్కడికి చేరుకున్నాం. అక్కడికి వెళ్లగానే పర్యాటకులు ఎక్కువగా సందర్శించే విహార కేంద్రాల్లో వెల్లాయని సరస్సు ఒకటని అర్థమైంది. కోవలమ్ వెళ్లేవారు ఒక్కసారైనా ఆ సరస్సును చూడాల్సిందే. తాజాగా ఉండే స్వచ్ఛమైన నీలిరంగు నీళ్ళతో సరస్సు చాలా అందంగా కనిపించింది. ఏటా ఓనం పండగ సందర్భంగా పడవ పందాలు ఇక్కడ నిర్వహిస్తారు. వీటిని చూడడానికి వందల సంఖ్యలో ప్రజలు వస్తారు. ఓనం పండగ రోజుల్లో కోవలమ్‌లోగానీ, చుట్టుపక్కలగానీ జరిగే పడవ పందాలను తప్పకుండా చూడవలసిందే. సరస్సు మీద వెన్నెల పడగానే ఈ ప్రాంతం అంతా మనోహరంగా మారిపోతుందని స్థానికులు చెప్పుకొచ్చారు. ఆ దృశ్యాన్ని చూడడానికి పర్యాటకులు రాత్రిదాకా వేచి ఉంటారట! మాకు అంత సమయం లేకపోవడంతో మేం అయిష్టంగానే అక్కడి నుంచి బయలుదేరాం.



ఎగసిపడే కెరటాలు!

మా ప్రయాణం మొదలయ్యాక క్రమక్రమంగా రద్దీ తగ్గుతూ వచ్చింది. వెల్లాయని లేక్ నుంచి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలోనే కోవలమ్ బీచ్ ఉంది. ఇక్కడికి ఏటా దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తూ ఉంటారు. రోడ్డుకు ఇరువైపులా కొబ్బరిచెట్లు, అరటిచెట్లు మా బస్సుతో పోటీపడుతూ పరిగెత్తుతున్నట్లు అనిపించింది. పచ్చని పంటపొలాలు, లెక్కలేనన్ని జలాశయాలతో ప్రకృతి ఆహ్వానం పలికిన అనుభూతి కలిగింది. అలా అరగంట ప్రయాణం తర్వాత కోవలమ్ బస్‌స్టాండ్ చేరుకున్నాం. అక్కడికి కూత వేటు దూరంలో ఉన్న సముద్రం తీరానికి కాలి నడకన వెళ్ళాం. కనుచూపు మేరలో ఎగిసిపడుతోన్న సముద్రపు కెరటాలు కనిపించాయి. దారి మధ్యలోనే హోటళ్ళు, దుకాణాలు చాలానే ఉన్నాయి. మేం విడిది చేయాల్సిన హోటల్ సముద్రానికి దగ్గరగానే ఉంది. మాకు కేటాయించిన రూమ్ బాల్కనీలోంచి సముద్రపు చల్లగాలుల్ని ఆస్వాదించాం.





మాటలకందని స్పర్శ

కాస్త విశ్రాంతి తర్వాత సమయం వృథా చేయకూడదనే నిర్ణయానికి వచ్చాం. సముద్రతీరం వైపుగా పరుగులు పెట్టాం. చెప్పులు లేకుండా సముద్రంలో నడుస్తూ ఉంటే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేం. అరికాళ్లను సుతిమెత్తగా ముద్దాడే నీటి అలల స్పర్శ కలిగించే అనుభూతిని మాటల్లో చెప్పలేం. ఇసుక తెన్నులపై నుంచి తీరపు సౌందర్యాన్ని చూడగానే మాకు గోవా బీచ్ గుర్తుకొచ్చింది. పర్యాటకులను, విదేశీయులను ఆకర్షించడంలో గోవా కంటే కేరళ ఏం తీసిపోదని అర్థమైంది. వాస్తావానికి హవా బీచ్, లైట్‌హౌస్ బీచ్, సముద్ర బీచ్ అని కోవలమ్ బీచ్‌ను మూడు భాగాలుగా విభజించారు. హవా, లైట్‌హౌస్ బీచ్‌లు రెండూ ఎదురెదురుగానే ఉంటాయి. హోరెత్తే శబ్దాలతో, దగ్గరగా వచ్చి వెళ్తున్న అలలు మమ్మల్నీ మైమరపింపజేశాయి. అక్కడి నుంచి వచ్చాక హోటల్లోనే భోజనం చేశాం. ఇక్కడ హోటల్స్‌లో మీల్స్ చాలా ఖరీదనే చెప్పాలి. దానికంటే బయట తక్కువ ధరకే రుచికరమైన భోజనం దొరుకుతుందని స్థానికుల ద్వారా తెలుసుకున్నాం.


లయ తప్పని.. అలల సవ్వడి!

తీరప్రాంతానికి చివర్లో లైట్‌హౌస్ టవర్ ఉంది. దానిపేరే ఈ ప్రాంతానికి లైట్‌హౌస్ బీచ్‌గా పెట్టారు. తీరం ఆరంభం నుంచి చూస్తే చాలా చిన్నగా కనిపించింది. దానికి చేరువగా అడుగులు వేసేకొద్దీ ఆ పేరు ఎందుకు పెట్టారో అర్థమయింది. సందర్శకులు టవర్ పైకి వెళ్లడానికి పురాతనమైన మెట్లు ఉన్నాయి. అలా భయం భయంగా పైకి వెళ్ళాం. చివరకు చేరుకున్నాక అక్కడున్న కిటికీల గుండా సముద్రపు గాలి జోరుగా వీస్తోంది. ఆ ఉప్పగాలి శరీరాన్ని తాకగానే భయం పటాపంచలై కేరింతలు మొదలయ్యాయి. టవర్‌పై వీచే గాలితో.. చలి కూడా ఎక్కువగానే తాకింది. ఈ..గాలి తీవ్రత హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పుడు ఉన్నంతగా అనిపిస్తుంది. 118 అడుగుల ఎత్తు ఉన్న ఈ లైట్‌హౌస్ పైకి ఎక్కి కోవలమ్ బీచ్ మొత్తాన్ని వీక్షించాం. అదో విహంగ వీక్షణం అనిపించింది. అలా బీచ్ అందాలు చూస్తూ ఉంటే సమయం తెలియలేదు. సాయంత్రం అవ్వగానే అలల సవ్వడి మా చెవులకు వీనులవిందుగా తాకింది. సముద్రమంతా చీకటి అల్లుకుంది. కేరళ రాష్ట్రంలో మేము చూసిన పర్యాటక ప్రదేశాల్లో ఈ కోవలమ్ బీచ్‌కు ప్రత్యేక స్థానం ఇవ్వాల్సిందే!

- నవీన్ పలుచూరి, పర్యాటకుడు

మౌంట్ అబూ

రాజస్థాన్‌లోని సిరోహి జిల్లాలోగల మౌంట్ అబూ ప్రాంతం మంచి పర్యాటక విడిది కేంద్రంగా పేరొందింది. సుందరమైన వాతావరణం. చుట్టూ కొండలు, అద్భుతంగా నిర్మించిన కోటలు. అనేక ధార్మిక కేంద్రాలకు నెలవు. ఇది ఆరావళి పర్వత శ్రేణులలోని ఎత్తయిన శిఖరం. 1220 మీటర్ల ఎత్తులో ఉంటుంది. సందర్శకులు మౌంట్ అబూను ప్రముఖ చారిత్రక, పురాతన ప్రాంతంగా భావిస్తారు. ఇన్ని విశిష్టతలు ఉండటం వల్ల రాజస్థాన్ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది. ప్రధానంగా వేసవి కాలంలో, వానాకాలంలో పర్యాటకులు ఎక్కువగా మౌంట్ అబూను సందర్శిస్తుంటారు. మౌంట్ అబూతో పాటు చూడదగిన ప్రదేశాలు చుట్టూ చాలానే ఉన్నాయి. వాటిలో నక్కి సరస్సు, సన్సెట్ పాయింట్, టోడ్ రాక్, ది గురు శిఖర్ పీక్, మౌంట్ అబూ వన్యప్రాణి అభయారణ్యం ఈ ప్రాంతంలో చూడవలసిన ప్రధాన ఆకర్షణీయ ప్రదేశాలు. మౌంట్ అబూ చేరుకోవడానికి చక్కటి రోడ్డు మార్గం, విమాన సౌకర్యం ఉంది. ఇక్కడి వాతావరణం సంవత్సరం పొడవునా ఆహ్లాదకరంగా ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో విడిది చేయడానికి ఎంతో అనుకూలం. ★



దాయ్ కా మహల్



మధ్యప్రదేశ్‌లోని థార్ జిల్లాలో ఉన్న అతి పురాతన నగరం 'ముండు' ప్రాంతం. రాతి విస్ఫోటనం వల్ల ఈ పురాతన నగరం ఏర్పడిందని చెబుతారు. అద్భుతమైన నిర్మాణశైలిని కలిగిన కోటలు ఇక్కడ అనేకం ఉన్నాయి. దాంట్లో ఒకటి 'దాయ్ కా మహల్'. దీన్నే 'నానీ ప్యాలెస్' అని కూడా పిలుస్తారు. దాయ్ అంటే అర్థం ఆయా రాజవంశీయులు వారి పనుల మీద బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వారి పిల్లల ఆలనాపాలనా చూసుకునే ఆయాల కోసం నిర్మించిన ప్రత్యేకమైన రాతి బంగ్లా. ఇది ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రం. ఎందుకంటే ఇక్కడ ఉండే స్మారక కట్టడాలు, రాజభవనాలు నేటికీ సజీవంగా చెక్కుచెదరకుండా ఉన్నాయి. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మధ్యప్రదేశ్ టూరిజం శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. దాయ్ కా మహల్ కంటే దీనిని ఆనుకుని ఉండే 'దాయ్ కి చోటి బెహన్ కి మహల్' బంగ్లాలు అద్భుతమైన నిర్మాణ శైలిని కలిగి ఉంటాయి. ★

సహజ అందాల గాలిబోర్

ప్రకృతిలోని సహజ అందాలకు నిలయం 'గాలిబోర్'. ఈ ప్రదేశం బెంగళూరుకు 110 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఆర్కావతి, కావేరి నదుల సంగమం. గాలిబోర్ కావేరి వన్యప్రాణుల సంరక్షణాలయపు అడవుల మధ్యలో ఉంటుంది. ఈ గాలిబోర్ ప్రాంతం చేపలు పట్టడానికి, నేచర్ క్యాంపులకు ప్రసిద్ధి. కావేరి నది ఒడ్డున పచ్చటి చెట్ల నడుమ ఉండే ఈ ప్రాంతం.. ఆహ్లాదకరమైన వాతావరణానికి పెట్టింది పేరు. ఆడవిలో ఉండే గాలిబోర్ అనే కొండ పేరునే ఈ ప్రాంతానికి పెట్టారు. చుట్టూ పర్వతశ్రేణులు గల పచ్చని వాతావరణంలో సేద తీరాలనుకునే వారికి గాలిబోర్ సందర్శన సరైన ఎంపిక. ఈ ప్రాంతంలో చేపలు పట్టి, తిరిగి అక్కడే వదిలేయాలి. మహసీర్ చేపలు ఇక్కడ ఎక్కువగా దొరుకుతాయి. దీనితో పాటు కార్న్, క్యాట్ ఫిష్ వంటి చిన్న చేపలు కూడా ఉంటాయి. గాలిబోర్‌లో సుమారు 220 పక్షి జాతులు ఉన్నాయి. పర్యాటకులు ఎక్కువగా పక్షులను, అడవి అందాలను చూడటానికి ఇక్కడికి వస్తుంటారు. ఈ అడవిలో ఎక్కువగా సంబార్, మచ్చల జింక, ఏనుగులు, చిరుతపులులు, అడవి ఎలుగుబంట్లు, అడవి ఉడుతలు, మలబార్ ఉడుతలు, గుంట నక్కలు, కొండ చిలువలు, నాగుపాములు, వైపర్లు వంటి ఎన్నో జీవరాశులను ఇక్కడ చూడొచ్చు. వీటితోపాటు మొసళ్ళు, తాబేళ్ళు, ఊసరవెల్లులు పర్యాటకులను మరింత ఆకర్షిస్తాయి. గాలిబోర్ ప్రాంతం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నుంచి మే వరకూ చేపలు పట్టేందుకు అనువుగా ఉంటుంది. ★



చిన్నారి



జోక్:

శీను : రమేష్ నీ మెయిల్ పాస్‌వర్డ్ నాకు తెలిసిపోయింది రా.. నేను చూసేశా!

రమేష్ : ఔనా! ఏమిటో చెప్పు..

శీను : ఐదు స్టార్లు


పొడుపు కథ

దోసెడు నీళ్ళలో
దొరసాని
జలకమాడింది

జవాబు : కొబ్బ



నీడ కనిపెట్టండి



పిల్లలూ! ఈ చిత్రంలో కొన్ని జంతువులూ, వాటి నీడలూ ఉన్నాయి. ఏ నీడ దేనిదో.. కనిపెట్టి జత పరచండి!

నెమలి

పింఛం విప్పుతుంది
అందం చూపుతుంది
నాట్యం చేస్తుంది
మనసును దోస్తుంది
అటు ఇటు చూస్తుంది
చెంగున ఎగురుతుంది
జాతీయ పక్షి నెమలి
అందానికి గుర్తు నెమలి






సంగీత
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల
మెయిన్,హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా

రంగులు వేయండి!



పిల్లలూ..! ఇక్కడ మీకెంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా? దానికి రంగులు వేయండి!

నేను గీసిన బొమ్మ



ఎం. ఇజార్,
6వ తరగతి,
జెడ్.పి.హెచ్. స్కూలు,
పెనుమాక,
తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన
మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

సెమీస్‌లో సైనా

- కిదాంబి పరాజయం
- మలేషియన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

కౌలాలంపూర్ : మలేషియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి సైనా నెహ్వాల్ దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోటీలో సైనా 21-18, 23-21 పాయింట్ల తేడాతో వరుససెట్లలో జపాన్‌కు చెందిన ఒకుహారాను చిత్తుచేసింది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 23-21, 16-21, 17-21 పాయింట్ల తేడాతో నాల్గోసీడ్ సన్-వాన్-హూ(కొరియా) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఏడో సీడ్ సైనా తొలిగేమ్‌లో 9-15తోనూ, రెండోగేమ్‌లో 14-18తో వెనుకబడ్డా ఆ సెట్‌లను చేజిక్కించుకోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌ను నెహ్వాల్ కేవలం 48 నిమిషాల్లోనే ముగించగా, ముఖాముఖి రికార్డును 8-4కు పెంచుకుంది. శనివారం జరిగే సెమీఫైనల్ పోరులో సైనా నెహ్వాల్ స్పెయిన్‌కు చెందిన మాజీ ఛాంపియన్ కరోలినా మారిన్‌తో తలపడనుంది.

నేడు బాస్కెట్‌బాల్ ఫైనల్ పోటీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో 31 జట్లు, మహిళల విభాగంలో 14 జట్లు పాల్గొన్నాయి. మహిళా విబాగంలో రామచంద్రపురం-ఎ జట్టు విఎన్ఆర్ హైదరాబాద్ జట్టుపై 47-42 పాయింట్లతోనూ, అనంతపురం జట్టు జిఎస్‌సి గుంటూరుపై 68-48 పాయింట్లతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో సెంట్రల్ ఎక్సైజ్ హైదరాబాద్ జట్టు ఎపి పోలీస్ జట్టుపై 55-37 పాయింట్లతో, ఐఐసి సికింద్రాబాద్ జట్టు వైజాగ్ జట్టుపై 72-44 పాయింట్లతోనూ గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ పోటీలు శనివారం జరగనున్నాయి.

రంజీట్రోఫీ సెమీస్‌లో కర్ణాటక

బెంగళూరు : రంజీట్రోఫీ సెమీఫైనల్లోకి కర్ణాటక జట్టు ప్రవేశించింది. శుక్రవారం కర్ణాటక గౌతమ్ 4/54, గోపాల్ 52/3 దెబ్బకు రాజస్తాన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 222 పరుగులకే పరిమితమైంది. దీంతో కర్ణాటక 185 పరుగుల లక్ష్యాన్ని ఛేధించాల్సి రాగా, ఆ జట్టు 47.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో అజేయంగా 83 పరుగులు చేసిన కర్ణాటక బ్యాట్స్‌మన్ వినయ్‌కుమార్‌కు మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



హ్యాండ్‌బాల్ ట్రోఫీ విజేత ప్రకాశం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ క్రీడా ప్రాంగణంలో రెండ్రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రకాశం జట్టు విన్నర్‌గా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. మొత్తం 11 జిల్లా జట్లు పాల్గొనగా ఎనిమిది జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరాయి. క్వార్టర్ ఫైనల్‌లో విశాఖపట్నం జట్టుపై పశ్చిమ గోదావరి 12-0 గోల్స్ తేడాతో, రెండవ ఫైనల్‌లో కడప జట్టు శ్రీకాకుళం జట్టుపై 05-04 తేడాతో, మూడవ ఫైనల్ ప్రకాశం జట్టు, తూర్పు గోదావరిపై 7-0 గోల్స్‌తో గెలిచాయి. పశ్చిమ గోదావరి, ప్రకాశం, గుంటూరు, కడప జట్లు సెమీఫైనల్‌కు చేరగా, తొలి సెమీస్‌లో పశ్చిమ గోదావరి జట్టు కడపను ఓడించింది. రెండవ సెమీ ఫైనల్‌లో ప్రకాశం జట్టు గుంటూరు జట్టుపై 06-01 గోల్స్ తేడాలో గెలిచి ఫైనల్‌కు చేరింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో పశ్చిమ గోదావరిపై ప్రకాశం జట్టు 12-11 గోల్స్ తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో పశ్చిమగోదావరి జట్టు, 3వ స్థానంలో గుంటూరు జిల్లా జట్టు నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పోతుల రామారావు మాట్లాడారు. అనంతరం పోటీలలో గెలిచిన వారికి మెడల్స్, కప్‌లు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు.



భారత్ తొలిసారి ఆస్ట్రేలియాగడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను చేజిక్కించుకొని రికార్డు నెలకొల్పింది. శుక్రవారం జరిగిన ఆఖరి వన్డేలో స్పిన్‌గన్ చాహల్ తన పదునైన గుగ్లీ, లెగ్‌బ్రేక్‌లతో ఆరు వికెట్లు తీసి కంగారుల వెన్ను విరవడంతో ఆతిథ్యజట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి 230 పరుగులకే పరిమితమైంది. టీమిండియా 231 విజయ లక్ష్యంలో తొలుత తడబడినా కోహ్లీ(46) ఆచితూచి ఆడుతూ ఆర్ధసెంచరీకి ముందు అవుటయ్యాడు. వన్డే సిరీస్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న ధోని తన డైనమిక్ ప్రదర్శనతో అజేయంగా 87 పరుగులతోపాటు జాదవ్(61)తో కలిసి నాల్గో వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించి మ్యాచ్‌ను, వన్డే సిరీస్‌ను భారత్‌కు సంపాదించిపెట్టాడు.



కంగారూలకు చా'హల్'

- తొలిసారి ఆసీస్ గడ్డపై వన్డే సిరీస్ కైవసం
- మళ్లీ మెరిసిన ధనాధన్ ధోని
- జాదవ్ అర్థ సెంచరీ



ధోనీ 87 (నాటౌట్) పరుగులు

మెల్‌బోర్న్: నిర్ణయాత్మక మూడోవన్డేలో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చాహల్ స్పిన్ మాయాజాలానికి కంగారుజట్టు 230 పరుగులకే పరిమితమైంది. ఆ 231 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ధోనీ మరోసారి తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ 87 పరుగులతో మెరిశాడు. రాయుడు స్థానంలో చోటు దక్కించుకున్న కేదర్ జాదవ్(61 నాటౌట్) రాణించి భారత్‌కు వన్డే సిరీస్‌ను సంపాదించిపెట్టారు.

నిర్ణయాత్మక మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ జట్టును కోహ్లీ సేన ఆదినుంచే కట్టడి చేస్తూ వచ్చారు. తొలి 10 ఓవర్లలోనే ఓపెనర్లను కోల్పోయి ఆతిథ్య జట్టు కష్టాల్లో పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షాన్ మార్ష్(39), ఖవాజా(34) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ అది ఫలించలేదు. వీరి భాగస్వామ్యాన్ని చాహల్ విడగొట్టాడు. ఒకే ఓవర్‌లో రెండు బంతుల తేడాతో మార్ష్, ఖవాజాను పెవిలియన్‌కు పంపించాడు. ఆసీస్ జట్టులో హ్యాండ్స్‌కోంబ్(58) అర్ధశతకంతో రాణించి జట్టు స్కోరును పెంచాడు. ఆఖరి వన్డేలో కుల్దీప్ స్థానంలో చోటు దక్కించుకున్న యజ్వేంద్ర చాహల్ స్పిన్ మాయాజాలంతో ఆసీస్‌ను కట్టడి చేశాడు. అయితే ఆ తర్వాత హ్యాండ్స్‌కాంబ్‌ను కూడా చాహల్ ఔట్ చేయడంతో ఆ తర్వాత ఆసీస్ వికెట్లు వెంట వెంటనే కుప్పకూలాయి. ఈ వన్డేలో చాహల్ తన 10 ఓవర్లలో కోటాలో 42 పరుగులిచ్చి ఆరు వికెట్లను పడగొట్టి కెరీర్ బెస్ట్ బౌలింగ్ నమోదు చేయడం విశేషం. దీంతో భారత బౌలర్ల ధాటికి 48.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భువనేశ్వర్, షమీకి చెరో రెండు వికెట్లు దక్కాయి. మ్యాచ్ ప్రారంభానికి ముందు వరుణుడు కొంత అంతరాయం కలిగించడంతో ఆట 15 ని॥లు ఆలస్యంగా ప్రారంభమైంది. 231 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టు స్కోర్ 15 పరుగుల వద్ద రోహిత్ శర్మ (9) సిడెల్ చేతిలో పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లీతో కలిసి ధావన్ కొంతసేపు పోరాడినా 17వ ఓవర్లో 59 పరుగుల వద్ద ఔటయ్యాడు. తరువాత ధోని-కోహ్లీతో కలిసి 54 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. అర్ధ శతకానికి చేరువైన విరాట్‌ను 30వ ఓవర్లలో రిచర్డ్‌సన్ పెవిలియన్ పంపించాడు. విరాట్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన జాదవ్ తొలుత పరుగులు చేసేందుకు కష్టపడినా చివరి ఓవర్లలో జాదవ్ సమయోచితంగా వరుస బౌండరీలు సాధించి అర్ధశతకం అందుకున్నాడు. క్రీజులో నిలదొక్కున్న మిస్టర్ కూల్ ఆసీస్ బౌలర్లను ఎదుర్కొంటూ 87 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆసీస్ బౌలర్లు రిచర్డ్‌సన్, సిడెల్, స్టోనిస్‌కు తలా ఒక వికెట్ లభించాయి. చాహల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ధోనీకి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి. దీంతో ధోని మూడు వన్డేల్లో మూడు అర్ధశతకాలు చేసి విమర్శకులకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చినట్టైంది. ఆఖరి వన్డేలో టీమిండియా గెలిచి 2-1 తో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకోగా, టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసి, టెస్టు సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

స్కోర్ బోర్డు...

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : క్యారీ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 5, ఫించ్ (ఎల్‌బి) భువనేశ్వర్ 14, ఖవాజా (సి అండ్ బి) చాహల్ 34, షాన్ మార్ష్ (స్టంప్) ధోనీ (బి) చాహల్ 39, హ్యాండ్స్‌కోంబ్ (ఎల్‌బి) చాహల్ 58, స్టోనిస్ (సి) శర్మ (బి) చాహల్ 10, మ్యాక్స్‌వెల్ (సి) భువనేశ్వర్ (బి) షమి 26, రిచర్డ్సన్ (సి) జాదవ్ (బి) చాహల్ 16, జంపా (సి) శంకర్ (బి) చాహల్ 8, సిడెల్ (నాటౌట్) 10, స్టాన్‌లేక్ (బి) షమి 0, అదనం 10 (మొత్తం 48.4 ఓవర్లలో 230 పరుగులు)

బౌలింగ్ : భువనేశ్వర్ 8-1-28-2, షమి 9.4-0-47-2, శంకర్ 6-0-23-0, జాదవ్ 6-0-35-0, జడేజా 9-0-53-0, చాహల్ 10-0-42-6.

టీమిండియా ఇన్నింగ్స్ : రోహిత్ (సి) మార్ష్ (బి) సిడెల్ 9, ధావన్ (సి అండ్ బి) స్టోనిస్ 23, కోహ్లీ (స్టంప్) క్యారీ (బి) రిచర్డ్సన్ 46, ధోనీ (నాటౌట్) 87, జాదవ్ (నాటౌట్) 61, అదనం 8 (మొత్తం 49.2 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 234 పరుగులు)

బౌలింగ్ : రిచర్డ్సన్ 10-1-27-1, సిడెల్ 9-1-56-1, స్టాన్‌లేక్ 10-0-49-0, మాక్స్‌వెల్ 1-0-7-0, జంపా 10-0-34-0, స్టోనిస్ 9.2-0-60-1.

4వ రౌండ్‌కు ఫెదరర్, సిలిక్

- షరపోవా చేతిలో వాజ్నియాకి చిత్తు



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ నాల్గోరౌండ్‌కు స్విట్జర్లాండ్‌కు చెందిన మూడోసీడ్ ఫెదరర్, క్రొయేషియాకు చెందిన సిలిక్‌లు ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో ఫెదరర్ 6-2, 7-5, 6-3 సెట్ల తేడాతో ఫ్రిట్జ్(అమెరికా)పై, సిలిక్ 4-6, 3-6, 6-1, 7-7(10-8), 6-3 సెట్ల తేడాతో వెర్డాస్కో (స్పెయిన్) పై చెమ టోడ్చి నెగ్గాడు. ఇతర పోటీల్లో రెండోసీడ్ నదాల్, 20వ సీడ్ డిమిత్రోవ్ గెలిచారు. మహిళల సింగిల్స్ మూడోరౌండ్ పోటీల్లో కెర్బర్, క్విటోవా, స్టెఫెన్స్ గెలుపొందగా... మూడోసీడ్ వాజ్నియాకి 4-6, 6-4, 3-6 సెట్ల తేడాతో రష్యాభామ షరపోవా చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది.

నిరంకుశత్వంపై పోరాటం నేర్పింది ఎన్టీఆరే!

టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిరంకుశత్వాన్ని ఎదిరించడం నేర్పింది ఎన్‌టిఆర్‌నని, ఆయనే నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆధ్యుడు ఎన్టీఆరేనని అన్నారు. పేదరికంపై గెలుపే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. పెత్తందారీ విదానం ప్రధాని మోడీ రూపంలో ఉందన్నారు. అందుకే బిజెపిపైన ధర్మపోరాటం చేస్తున్నామన్నారు. దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించాల్సిన ఆవశ్యకతతో పాటు రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని, చంద్రబాబు ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎన్నికలకు కేవలం 100 రోజులే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టానికి కృషి చేయాలని చంద్రబాబు నేతలను కోరారు. శనివారం కోల్‌కతాలో జరిగే ర్యాలీకి వైసిపి, టిఆర్‌ఎస్ హాజరు కావడం లేదని, దీన్ని బట్టి ఆ రెండు పార్టీలు మోడీ కూటమిలో ఉన్నట్లేనని పేర్కొన్నారు.

20 శాతానికి మించి ఫిట్‌మెంట్ ఇవ్వలేం

- ఆర్టీసి పే కమిటీ భేటీలో యాజమాన్యం స్పష్టీకరణ
- నేడు అన్ని సంఘాలతో చర్చ: ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి సిబ్బందికి 20 శాతానికి మించి ఫిట్‌మెంట్ ఇవ్వలేమని ఆర్టీసి యాజమాన్యం స్పష్టం చేసింది. విజయవాడలోని ఆర్టీసి హౌస్‌లో శుక్రవారం ఆర్టీసి వేతన సవరణ కమిటీ సమావేశం నిర్వహించారు. యాజమాన్యం ప్రతిపాదనలకు గుర్తింపు సంఘం నాయకులు ఒప్పుకోలేదు. కార్మికుల శ్రమకు తగ్గ ఫలితాన్ని లెక్కగట్టి 50 శాతం ఫిట్‌మెంట్ అడిగామని, ఆ దిశగానే ఫిట్‌మెంట్ ఇవ్వాలని ఇయు నాయకులు పట్టుబట్టారు. అందుకు యాజమాన్యం ఒప్పుకోకపోతే సమ్మెకు కూడా వెనకాడబోమని తెలిపారు. చర్చలపై ప్రతిష్టంభన ఏర్పడటంతో ఈ నెల 22న మరోసారి సమావేశం కావాలని కమిటీ నిర్ణయించింది. ఇంత వరకూ చర్చల ద్వారా అంగీకరించిన కారుణ్య నియామకాల పక్రియను ఈ నెలఖరు నుండి ప్రారంభిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులైజేషన్ వెంటనే చేస్తామని, విధుల నుంచి తొలగించిన సిబ్బందిని ఉన్న ఖాళీల్లోకి తీసుకునేందుకు అంగీకరించింది. 2016 లీవ్ ఎన్‌క్యాష్‌మెంటును ఈ నెల 24 న చెల్లించేందుకు అంగీకరించింది. చర్చల్లో యాజమాన్యం తరపున ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కోటేశ్వరరావు, జి జయరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ఆర్థిక సలహాదారు రాఘవరెడ్డి, గుర్తింపు సంఘం తరపున ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, నాయకులు ఎం హనుమంతురావు, సుబ్రమణ్యం రాజు, ఆవుల ప్రభాకర్, జివి నరసయ్య, సిద్దిక్, ఎమ్‌డి ప్రసాద్, ఎస్‌విరావు తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం తీరుపై శనివారం అన్ని కార్మిక సంఘాలతో సమావేశమై ఇంత వరకూ జరిగిన విషయాల గురించి చర్చిస్తామని ఇయు నాయకులు వెల్లడించారు. పలు అంశాలను చర్చించి అవసరమైతే ఐక్య ఉద్యమానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

తక్షణమే వేతన సవరణ చేయాలి : కార్మిక పరిషత్ వినతి

ఆర్టీసి సిబ్బంది వేతన సవరణను తక్షణమే చేయాలని ఆర్టీసి కార్మిక పరిషత్ నాయకులు చైర్మన్ వర్ల రామయ్యకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వేతన సవరణ విషయంలో ఇప్పటికే 21 నెలలు జాప్యం జరిగిందని, కార్మికులు ప్రభుత్వం పై చాలా నమ్మకంతో ఉన్నారని, 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. సిబ్బందికి గృహ నిర్మాణం, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వ వృద్ధాప్య పింఛన్ అందించాలని విన్నవించారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉద్యోగం ఇవ్వాలని, నష్టాల్లో ఉన్న ఆర్టీసికి ప్రభుత్వం సాయం అందించాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రితో చర్చించి వేతన సవరణతో పాటు మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వి వరహాల్ నాయుడు, ముఖ్య ఉపాధ్యక్షులు ఎన్ఎస్ రావు, సంయుక్త కార్యదర్శి జి శ్రీనివాస్, కోశాధికారి ఎస్‌వి శేషగిరి, నాయకులు యార్లగడ్డ రమేష్; మల్లేశ్వరరావు ఉన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ పేలుడు

- రూ.100 కోట్ల వరకు ఆస్తినష్టం
- రెండు జెసిబిలతోపాటు 7 బైకులు దగ్ధం

ప్రజాశక్తి- గాజువాక, కూర్మన్నపాలెం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో సమీపంలో ఉన్న రెండు జెసిబిలతో పాటు ఏడు బైకులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.100 కోట్ల వరకు ఆస్తినష్టం కలిగిందని యాజమాన్యం ప్రతినిధులు పేర్కొన్నారు. వారం రోజుల పాటు బిఎఫ్-3లో ఉత్పత్తి నిలిపివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. విశాఖ ఉక్కులో వరుస ప్రమాదాలపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ 1, 2తో పాటు విస్తరణలో భాగంగా బిఎఫ్-3 నిర్మాణం చేశారు. ఇక్కడ పియర్స్ సహాయంతో ముడిసరుకులు జమ అవుతాయి. అనంతరం ద్రవ ఉక్కు ఎస్ఎంఎస్‌కి వెళ్తుంది. శుక్రవారం ఉదయం ఇక్కడ అధిక ఒత్తిడి కారణంగా బ్లోపైపు పేలిపోవడంతో పెద్దశబ్దంతో పేలుడు సంభవించింది. రా మెటీరియల్ హ్యాండిల్ చేసేందుకు వినియోగిస్తున్న రెండు జెసిబిలు దగ్ధమయ్యాయి. కార్మికులు పార్క్ చేసిన ఏడు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. మూడు లిఫ్ట్‌లు కాలిపోయాయి. 15 రోజులుగా ఫర్నేస్-1, 2లు మరమ్మతు కావడంతో 3వ ఫర్నేస్‌లోనే ఉత్పత్తి జరుగుతుంది. ఏడాదికి 7,200 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 9,200 మిలియన్ టన్నులను ఉత్పత్తి చేసేందుకు యాజమాన్యం కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిభారం పెరిగింది. ఇదే వరుస ప్రమాదాలకు కారణమవుతోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. భద్రతతో కూడిన పని ప్రదేశాలను కార్మికులకు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని, ఈ దిశగా కృషి చేయాల్సిన యాజమాన్యం ఉత్పత్తి ఒక్కటే లక్ష్యంగా పని చేయడం సరికాదని ఆరోపిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయలోపం, సరైన పరిశీలన లేకపోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కార్మికులు చెబుతున్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు (సిఐటియు) యు.రామస్వామి విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



విశాఖ స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్-3లో ప్రమాదం

కెరీర్ మ్యాపింగ్‌తోనే అద్భుత ఫలితాలు

- చండీగఢ్ యూనివర్శిటి హెచ్‌ఒడి, ప్రొఫెసర్ ప్రభ్‌దీప్ సింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మారుతున్న కాలంతో పాటు యువత సుశిక్షితులవ్వాలని, దీని కోసం ప్రతి విద్యార్ధికి సరైన కెరీర్ మ్యాపింగ్ చేయాలని అప్పుడే అద్భుత ఫలితాలు వస్తాయని, చండీగఢ్ యూనివర్శిటి మాస్ కమ్యునికేషన్స్ హెచ్‌ఒడి, అండ్ మీడియా హెడ్ ప్రొఫెసర్ ప్రభ్‌దీప్ సింగ్ అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత కెరీర్ కౌన్సెలింగ్‌పై విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. యువతకు కెరీర్ మ్యాపింగ్‌తో పాటు పారిశ్రామిక రంగం అవసరాలకు తగ్గట్టు సుశిక్షితులు అవ్వాలని అన్నారు. విద్యార్థుల నైపుణ్యానికి సంబంధించి పారిశ్రామిక అంచనాలకు తగినట్లుగా ప్రపంచ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలన్నీ తమ విద్యా విధానాల్ని సమూలంగా మార్చుకుంటున్నాయని తెలిపారు. కెరీర్‌కు సంబంధించి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఉచితంగా ఇస్తామన్నారు.

సతీష్‌ను విచారించిన సిబిఐ

- ఆయేషా మీరా కేసులో కొనసాగుతున్న దర్యాప్తు
- సత్యంబాబునూ ప్రశ్నించిన అధికారులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నర్సింగ్ విద్యార్థిని ఆయేషా మీరా (19) హత్య కేసు విచారణలో సీబీఐ దూకుడు పెంచింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కోనేరు సతీష్ సత్యంబాబులను శుక్రవారం విచారించారు. విజయవాడ సమీపంలోని గూడవల్లిలోని సతీష్ నివాసంలో ఆయనను అధికారులు దాదాపు గంటపాటు విచారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆయేషామీరా హత్య సమయంలో ఎక్కడున్నారు? దానికి సంబంధించిన ఆధారాలున్నాయా? వంటి వివరాలపై కూపీ లాగారు. అంతేకాకుండా అయేషామీరా తల్లి మొదటనుంచీ ఆరోపిస్తున్న విషయాలపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. వాటిపైనా పలు ప్రశ్నలు సంధించారు. ఆయన చెప్పిన సమాధానాలను రికార్డు చేశారు. అనంతరం లిఖితపూర్వకంగా కూడా వివరణ తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు నందిగామ అనాసాగరంలో సత్యంబాబును అధికారులు దాదాపు ఐదుగంటల పాటు విచారించారు. సత్యంబాబు నుంచి, అతని కుటుంబ సభ్యుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇబ్రహీంపట్నంలోని శ్రీదుర్గా హాస్టల్ నిర్వాహకులను, వార్డెన్‌ను, ఆయన భార్యను సిబిఐ అధికారులు విచారించనున్నారు. ఆరు గురు సభ్యులున్న సిబిఐ బృందం ఈ విచారణలో పాల్గొంది. పూర్తి బందోబస్తు మధ్య తలుపులు, కర్టెన్లు వేసి విచారించింది. సిబిఐ అధికారుల్లో ప్రొసీడింగ్ అధికారి జీవన్, సబ్‌ఇన్‌స్పెక్టర్ సాయికృష్ణతో పాటు మరో ఇద్దరు అధికారులున్నారు.

విచారణ అనంతరం బయటకు వచ్చిన సిబిఐ అధికారులను విలేకర్లు ప్రశ్నలడ గడానికి ప్రయత్నించినప్పటికీ వారు ఏమీ మాట్లాడలేదు. ఈ కేసులో ఇప్పటికే విజయవాడ కోర్టుకు చెందిన ముగ్గురు సిబ్బందిపై సిబిఐ అధికారులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసు డాక్యుమెంట్లు, సాక్ష్యాలు ధ్వంసం చేసిన విషయంలో పి.కుమారి, పి.వెంకటకుమార్, వై.సుబ్బారెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో సత్యంబాబు పోలీసులపైనే అనుమానం వ్యక్తం చేశాడు. వారికి ఉద్యోగోన్నతులు రావడం కోసమే తనపై నేరాన్ని మోపారని, ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురితో వారు మిలాఖత్ అయ్యారని ఆరోపించాడు.

కార్మికులకు న్యాయం చేయాలంటూ వినతి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మునిసిపల్ ఇంజనీరింగ్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికుల జీతాల అమలుకు సంబందించి ప్రభుత్వం శుక్రవారం జీఓ నెంబరు 30ని విడుదల చేసింది. ఇందులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులు, హెవీ వెయికల్ డ్రైవర్, చైన్ దళం, మలేరియా కార్మికుల ప్రస్తావన లేక పోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు కె. సామ్రాజ్యం, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావులు ఎంఎ యుడి ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్. కరికాల వళవన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వర్క్ సూపర్ వైజర్లకు రూ.17,500 ఇవ్వాల్సి ఉండగా రూ.15వేలు, మేస్త్రీకి రూ.15వేలకు కేవలం రూ.12వేలు, పంప్ ఆపరేటర్‌కు రూ.15వేలకు రూ.12వేలు,రికార్డు అసిస్టెంట్‌కు రూ.15వేలకు, రూ.12వేలు,బోర్‌వెల్ మెకానిక్‌కు రూ.15వేలకు రూ.12వేలు నిర్ణయించడం పట్ల సిఐటియు అభ్యంతరం వ్యక్తం చేసింది. నైపుణ్యానికి తగినట్లు ఆయా ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఫెడరల్ ఫ్రంట్‌పై టిడిపి అసత్య ప్రచారం

వైసిపి అధికారప్రతినిధి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫెడరల్ ఫ్రంట్‌పై టిడిపి నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని వైసిపి అధికార ప్రతినిధి జోగి రమేష్ అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా చంద్రబాబుకు పూనకం వచ్చిందని, పిచ్చి ముదిరిందని, ప్రజలు వేప మండలు, చీపుర్లతో పూనకం పోగొట్టాలని అన్నారు. ఎల్లో మీడియాలో టిడిపి నేతలు విషప్రచారం చేస్తున్నారన్నారు. మరో నేత పేర్ని నాని మాట్లాడుతూ చంద్రబాబు మానసిక స్థితిపై అనుమానాలు పెరుగుతున్నాయని, బాబు గోబెల్స్‌ను మించిపోయారని అన్నారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే పేటెంట్ కూడా చంద్రబాబుకే వచ్చిందన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68